ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-4-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 88 పేజీలు: 12 వెల: 6.50

**కెనడా ఎన్నికల్లో లిబరల్స్‌కే విజయం** 5లో

**అయోధ్యలో 42 అడుగుల ఎత్తయిన ధ్వజస్తంభం**



మంగళవారం బ్యాంకర్ల సమావేశంలో వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రులు, బ్యాంకుల ఉన్నతాధికారులు

## రూ. 6.60 లక్షల కోట్లతో
# రుణ ప్రణాళిక
### ప్రాజెక్టులకు బ్యాంకర్లు అండగా నిలవాలి
### ఎంఎస్‌ఎంఇలకు చేయూత: సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఏప్రిల్ 29,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంపద సృష్టి, పేదరిక నిర్మూలన లక్ష్యంగా పెద్దఎత్తున కార్యక్రమాలు వచ్చే నాలుగేళ్లలో చేపడుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఓవైపు స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు అనుగుణంగా పనిచేస్తూనే మరోవైపు 2029 కల్లా పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు, లక్ష్యాలపై ప్రధానంగా దృష్టి పెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దీనికి బ్యాంకులు సంపూర్ణ మద్దతివ్వాలన్నారు. 2025-26లో నిర్దేశించుకున్న క్రెడిట్ ప్లాన్ లక్ష్యాలను అధిగమించేలా కృషి చేయాలన్నారు. మంగళవారం సచివాలయంలో జరిగిన 231వ స్టేట్ లెవెల్ బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఫలితాలపై బ్యాంకింగ్ అధికారులతో చర్చించిన ముఖ్యమంత్రి, 2025-26 లక్ష్యాలను నిర్దేశించారు. నూరు శాతం టార్గెట్లు అధిగమించి దక్షిణ భారతదేశంలోనే మేటిగా ఉన్నందుకు ముఖ్యమంత్రి బ్యాంకర్లను అభినందించారు. సమావేశంలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ఏపీ యాన్యువల్ క్రెడిట్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... డ్వాక్రా మహిళలు, కౌలు రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఎదుగుదలకు ప్రత్యేకంగా ఏం చేయగలం అనేది బ్యాంకర్లు ఆలోచించాలని చెప్పారు.

**ఆర్థిక మద్దతుకే ఎస్‌ఎల్‌బిసి సమావేశాలు**

ముఖ్యమంత్రిగా తాను ఎప్పుడున్నా తరచూ ఎస్‌ఎల్‌బిసి సమావేశాలు నిర్వహించడానికి ప్రధాన కారణమన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు బ్యాంకుల మద్దతు కూడగట్టేందుకేనని అన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో సేవలు, పరిశ్రమల రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని... కానీ రాష్ట్ర విభజన తర్వాత ప్రాధాన్యతలు మారాయని... ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగ ఆధారిత రాష్ట్రం కావడం, దీనిపై ఎక్కువమంది ఆధారపడి జీవిస్తుండటంతో వ్యవసాయరంగానికి అండగా నిలిచామన్నారు. వ్యవసాయ అనుబంధరంగాలను సైతం బలోపేతం చేసేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

**బ్యాంకుల సహకారంతోనే పురోగతి**

డిమాండ్‌కు తగ్గట్టుగా ఏ రంగం పురోగతి సాధించాలన్నా బ్యాంకుల మద్దతు తప్పనిసరి అని చెప్పారు. వివిధ రంగాల్లో భారీగా ప్రాజెక్టులు వస్తున్నాయని, వాటికి అవసరమైన ఆర్థిక మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇంటికో ఎంట్రప్రెన్యూర్ లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈలు, అలాగే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. 2029 కల్లా పేదరికం నిర్మూలించేలా జీరోపావర్టీపీ4 అమలు చేసి అసమానతలు తొలిగించేలా కృషి చేస్తున్నామని >>2



## ఉగ్రవాదులను, పెంచిపోషించేవారిని
# అణిచివేస్తాం
### ఊహకందని రీతిలో జవాబివాల్సిందే!
### భద్రతా కమిటీ సమావేశంలో ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:** ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించివేయాలన్నదే భారత్ సంకల్పమని ప్రధానిమోడీ స్పష్టంచేసారు. భారత సాయుధ దళాల సామర్థ్యంపై తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఉగ్రదాడిపై ప్రతిస్పందించే విషయంలో అనుసరించాల్సిన పద్ధతులు లక్ష్యాలు, సమయాన్ని నిర్ణయించే విషయంలో సైన్యానికి పూరినత స్వేచ్ఛ ఉందన్నారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ సహా త్రివిధ దళాల అధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం సందర్భంగా ప్రధాని మోడీ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకు >>2

## 'పోలవరం' పనుల్లో
# వేగం పెంచాలి
### మంత్రి నిమ్మల రామానాయుడు



**విజయవాడ,ఏప్రిల్29,ప్రభాతవార్తప్రతినిధి:** జూన్ 2025కి హంద్రీనీవా, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. 2026 జూన్‌కి వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసేలా, చంద్రబాబు లక్ష్యాన్ని మనం అందుకోవాలి అని అన్నారు.. మంగళవారం అమరావతి సచివాలయంలో పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా, పోలవరం ఎడమ కాలువ పనులపై ఆయా ప్రాజెక్టుల సిఇలు, ఎస్ఇలు, ఇఇలు మరియు ఏజెన్సీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్‌ను మంత్రి నిమ్మల నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవలే హంద్రీనీవా, పోలవరం ఎడమ కాలువ పనులను ప్రత్యక్షంగా పరిశీలించనప్పుడు పనులు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా జరుగడంలేదని అన్నారు. సీజన్ మొదలయ్యే నాటికి హంద్రీనీవా ప్రధాన కాలువ మొదటి దశ పనులు పూర్తవ్వాలని అధికారులు, ఏజెన్సీలకు దిశా నిర్దేశం చేశారు. త్వరలోనే హంద్రీనీవా ప్రాజెక్టు పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు క్షేత్రస్థాయిలో పర్యటించి, పనులపై సమీక్ష చేస్తారని అందుకు తగ్గట్టుగా పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. పోలవరం ఎడమ కాలువ పనులైతే నత్తనడకన సాగుతున్నాయని, అనుకున్న సమయానికి పనులు పూర్తిచేసేలా, మెషినరీ, డంపర్లు, ఎక్స్‌కవేటర్లు, బ్యాచింగ్ ప్లాంట్లు, రోలర్లు ఏర్పాటు చేసుకోవాలని ఏజెన్సీలను ఆదేశించారు. ఇచ్చిన గడువు లోగా పనులు పూర్తికాకపోతే ఏజెన్సీలు, సంబందిత అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పోలవరం ప్రాజెక్టును మే నెల 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు, ప్యానల్ ఆఫ్ ఎక్స్పర్ట్స్ కమిటీ సందర్శించనుందని, ఈలోగా ఇసిఆర్ఎఫ్ డ్యాంకు సంబంధించిన డిజైన్స్ తీసుకోవాలని పోలవరం సిఇకు సూచించారు మంత్రి నిమ్మల. ముందుగా గ్యాప్1 లో ఇసిఆర్ఎఫ్ డ్యాం నిర్మాణ పనులు పూర్తిచేసేలా డిజైన్స్ తీసుకోవాలని, వెంటనే గ్యాప్2 పనులు కూడా మొదలుపెట్టేలా నిపుణుల కమిటీ నుండి అనుమతులు పొందాలని సూచించారు. ప్రస్తుతం గ్యాప్2లో డయాఫ్రంవాల్ నిర్మాణ పనులు చురుకుగానే జరుగుతున్నాయని, ఇప్పటికి రెండు కట్టర్లు, రెండు గ్రాబర్ల సాయంతో 217 మీటర్లు నిర్మాణం పూర్తయిందని, మే మొదటివారంలో మూడో కట్టర్‌తో పనులు మొదలుపెడతామని ప్రాజెక్టుఅధికారులు మంత్రి కితెలిపారు. అదేవిధంగా వర్షాకాలం మొదలయ్యేలోపు ఎగువ కాఫర్ డ్యాంను బలోపేతం చేసేలా నిర్మిస్తున్న బట్రస్ డ్యాంపనులను మే చివరినాటికి పూర్తి చేయాలని అధికారులకు, >>2

# ఎబివికి హైకోర్టులో ఊరట

**విజయవాడ,ఏప్రిల్ 29,ప్రభాతవార్త ప్రతినిధి:** విశ్రాంత ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావుకు హైకోర్టులో ఊరటలభించింది. వైఎస్సార్సీ హయాంలో భద్రతా పరికరాల కొనుగోలు టెండర్లలో అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలతో నమైదైన కేసులో హైకోర్టు తీర్పు వెల్లడించే వరకు విజయవాడ ఎసిబి కోర్టులో విచారణపై స్టే ఇచ్చింది. తనపై కేసును కొట్టివేయాలంటూ వెంకటేశ్వరరావు దాఖలు చేసిన క్వాష్ పిటీషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ సోమవారం ఈ ఉత్తర్వులిచ్చారు. నిఘా విభాగాధిపతిగా పనిచేసిన సమయంలో భద్రతా పరికరాల కొనుగోలు టెండర్ వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో 2021 మార్చిలో ఎసిబి తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ సీనియర్ ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు 2022లో హైకోర్టులో వ్యాజ్యం వేసిన విషయం తెలిసిందే. సోమవారం జరిగిన విచారణలో పిటీషనర్ తరపు సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. భద్రతా పరికరాల కొనుగోలు ప్రక్రియను ప్రారంభించింది అప్పటి డిజిపి కొనుగోలు కమిటీ,సాంకేతిక కమిటీలను ఏర్పాటు చేసింది కూడ డిజిపియే.ఆయన >>2

# మే 6న ఎపి ఇసెట్
### - విసి సుదర్శన్‌రావు

**అనంతపురం సిటీ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** ఏపి ఇ సెట్ 2025ను మే 6న నిర్వహించనున్నట్లు ఎపి ఇ సెట్ ఛైర్మన్, జెఎన్‌టియుఎ విసి సుదర్శన్‌రావు పేర్కొన్నారు. జెఎన్‌టియుఎ సమావేశ మందిరంలో మంగళవారం ఎపి ఇసెట్ నిర్వహణపై చైర్మన్ సుదర్శన్‌రావు, కన్వీనర్ దుర్గా ప్రసాద్, కో కన్వీనర్ భానుమూర్తి,రిజిస్ట్రార్ కృష్ణయ్య, విఆర్ఓ ఓం ప్రకాష్‌తో కలిసి విలేకర్ల >>2




### ఐపిఎస్ పిఎస్సార్‌కు
# మరో షాక్
### నిధుల దుర్వినియోగంపై కేసు



**విజయవాడ,ఏప్రిల్ 29,ప్రభాతవార్త ప్రతినిధి:** సీనియర్ ఐపిఎస్ అధికారి పిఎస్సార్ ఆంజనేయులుకు మళ్లీ షాక్... పిఎస్సార్‌పై మరో కేసు నమోదు చేశారు పోలీసులు. ఇప్పటికే ముంబయినటి కాదంబరి జత్వాని కేసులో ఈ సీనియర్ ఐఎస్ అధికారి అరెస్ట్ అయిన విషయం విదితమే కాగా ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తులో భాగంగా సిఐడి అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. అయితే, తాజాగా పిఎస్సార్‌పై మరోకేసు కూడ నమోదైంది. ఎపిపిఎస్సీ గ్రూప్-1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు,నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశారు. ఎపిపిఎస్సీ ప్రధాన కార్యదర్శిగా పిఎస్సార్ ఆంజనేయులు పనిచేసిన సమయంలో ఈ అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందంటూ ఫిర్యాదులొచ్చాయి. దీంతో >>2



## లక్ష ఎకరాల్లో అరకు
# కాఫీ సాగు
### రూ. 1000 కోట్లతో గిరికోనల్లో రోడ్లు
### 1600 గిరిజన గ్రామాలకు రక్షిత మంచినీరు
### రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి

**సచివాలయం,ఏప్రిల్ 29,ప్రభాతవార్త :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చాక ఇప్పటివరకు గిరిజన ప్రాంతాల్లో రూ.1300కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం,గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అరకు కాఫీని లక్ష ఎకరాల్లో సాగుచేసేందుకు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు కృషి జరుగుతోందన్నారు. ఇప్పటికే పార్లమెంట్ భవనంలో రాష్ట్ర అసెంబ్లీ భవనంలోను అరకు కాఫీ ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం ద్వారా విస్తృత ప్రచారం కావించడం జరిగిందన్నారు.గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలను పూర్తిగా నివారించేందుకు రూ.1000కోట్లతో మారుమూల ప్రాంతాలన్నింటికి మెరుగైన రహదార్లను అందుబాటులోనికి తేనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 1600 గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యాన్ని కల్పించడంతోపాటు రూ.156కోట్లతో పలు మౌలికసదుపాయాలను అందుబాటులోనికి తేనున్నట్లు చెప్పారు. గిరిజనప్రాంతాల సమగ్రాభివృద్ధికి దోహదపడే తాగు, సాగునీరు, రహదార్లు, విద్య, >>2



మంగళవారం మంగినపూడి బీచ్‌ను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

## పర్యాటక కేంద్రంగా
# మంగినపూడి బీచ్
### -మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,ఏప్రిల్29,ప్రభాతవార్తప్రతినిధి:** ఘనమైన బందరు చరిత్ర, సంస్కృతి ప్రతిబింబించే విధంగా మంగినపూడి బీచ్ ఉత్సవాలను ఎంతో గొప్పగా నిర్వహిస్తామని,రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగన పూడి బీచ్‌ను అన్ని విధాల అభివృద్ధి పరిచి ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. మంగళవారం ఉదయం మంత్రి సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి మంగినపూడి బీచ్‌ను సందర్శించారు. వచ్చే మే >>2




# భారత గగనతలంపై పాక్ విమానాలకు నో!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దాయాది దేశంపై భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. దీంతో ఇండియాపై పాక్ ఆంక్షలకు దిగింది. ఈ క్రమంలో తమ గగనతలంపై మన దేశ విమానాల రాకపోకలను బ్యాన్ చేసింది. ఇదేక్రమంలో కేంద్రం కూడా ప్రతీకార చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం. పాక్ ఎయిర్‌లైన్లకు మన గగనతలాన్ని మూసివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఈ ప్రతిపాదన పరిశీలన దశలో ఉంది. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు అని కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఓ అధికారి వెల్లడించారు. ఒకవేళ భారత ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటే అది పాక్ ఎయిర్‌లైన్లపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. పాకిస్థాన్ ఫ్లైట్స్ సింగపూర్, థాయ్‌లాండ్, మలేసియా తదితర దేశాలకు వెళ్లాలంటే మన గగనతలాన్ని దాటాల్సిందే. ఇప్పుడు ఇండియా బ్యాన్ చేస్తే... దక్షిణాసియా ప్రాంతాలకు వెళ్లేందుకు చైనా లేదా శ్రీలంక మీదుగా విమానాలను మళ్లించాల్సి ఉంటుంది. అప్పుడు ప్రయాణ సమయంలో పెరగడంతో పాటు నిర్వహణ వ్యయం కూడా తడిసి మొపెడవుతోంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పాక్ విమానయాన సంస్థలకు ఇది మరింత భారంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక, భారతమానాలపై తమ గగనతలంలో ప్రవేశించకుండా నిషేధం విధించిన పాక్ ఇప్పటికే భారీగా నష్టపోతున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయం వల్ల మనకంటే కూడా దాయాది దేశానికే ఎక్కువ ఆర్థిక నష్టమని నిపుణులు అంటున్నారు. ఇప్పటివరకు భారత్ నుంచి పాక్ గగనతలం మీదుగా వారానికి 800కి పైగా అంతర్జాతీయ విమానాలు రాకపోకలు కొనసాగించేవి. ఇందుకోసం ఓవర్‌ఫ్లైట్ ఫీజు కింద పాక్ రోజుకు 1లక్ష 20వేల డాలర్లు వసూలు చేసేది. ఇప్పుడు ఆ మొత్తాన్ని పాక్ నష్టపోవాల్సిందే. ఇపుడు భారత్ నిషేధం వల్ల దక్షిణాసియా ప్రాంతాలకు వెళ్లేందుకు చైనా లేదా శ్రీలంక మీదుగా విమానాలు మళ్లించాలి. అప్పుడు ప్రయాణసమయం పెరగడంతోపాటునిర్వహణ అదనపుభారం అవుతుంది. ఇటీవలి ఉద్రిక్తతల్లో పాక్‌గగనతలాన్ని మూసివేసింది. భారత ఎయిర్‌లైన్లు ప్రత్యామ్నాయ మార్గాల్లో విమాన సర్వీసులు నడుపుతున్నాయి. భారత్‌నుంచి పాక్‌గగనతలం మీదుగా వారానికి 800కిపైగా అంతర్జాతీయ విమానాలు రాకపోకలుసాగించేవి. ఇందుకోసం ఓవర్‌ఫ్లైట్ ఫీజుకింద పాక్ రోజుకు 1.20 లక్షలడాలర్లు వసూలుచేసింది. ఇపుడు పాకిస్తాన్ ఆ మొత్తం నష్టపోతున్నది. పుల్వామా ఉగ్రదాడి తర్వాత పరిణామాల్లోకూడా ఐదునెలలపాటు పాక్ గగనతలంలో భారత విమానాలపై ఆంక్షలు విదించింది. అప్పట్లో ఆదేశం 10 కోట్ల డాలర్లుపైగా నష్టపోయింది.

# రుణ ప్రణాళిక

>> తెలిపారు. సంపద సృష్టికి, మౌలిక సదుపాయాల కల్పనకు పీపీపీ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేస్తున్నామన్నారు.

**అన్ని ప్రాంతాల అభివృద్ధి మా విధానం**

విశాఖ ఆర్థికాభివృద్ధిలో అనూహ్య పురోగతి సాధిస్తోందని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. అలాగే అమరావతి భవిష్యత్ అవకాశాలకు వేదికగా చేస్తున్నామని, అటు రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి అన్నారు. పెట్రో కారిడార్‌పై బ్యాంకర్లు దృష్టి పెట్టాలని, మత్స్యకారులు మధ్యవర్తుల ప్రమేయంతో నష్టపోతున్నారని... వారికి నేరుగా రుణాలు ఇవ్వాలని సూచించారు. సముద్ర ఆర్థిక వ్యవస్థలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు చేయొచ్చని దీనికి బ్యాంకర్ల మద్దతు అవసరమన్నారు.

**అన్నివర్గాలకు విరివిగా రుణాలు**

ఇంటికో ఎంట్రప్రెన్యూర్‌ను తీసుకురావాలన్న సిఎం ఆశయం మేరకు క్రెడిట్ ప్లాన్ అమలు చేస్తున్నామని... ఈఆర్థిక సంవత్సరంలో కచ్చితంగా లక్ష్యాన్నిఅధిగమిస్తామని ముఖ్యమంత్రికి బ్యాంకర్ల తెలిపారు. ప్రత్యేకంగా మహిళా ఎంట్రప్రెన్యూర్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. స్వయం సహాయక బృందాలకు రుణాలు విరివిగా అందిస్తున్నామని చెప్పారు. అలాగే ఎడ్యుకేషన్, హౌసింగ్ విషయంలోనూ ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు.

**టార్గెట్లుకు మించి క్రెడిట్ ప్లాన్ అమలు**

2024-25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం క్రెడిట్‌ప్లాన్ రూ.5,40,000 కోట్లు లక్ష్యం పెట్టుకోగా, లక్ష్యాన్ని అధిగమించి రూ.6,83,672 కోట్ల రుణాలు ఇవ్వడం జరిగింది. ఇది లక్ష్యంలో 127 శాతం వృద్ధి. ఇందులో ప్రయారిటీ సెక్టార్‌కు రూ.4,14,824 కోట్లు, నాన్ ప్రయారిటీ సెక్టార్‌కు రూ.2,68,848 కోట్లు అందించాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగం వరకు చూస్తే క్రెడిట్ ప్లాన్ రూ.2,64,000 కోట్లు లక్ష్యం కాగా, అంతకు మించి రూ.3,07,089 కోట్లు బ్యాంకులు అందించాయి. ఇది లక్ష్యంలో 116 శాతం వృద్ధి. ఇందులో ఖరీఫ్‌లో రూ.1,69,797 కోట్లు, రబీలో రూ.1,37,291 కోట్లు అందించాయి.

**2025- 2026 క్రెడిట్ ప్లాన్ ఇలా**

2024- 25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం ఏపీ యాన్యువల్ క్రెడిట్ ప్లాన్ రూ.5,40,000 కోట్లు ఉండగా, 202526 ఆర్థిక సంవత్సరానికి 22 శాతం అధికంగా రూ.6,60,000 కోట్లకు లక్ష్యాన్ని పెంచారు. ఇందులో వ్యవసాయ రంగం లక్ష్యం రూ.3.06,000 కోట్లు, ఎంఎస్ఎంఇ రూ.1,28,000 కోట్లు ఉంది. మొత్తం ప్రాధాన్యరంగానికి రూ.4,58,000 కోట్లు, ప్రాధాన్యేతర రంగానికి రూ.2,02,000 కోట్లు లక్ష్యం నిర్దేశించారు.

**ఎంఎస్ఎంఇలకు ప్రాధాన్యత**

అలాగే రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న ఎంఎస్ఎంఈ రంగాలకు ఈసారి భారీఎత్తున్న క్రెడిట్ ప్లాన్ అమలు చేశారు. గత ఆర్థిక సంవత్సరం మొత్తం రూ.87,000 కోట్ల లక్ష్యానికి గాను... రూ.95,620 కోట్లు ఇచ్చాయి. ఇది లక్ష్యంలో 110 శాతం వృద్ధి. ఇందులో మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌కు రూ.49,552 కోట్లు, స్మాల్ ఎంటర్‌ప్రైజెస్‌కు రూ.27,632 కోట్లు, మీడియం ఎంటర్‌ప్రైజెస్‌కు రూ.18,138 కోట్లు, ఇతర వాటికి రూ.298 కోట్లు అందించాయి.ఇక సమావేశంలో రాష్ట్రంలో వృద్ధి శాతం తగ్గడంపై అధికారులను ఆర్థిక మంత్రి ప్రశ్నించారు. మరోవైపు క్రెడిట్ ప్లాన్ అమలులో ప్రతీ ఏటా వృద్ధి రేటు పడిపోవడంపై బ్యాంకర్లను ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. 2021-22 సంవత్సరం లక్ష్యంలో వృద్ధి 133 శాతం, 2022-23లో 163 శాతం, 2023-24లో 138 శాతం ఉండగా... 2024-25లో లక్ష్యంలో వృద్ధి 127 శాతమే ఉండటంపై వివరణ అడిగారు.



మంగళవారం రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న పాకా వెంకటసత్యనారాయణ

# రాజ్యసభకు సత్యన్నారాయణ నామినేషన్

**విజయవాడ, ఏప్రిల్ 29,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజ్యసభ అభ్యర్థిగా కూటమికి చెందిన బిజెపి అభ్యర్థి వెంకట సత్యనారాయణ పాకా నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. మంగళవారం రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో రిటర్నింగ్ అధికారి వనితారాణికి ఆయన తమ నామినేషన్ పత్రాన్ని అందజేశారు. నామినేషన్ పత్రాల దాఖలు కార్యక్రమంలో కేంద్ర పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, శాసనసభ్యులు ధర్మరాజు, కామినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. రాజ్యసభకు నామినేషన్ దాఖలు సందర్భంగా బిజెపి అభ్యర్థి వెంకట సత్యనారాయణ సిఎం చంద్రబాబును కలిసి తన కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర అభివృద్ధికి ఎంపీగా సత్యనారాయణ పార్లమెంటులో గట్టిగా మన వాణి విన్పించాలని సిఎం చంద్రబాబు ఆయనకు సూచించారు.కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రానికి నిధులు తీసుకుని రావాలన్నారు.

# పోషించేవారిని అణిచివేస్తాం

>> న్నాయి. పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశంలో అంతర్గత భద్రత, సరిహద్దుల్లో నెలకొన్ని పరిస్థితులపై ప్రధానిమోడీ తన నివాసంలో కీలక సమావేశం ఏర్పాటుచేసారు. సుమారు గంటన్నరపాటు సాగిన ఈ భేటీలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోబాల్, సిడిఎస్ అనిల్‌చౌహాన్, ఆర్మీచీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది,నేవి చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి, ఎయిర్‌చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్‌లుపాల్గొన్నారు. సమావేశంలో పాక్‌ను ప్రస్తావించిన మోడీ ఉగ్రవాదులు, వారిని పెంచి పోషిస్తున్న వారిని పాతాళంలోకి తొక్కేసానతమని స్పష్టంచేసినట్లు తెలుస్తోంది. వారికి ఊహకందని రీతిలో చర్యలు ఉండాలని చెప్పినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార దాడులు తప్పవని ఊహాగానాలు వ్యక్తం అవుతున్నవేళప్రధానిమోడీ మాటలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. మరోసారి భద్రతా రంగ కేబినెట్‌కమిటీ బుధవారం సమావేశం అవుతోంది. వారంరోజుల వ్యవధిలోనే రెండోసారి కేబినెట్ భేటీ అవుతోంది. తర్వాత మోడీ అద్యక్షతన రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీసమావేశం కానున్నది. వీటిలో సిసిఎస్‌లోని ఐదుగురుసభ్యులతోపాటు రవాణా, ఆరోగ్య, వ్యవసాయ రైల్వేమంత్రులు కూడా ఉన్నారు. కీలకభేటీలుజరిగే ఒకరోజు ముందే త్రివిధ దళాల అధిపతులతో ప్రధానిమోడీ సమావేశం ఏర్పాటుచేయడం ఉత్కంఠకు దారితీస్తోంది. 2016లో ఊరిలో ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వెంబడిభారత సైన్యం మెరుపుదాడులుచేసింది. తర్వాత 2019లో సిఆర్‌పీఎఫ్ బలగాలే లక్ష్యంగా పుల్వామాలోజరిగిన దాడి అనంతరం భారత సైన్యం మెరుపుదాడులుచేసిన సంగతి తెలిసిందే.

**సరిహద్దు ఉద్రిక్తతలపై హోంశాఖ ఉన్నతస్థాయి సమావేశం**

పహల్గాం ఉగ్రవాది దాడి తర్వాత దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో భద్రతపై ఆందోళన పెరిగింది. రోజురోజుకూ ప్రధానిమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌లు ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నారు. అంతేకాకుండా కేంద్ర హోంమంత్రిత్వశాఖకూడా మంగళవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షత వహించారు. బీఎస్ఎఫ్, ఎన్ఎస్‌జీ, అసోం రైఫిల్స్ చీఫ్‌లు, ఎస్ఎస్‌బీ, సీఐఎస్ఎఫ్ సీనియర్ అధికారులు సైతం సమావేశానికి హాజరయ్యారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన దాడి తర్వాత భద్రతా ఏర్పాట్లను సమీక్షించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సరిహద్దు భద్రతా దళం డైరెక్టర్ జనరల్ దల్జిత్ సింగ్ చౌదరి, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ ఛీఫ్ శ్రీనివాసన్, అసోం రైఫిల్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ వికాస్ లఖేరా, ఎస్ఎస్‌బీ అదనపు డైరెక్టర్ జనరల్ అనుపమ నీలేకర్ చంద్ర సమావేశంలో పాల్గొన్నారు. జమ్మూ కశ్మీర్ పోలీసులు దోడా జిల్లాలో 13 ప్రదేశాల్లో దాడులు నిర్వహించి ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశారు. ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటున్న వ్యక్తులపై చర్యలు చేపట్టారు. మరో వైపు శ్రీనగర్‌లో పోలీసులు అనేక ప్రదేశాల్లో ఓవర్ గ్రౌండ్ వర్కర్స్ (వీబిజ్బూ), నిషేధిత ఉగ్రవాద సంస్థలో పని చేస్తున్న వారి ఇండ్లపై విస్తృత దాడులు నిర్వహించారు. శ్రీనగర్‌లో పోలీసులు ఇప్పటి వరకు 63 మంది వ్యక్తులకు సంబంధించిన ఇండ్లను సోదా చేసినట్లు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. చట్ట ప్రకారం జమ్మూ కశ్మీర్ పోలీస్ అధికారుల పర్యవేక్షణలో ఆయుధాలు, పత్రాలు, డిజిటల్ పరికరాలు మొదలైన వాటిని సేకరించి.. ఏదైనా ఉగ్రవాద కార్యకలాపాలను నిరోధించేందుకు ఆధారాలను సేకరించారు.ఈ నెల 22న మంగళవారం పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. పహల్గాంలోని బైసరన్ లోయలో ఆర్మీ యూనిఫాంలో వచ్చిన ఉగ్రవాదులు మొదట ఎవరి మతం ఏంటో తెలుసుకొని గుర్తింపు కార్డులను పరిశీలించారు. హిందువులను కాల్చి చంపారు. మొత్తం 26 మంది పర్యాటకులు చనిపోగా.. ఇందులో ఇద్దరు విదేశీయులు, మరో ఇద్దరు స్థానిక పౌరులు ఉన్నారు. ఈ దాడికి టీఆర్ఎఫ్ బాధ్యత వహించింది.

# ఎబివికి హైకోర్టులో ఊరట

>> కోరిక మేరకు...ఆయా కమిటీల్లో సీనియర్ అధికారుల పేర్లను మాత్రమే పిటీషనర్ సూచించారు. అధికార హోదాను అడ్డుపెట్టుకొని ఆ కమిటీల నిర్ణయాలను ప్రభావితం చేశారనడానికి ఎలాంటి ఆధారాలు లేవు. భద్రతా పరికరాల కొనుగోలుకు ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. అలాంటప్పుడు అనుచిత లబ్ధి పొందారన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు.టెండర్ కార్యకలాపాల సేవలు అందించినందుకు స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎస్‌టీసీఐఎల్)కు ప్రభుత్వం చెల్లించిన రూ.10 లక్షలను సైతం ఆ సంస్థ వెనక్కి ఇచ్చింది. టెండర్ కోసం ఖర్చు చేసిన ప్రతి పైసాను రాబట్టారు. అంతిమంగా ఆ టెండర్‌ను అప్పటి డిజిపి రద్దు చేశారు.తెలుగు రాష్ట్రాల్లో అనుబంధ సంస్థల్లేవని చెప్పిందిభద్రతా పరికరాల కొనుగోలు టెండర్‌ను దక్కించుకున్న ఇజ్రాయిల్ సంస్థకు పిటీషనర్ కుమారునికి చెందిన ఆకాశం అడ్వాన్స్‌డ్ సిస్టం లిమిటెడ్ సంస్థ అనుబంధంగా పనిచేస్తోందన్న ఎసిబి ఆరోపణల్లో వాస్తవం లేదు. తెలంగాణ,ఏపీల్లో తమకు ఎలాంటి అనుబంధ సంస్థలు లేవని ఇజ్రాయెల్ కంపెనీ స్పష్టత ఇచ్చింది. అలాంటప్పుడు పిటీషనర్ కుమారుడి సంస్థకు లబ్ధి చేకూర్చేందుకు యత్నించారనే ఆరోపణ సరికాదు. పిటీషనర్ చర్యల వల్ల ప్రభుత్వ ఆస్థికి నష్టం జరగలేదు అలాంటప్పుడు నేరపూర్వక దుష్ప్రవర్తన,ఏసిబీ చట్టం ప్రకారం నమోదు చేసిన సెక్షన్లు చెల్లవు.ఐపీసీ 120బి సెక్షన్ నమోదు చేసింది. ప్రస్తుత కేసు విషయంలో ఎవరితో కలిసి పిటీషనర్ నేరపూర్వక కుట్ర చేశారో ఏసీబీ వెల్లడించలేక పోయింది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకొని ఎసిబి నమోదు చేసిన ఎఫ్ఐఆర్,తదనంతరం దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను కొట్టేయండి అని కోరారు.

# వంశీ బెయిల్‌పై ముగిసిన వాదనలు

**విజయవాడ,ఏప్రిల్ 29,ప్రభాతవార్త ప్రతినిధి:** గన్నవరం టిడిపి కార్యాలయంపై మూకదాడి వ్యవహారంలో మాజీ ఎంఎల్ఏ వల్లభనేని వంశీ,ఆయన అనుచరులు మరికొందరు దాఖలు చేసిన బెయిలు పిటీషన్లపై సోమవారం హైకోర్టులో వాదనలు ముగిసాయి. దీంతో పిటీషన్లపై వచ్చే నెల 2న నిర్ణయం వెల్లడిస్తామని న్యాయస్థానం ప్రకటించింది.

ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లిఖార్జునరావు సమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాసిక్యూషన్ తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూద్రా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నీలోత్పల్ వాదనలు వినిపించారు. కేసుకు సంబంధించి మే 2న ప్రాథమిక ఛార్జిషీటు దాఖలు చేస్తామన్నారు. ఛార్జిషీట్ దాఖలుకు 90 రోజుల గడువు ఉందన్నారు. వంశీ,ఇతర నిందితులు ఫిర్యాదుదారుడిని కిడ్నాప్ చేసి,బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. పిటీషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరాం, న్యాయవాది సత్యశ్రీ వాదనలు వినిపించారు. వంశీని అరెస్ట్ చేసి ఇప్పటికే 60 రోజులు గడిచాయని, పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేయలేదని చెప్పారు. బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

# మంగినపూడి బీచ్

>> నెలలో నిర్వహించనున్న బీచ్ ఉత్సవాల నేపథ్యంలో రేఖా చిత్రపటం పరిశీలించి అక్కడ చేపట్టవలసిన పనులు, ఏర్పాట్ల గురించి మంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.అనంతరం మంత్రివర్యులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మన రాష్ట్రానికి 980 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతం ఉందని, మంగినపూడి బీచ్ పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు ఎంతో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతికి ముఖద్వారంగా, తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యంగా హైదరాబాదుకు మంగినపూడి బీచ్ చాలా దగ్గరలో ఉందన్నారు.బీచ్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాల కృషి చేస్తామన్నారు. ఇందుకోసం బీచ్‌లో 150 ఎకరాలను గుర్తించామని, మరో 200 నుంచి 300 ఎకరాలుకూడా గుర్తించే పనులు జరుగుతున్నాయని, అక్కడ కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ నిధులతో రిసార్ట్లు, హోటళ్ల కోసం స్థలాలు కూడా కేటాయిస్తామన్నారు. తద్వారా 1000 నుంచి 1500 కోట్ల రూపాయల పెట్టుబడులు రానున్నాయన్నారు.

తమ ప్రభుత్వం 2018లో మంగినపూడి బీచ్ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించిందని, సాంస్కృతిక కార్యక్రమాలు క్రీడలు ప్రదర్శనశాలలు బ్రహ్మాండంగా ఏర్పాటు చేశామన్నారు. బీచ్‌కు పూర్వవైభవం తీసుకొచ్చి ఈసారి ఉత్సవాలను అందరినీ ఆకట్టుకునే విధంగా మరింత ఘనంగా నిర్వహించి ప్రజలకు కొత్త అనుభూతిని కల్పిస్తామన్నారు.

ఈసారి ఉత్సవాలలో జాతీయ క్రీడలు కయాకింగ్, బీచ్ కబడి పోటీలు నిర్వహించేందుకు అనుమతి వచ్చిందన్నారు. ఈ వేసవికాలంలో వచ్చే మే నెల 15వ తేదీ నుండి3 రోజుల పాటు విద్యార్థులకు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ ఉత్సవాలను రాష్ట్ర ఉత్సవాలుగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నామన్నారు.

ఈ పర్యటనలో మంత్రి వెంట మెప్మా పిడి సాయిబాబా, రహదారులు భవనాల డి ఈ సంగీత, తహసిల్దారు నాగభూషణం , మెరైన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జగదీష్ చంద్రబోస్, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

**మచిలీపట్టణం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అభివృద్ధి చేస్తాం**

మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రినీ అన్ని విధాల అభివృద్ధి చేసి తీర ప్రాంతంలో ప్రముఖ వైద్య కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి( జి జి హెచ్)లో ఏర్పాటుచేసిన క్లినికల్ లెక్చరు గ్యాలరీని మంత్రివర్యులు, ఎపిఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి ప్రారంభించారు. ఆసుపత్రి ఇంజనీరింగ్ విభాగపు ఉద్యోగి తలపురెడ్డి శ్రీనివాసరెడ్డి తన మనవరాలు పుట్టినరోజు సందర్భంగా రోగులకు బల్లలు, స్టేచర్ ట్రాలీలు, మెడిసిన్ ట్రాలీలు మంత్రివర్యులు చేతుల మీదుగా ఆసుపత్రికి అందజేశారు. అనంతరం ఆసుపత్రిలో అతను ఏర్పాటు చేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహం మంత్రి ఆవిష్కరించి, ఉద్యానవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆసుపత్రి సానిటరీ వర్కర్ రవితేజ దాతగా మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మంత్రివర్యులు ప్రారంభించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంత్రి చేతుల మీదుగా బల్లలు ఆసుపత్రికి అందజేశారు. నైటింగేల్ విగ్రహం, రోగులకు బల్లలు ట్రాలీలు అందజేసిన దాత శ్రీనివాసులు రెడ్డిని ఈ సందర్భంగా మంత్రివర్యులు ఘనంగా సత్కరించారు. తదనంతరం మంత్రి మాట్లాడుతూ వైద్యం అంటేనే సేవ అని ఫ్లోరెన్స్ నైటింగేల్ తన జీవితాన్ని వైద్య సేవలకు అంకితం చేశారని, అనేక మందికి సేవలు చేసి స్ఫూర్తినిచ్చిన మానవతా మూర్తి అని కొనియాడారు. జిల్లా ఆసుపత్రికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని బ్రిటిష్ కాలం నుండి మంచి పేరు పొందిన ఆసుపత్రి అన్నారు. నర్సింగ్ కళాశాల కూడా ఇందులో ఉందని 200 మంది దాకా నర్సింగ్ విద్యార్థులు ఉన్నారని వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నర్సింగ్ కళాశాలకు నిధులు సమకూర్చి త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. మొన్న ఆరోగ్య శాఖ కార్యదర్శితో మాట్లాడానని త్వరలో సమావేశం నిర్వహించి పురోగతి సాధిస్తామన్నారు. ఈ జిల్లా ఆస్పత్రి మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉందన్నారు. మరిన్ని నిధులు సమకూర్చి అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆసుపత్రిని అన్ని విధాల అభివృద్ధి పరిచి తీర ప్రాంతంలో ప్రముఖ వైద్య కేంద్రంగా తీర్చిదిద్దామన్నారు. ప్రస్తుతం క్యాజువాలిటీలో కొందరు డాక్టర్ల కొరత ఉందని ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు

ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి ఆశాలత, నర్సింగ్ సూపరింటెండెంట్ డా. ఆశా సజన, ఆర్ ఎం ఓ డాక్టర్ నిరంజన్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రోజా రమణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, కార్పొరేటర్ అనిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, పలువురు నర్సులు, నర్సింగ్ విద్యార్థులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# వేగం పెంచాలి

>> ఏజెన్సీ ప్రతినిధులకు సూచించారు. ఇంక వెలిగొండ ప్రాజెక్ట్‌లో టన్నెల్2లో బెంచింగ్, లైనింగ్ పనులు ఏప్రియల్ నెలలో నిర్దేశించిన లక్ష్యానికి చేరుకోకపోవడం పై అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు మంత్రి నిమ్మల రామానాయుడు.

## వారం - వర్జ్యం

తేది : 30-04-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
శు.తదియ మ.2.17
రోహిణి సా.4.22
వర్జ్యం రా.9.31-10.59
దు.ఉ.11.40-మ.12.31
శుభసమయం:ఉ.9.05-9.55, సా.4.30-5.15
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ చాలా అవసరం. వస్తు సేకరణ.

**వృషభం :** ఉద్యోగాలలో ఒడిదుడుకులు ఎదురైన అధిగమిస్తారు. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**మిథునం:** గృహనిర్మాణ ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఉద్యోగయత్నాలు నత్తనడకన సాగుతాయి. ప్రయాణాలు.

**కర్కాటకం:** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. సోదరుల కలయిక.

**సింహం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. వస్తుసేకరణ.

**కన్య :**వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు పదోన్నతులు, హోదాలు పొందుతారు. వాహనసౌఖ్యం.

**తుల :** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. బంధువుల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి. వస్తువులు కొనుగోలు.

**వృశ్చికం:** స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. సోదరులను కలుసుకొని కష్టసుఖాలను పంచుకుంటారు.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**మకరం:** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సన్నిహితుల నుండి సాయం అందుకుంటారు.

**కుంభం:** కుటుంబంలో ఎదురైన సమస్యలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగాలలో మరింత అనుకూలత.

**మీనం :**అనుకోని అతిథుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. ప్రయాణాలు లాభిస్తాయి. వస్తు, వస్త్రా లాభాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మే 6న ఎపి ఇసెట్



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న విసి సుదర్శన్ రావు

>> సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపి ఇసెట్-2025 కన్వీనర్ అయిన జెఎన్‌టియు విసి సుదర్శన్‌రావు విలేకర్లతో మాట్లాడుతూ.. ఏపి ఇసెట్‌కి 35,187 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అత్యధికంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి 11,029 మంది అత్యల్పంగా బయోటెక్నాలజీకి ఒక్కరు, దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. మే 6న రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు ఒక సెషన్‌కు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షల నిర్వహణకు 110 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 109 కేంద్రాలు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలతో పాటు 46 పట్టణాల్లోనూ హైదరాబాద్‌లో ఒక కేంద్రంలోనూ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాదాపుగా విద్యార్థులు కోరుకున్న కేంద్రాల్లోనే పరీక్ష కేంద్రాలను కేటాయించడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాలలోకి ఒకటిన్నర గంట ముందే అనుమతించడం జరుగుతుందని, నిర్దేశిత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాలలోకి అనుమతించే ప్రసక్తి లేదని అభ్యర్థులు ఈ విషయాన్ని స్పష్టంగా గమనించాలని ఆయన సూచించారు. ఎలక్ట్రికల్ ఉపకరణాలను పరీక్ష కేంద్రాలలోకి అనుమతించే ప్రసక్తి లేదన్నారు. ప్రతి విద్యార్థి హాల్ టికెట్‌తోపాటు బ్లూ ఆర్ బ్లాక్ పెన్నులను, ఐడి కార్డులను తీసుకురావాలని సూచించారు. మే 1 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

# లక్ష ఎకరాల్లో అరకు కాఫీ సాగు

>> వైద్య, సౌకర్యాలపై అధికదృష్టి సారించడం జరిగిందని మంత్రి సంధ్యారాణి వెల్లడించారు.గత ప్రభుత్వం సకాలంలో యుసిలను కేంద్రానికి పంపక పోవడంతో కేంద్రం నుండి నిధులు మంజూరు కాక ఆయా పనులన్నీ పెండింగ్‌లో ఉండేవని ఈ కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చాక కేంద్రంతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవడం ద్వారా రాష్ట్రానికి పెద్దఎత్తున నిధులను తెచ్చుకోగలుగుతున్నామన్నారు.ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అరకు, పాడేరులకు రూ.550 కోట్లతో కేంద్ర నిధులను మంజూరు చేయించారని ఆయా నిధులతో ఆ నియోజకవర్గాల్లో పెద్దఎత్తున మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి జరుగుతోందన్నారు.వివిధ రకాల గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించే లక్ష్యంలో భాగంగా ఐటిడిఏల పరిధిలో ఒక్కొక్కటి రూ.కోటి వ్యయంతో సంచార గిరి బజారులను ఏర్పాటు చేయడం జరుగుతోందని మంత్రి సంధ్యారాణి వెల్లడించారు.అదే విధంగా గిరిజన మారుమూల ప్రాంతాల్లో నివసించే గిరిజన ప్రజల వైద్యసేవలకై ప్రతి గిరిజన అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక కంటైయినర్ ఆస్పత్రిని అందుబాటులోనికి తెస్తున్నట్లు చెప్పారు.65రకాల మందులతో కూడిన ఈ కంటైయినర్ ఆస్పత్రుల ద్వారా ఆస్పత్రులు అందుబాటులోని గిరిజన ప్రాంతాల్లో వీటి ద్వారా వైద్యసేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని మంత్రి స్పష్టంచేశారు.

**రాష్ట్రంలో మహిళా శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత : మంత్రి సంధ్యారాణి**

రాష్ట్రంలో మహిళా శిశు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని గత 10నెలల్లో 1100అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయడం జరిగిందని మహిళా శిశు సంక్షేమం,గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు.అదే విధంగా రాష్ట్రంలో 1100 అంగన్వాడీ కేంద్రాల్లో రూ.53కోట్లు విడుదల చేయడమైందని తెలిపారు.422 అంగనావ్వాడి కార్యకర్తలు మరియు 1130అంగన్వాడీ ఆయాల పోస్టులు భర్తీ చేయడం జరిగిందన చెప్పారు.అంతేకాక గిరిజన గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు గిరిజన గర్భిణీ వసతి గృహాలను కూడా అందుబాటులోనికి తెస్తున్నట్లు తెలిపారు.రూ.10.5కోట్ల వ్యయంతో 35బర్త్ వెయిటింగ్ హాల్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.ఇప్పటికే మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రులను పున:ప్రారంభించడం జరిగిందన్నారు.వేధింపులకు గురయ్యే మహిళలకు పూర్తిగా అండగా నిలిచేందుకు జిల్లాకు ఒకటి వంతున 26వన్‌స్టాప్ సెంటర్లను అందుబాటులోనికి తెచ్చామని మంత్రి సంధ్యారాణి వివరించారు.

# ఐపిఎస్ పిఎస్సార్‌కు మరో షాక్

>> పిఎస్సార్‌పై 409,420 సెక్షన్ల క్రింద కేసు నమోదు చేశారు. ఇప్పటికే పిఎస్సార్‌పై సినీనటి జత్వానీ వేధింపుల కేసు, రఘురామకృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కేసు నమోదు అయిన విషయం విదితమే. తాజాగా మూడో కేసు ఎపిపిఎస్సీ అక్రమాలపై నమోదు చేశారు పోలీసులు,ఇలా వరుసగా సీనియర్ ఐపిఎస్ అధికారి పిఎస్సార్ ఆంజనేయులు కేసులు ఎదుర్కోకావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ముగిసిన పిఎస్ఆర్ ఆంజనేయులు సిఐడి విచారణ**

ముంబయి నటి కాదంబరి జత్వానీ,ఆమె తల్లిదండ్రులను అక్రమంగా నిర్బంధించిన కేసులో అరెస్ట్ అయి రిమాండులో ఉన్న సీనియర్ ఐపిఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు సిఐడి విచారణ ముగిసింది. మంగళవారం సిఐడి అధికారులు మూడో రోజు కస్టడీకి తీసుకున్నారు. అంతకుముందు విజయవాడ జిజిహెచ్‌లో వైద్య పరీక్షలను నిర్వహించారు. సిఐడి ఎస్పీ ప్రసాద్ అధ్వర్యంలో ఆంజనేయులును విచారిస్తున్నారు. సోమవారం ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంల వరకు సుమారు ఆరు గంటలపాటు సిఐడి అధికారులు ఆయనను ప్రశ్నించారు. 80కి పైగా ప్రశ్నలు అడిగారు.వాటిలో ఏ ఒక్కదానికి పిఎస్ఆర్ ఆంజనేయులు సూటిగా సమాధానం చెప్పలేదు. అన్నింటికీ దాటవేత ధోరణిలో తప్పించుకునే రీతిలో జవాబులిచ్చారు. దర్యాప్తు అధికారులు వారి వద్ద నున్న ఆధారాలను చూపించి ప్రశ్నించడంతో వాటికి సంబంధం లేని విధంగా సమాధానాలిచ్చారు. సిఐడి అధికారులు మధ్యాహ్నం భోజనం పెట్టినా ఆయన తినలేదు. మీరిచ్చిన ఆహారం తినను.నాకు అవసరంలేదు అని చెప్పారు. విచారణ ముగియడంతో విజయవాడ కోర్టుకు ఆంజనుయులును అధికారులు తరలిస్తున్నారు. ఆంజనేయులును సిఐడి కోర్టులో హాజరుపర్చనున్నారు. కోర్టు ఆదేశాల అనంతరం ఆయన్ను విజయవాడ జిల్లా జైలుకు తరలించి అధికారులకు అప్పగించారు.

# ప్రభుత్వ భూములా? ప్రైవేట్ ఎస్టేట్‌లా?

## ఆకేపాడులో వందల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా



**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త** ఒక పేదవాడు ఒక ఎకరా ప్రభుత్వ భూమి కావాలంటే నేతలు చుట్టూ తిరగాలి. ప్రభుత్వం అసైన్మెంట్ సమావేశం నిర్వహించినప్పుడు నేతలు ఎస్ అంటేనే అసైన్మెంట్లు భూమి కేటాయిస్తారు. ఆ భూమికి అధికారుల పట్టా ఇవ్వాలంటే గ్రామ సభలు పెట్టాలి. నిజమైన లబ్ధిదారుడా కాదా నిర్ధారించాలి. ముందు నేతకు నచ్చాలి.ఆ తర్వాతే అధికారులు పట్టాయిస్తారు. ఇదంతా ప్రభుత్వం పంపిణీ చేసే అసైన్మెంట్ ప్రక్రియ. అయితే ఈ చట్టం పేదలకు మాత్రమే. పెద్దలకు వర్తించదు. ముఖ్యంగా అధికారంలో ఉన్న నాయకులకు ఏమాత్రం పనిచేయదు. అధికారుల దృష్టిలో నేతలు రాజ్యాంగ ఇతర శక్తులు .వారి ఇంటికి వెళ్లి మరీ ప్రభుత్వము ఉన్న ఆన్లైన్ చేస్తారు. వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమించి కంచేవేసి సాగు చేసుకున్నా వారికి రక్షణ కల్పిస్తారు. ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకుపోరు. ఇంకా రెవిన్యూ చట్టంలోని లోసుగులను చెవిలో చెప్పి అక్రమాలను సక్రమంగా చేసుకునేందుకు మార్గాలు చెబుతారు. ఇవన్నీ అక్షర సత్యాలు. ఉమ్మడి కడప జిల్లా రాజంపేట మండలంలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆకిపాడు సోదరులు కబ్జా చేశారని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి ఫిర్యాదు చేశారు. సీఎం ప్రజా దర్బార్ లో వందల ఎకరాల భూకబ్జాపై వివరాలను అందజేశారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ కు పి జి ఆర్ ఎస్ లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ విచారణ ఆదేశించారు. ఆకేపాడు ప్రాంతంలో వందల ఎకరాల భూకబ్జాపై సీఎం విచారణకు ఫిర్యాదు చేసిన, కలెక్టర్కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఖివార్తఖి భూకబ్జాపై క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. రికార్డులను శోధించింది .రెవిన్యూ అధికారులు నేతల ఆదేశాలకు అనుగుణంగా ఆన్లైన్ చేశారు. ప్రభుత్వ భూములు ఆన్లైన్ చేయడంలో చేతివాటం ప్రదర్శించారు. డబుల్ ఎంట్రీలు నమోదు చేశారు. ఒక భూమిని రెండుసార్లు అడంగల్ లో చేర్చి నేతలకు జీ హుజూర్ అన్నారు. అసైన్మెంట్ చట్టం ప్రకారం ప్రభుత్వ భూములు ఒక కుటుంబంలో ఒకే వ్యక్తికే దక్కే అవకాశం ఉంది.అయితే ఒక కుటుంబంలోని ప్రతి కుటుంబ సభ్యునికి ఎకరాల కొద్దీ భూములు దక్కి ఉన్నాయి. రెవిన్యూ రికార్డుల్లో కుప్పలు తెప్పలుగా కుటుంబంలో 100 ఎకరాలు కూడా కనిపిస్తున్నాయి. కనీసం 100 ఎకరాలు ప్రభుత్వ భూములు డబుల్ ఎంట్రీ కనిపించడం వెనుక పెద్ద కుట్రనే అని తెలుస్తోంది. సహకార సంఘాల రుణాల కోసం ఈ విధంగా డబుల్ ఎంట్రీలు వేశారా లేక ఎందుకు అనే విషయం అంతుచిక్కడం లేదు.

రాజంపేట మండలంలోని ఆకేపాడు, మందపల్లి శ్రీరంగరాజపురం రెవెన్యూ గ్రామాల పరిధిలో కనీసం 500 ఎకరాల భూములు ప్రత్యక్షం కబ్జా జరిగినట్లు తెలుస్తోంది. ఏకంగా ఖికొండలకే ఖిఆకేపాడు సోదరులు కంచె వేశారు. రాయచోటి రోడ్డు నుంచి ఆకేపాడుకు వెళ్లే దారిలో తమ్ముడు కుడివైపు ఆక్రమిస్తే అన్న ఎడమవైపు అటవీ స్థలాన్ని కొండలను ఆక్రమించి ఫెన్సింగ్ వేశారు. అన్నమయ్య ప్రధాన కాలువ సమీపంలో రాజులయ్య కొండ చుట్టూ రాజంపేట నియోజకవర్గ ముఖ్యనేత కనీసం వంద ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించే కంచే వేశారు. సీఎంకు, అన్నమయ్య జిల్లా కలెక్టర్కు ఈ భూమి ఆక్రమణలపై గూగుల్ మ్యాప్ లతో సహా ఫోటోలను ఫిర్యాదుకు జత చేశారు. కొంతవరకు బినామీ పేర్లతో కూడా భూములు కాజేశారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే గుర్రాల కొండలో 50 ఎకరాల భూమి కబ్జా చేసి ముఖ్యనేతకు వరుసకు సోదరుడు ఎస్టేట్ కడుతున్నారు. అదేవిధంగా ఆయనే బోదా గుట్టలో అన్నమయ్య ప్రాజెక్టు ప్రధాన కాలువ, గాలేరు నగరి ప్రధాన కాలువ సమీపంలో 100 ఎకరాలు ప్రభుత్వ ఆక్రమించినట్లు సమాచారం. అంతేకాదు శ్రీరంగరాజపురం 30 ఎకరాలు ఈ అక్రమార్కుడే కబ్జా చేశాడు. ఇవ్వమని రెండు దశాబ్దాల క్రితం రాజంపేట మండలం ధనాసుపల్లె దళితవాడ పేదలకు కేటాయించారు. అయితే వారు అక్కడి నుంచి దీంతో ఆ భూమి ఆక్రమించి అరటి తోటలు , టేకు తోటలు సాగు చేస్తున్నాడు. సమీపంలోని అటవీ భూమి కూడా ఆక్రమించి ఉన్నట్లు సమాచారం. ఇక ముఖ్య నేత సోదరుడు గుర్రాల కొండ సమీపంలో 50 ఎకరాలు ఆక్రమించి ఫామ్ హౌస్ నిర్మించినట్లు తెలుస్తోంది. చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమించి నిమ్మ , చీనీ తోటలు సమీపంలోని కొండ కింది భాగం వరకు సాగు చేసి ఫెన్సింగ్ వేశారు. ఇకపోతే శ్రీరంగరాజు పురం, ఆకేపాడు చెరువులు 100 ఎకరాల పైబడి కబ్జా చేసి పంటలు సాగు చేస్తున్నా అటువైపు వెళ్లే అధికారులు లేరు. ముఖ్యమంత్రికి ఒంటిమిట్టకు వచ్చిన సందర్భం గా ప్రజా దర్బార్లో ఫిర్యాదు చేసినా విచారణకు రెవిన్యూ అధికారులు వెళ్లేందుకు మీనమేషాకు లెక్కిస్తున్నా రంటే ఆ అక్రమా ర్కులను చూసి ఎంత భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

## పక్కా ప్రణాళికతో ప్రాథమిక విద్య అభివృద్ధికి చర్యలు

### - రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు




బదిలీల చట్టంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు

**చిత్తూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** ప్రాథమిక పాఠశాలలు అభివృద్ధి చెందితేనే ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ బలోపేతం అవుతుందని, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతంకు రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళిక రచించి అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం బదిలీల చట్టంపై జరిగిన అవగాహన సదస్సులో రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ ప్రాథమిక పాఠశాల వ్యవస్థను ఫౌండేషన్ పాఠశాల, బేసిక్ ప్రాథమిక పాఠశాల, మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్పు చేసిందన్నారు. ఫౌండేషన్ పాఠశాలలో ఒక రకంగా, బేసిక్ ప్రాథమిక పాఠశాలలో వేరువేరుగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకే కేటాయించడం పద్ధతికాదన్నారు. ఫౌండేషన్ పాఠశాలలో సైతం 1:2గా సెకండరీ గ్రేడ్ టీచర్లను విభజించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలో సమాంతర మీడియంను అమలు చేయడం ద్వారా సర్దుబాటు చేయాలని కోరారు. అలాగే అదనంగా ఉన్నత పాఠశాలలో డిసెండింగ్ అర్డర్‌లోనైనా సబ్జెక్టు టీచర్‌ని అలాట్ చేయాలన్నారు. అలాగే మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో సంబంధం లేకుండా ఐదు మంది ఉపాధ్యాయులు, ఐదు తరగతి గదులు, ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బదిలీల చట్టం తీసుకురావడం యుటిఎఫ్ స్వాగతిస్తోందని, ఈ చట్టంతో బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా జరిగే అవకాశం వుంటుందన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బదిలీలు, పదోన్నతులు, రేషనలైజేషన్ పారదర్శకంగా జరిగేలా యుటిఎఫ్ కృషి చేస్తోందని, ఏ ఒక్క ఉపాధ్యాయుడికి అన్యాయం జరుగకుండా పిల్లలకు నాణ్యమైన విద్య అందించే విధంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి రోజుకొక రకమైన కసరత్తును ప్రభుత్వం చేస్తోందని, దీని ఫలితంగా ఉపాధ్యాయుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక నిర్దిష్ట ప్రతిపాదనను ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయుల ముందు ప్రభుత్వం పెట్టి దాని ఆమోదం అనంతరం అమలుకు ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్‌నాయుడు, ఎన్.మణిగండన్‌లు, జిల్లా గౌరవ అధ్యక్షులు పి.సుధాకర్‌రెడ్డి, సహాధ్యక్షులు కె.రెడ్డప్పనాయుడు, ఎస్.రెహెనా బేగం, కోశాధికారి ప్రసన్నకుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్పీ భాషా, పిఆర్ మునిరత్నం, జిల్లా కార్యదర్శులు సిపి ప్రకాష్, డి.ఏకాంబరం, బి.ఈశ్వర్ మహేంద్ర, కె.సరిత, పంటపల్లి సురేష్, ఎంపార్థసారధి, కె.గణేష్‌కుమార్, జిల్లా ఆడిట్ కన్వీనర్ పిసి బాబు, సభ్యులు వెంకటేష్, సాధనకుమార్, మోహన్‌రెడ్డి, కన్వీనర్లు వెంకటేశ్వరరెడ్డి, తుంబూరు బాలాజీ, కృష్ణమరాజు, నాయకులు సురేష్‌బాబు, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్‌గా వైయస్సార్‌సిపి పని చేయాలి : మాజీ సిఎం వైఎస్ జగన్



వైయస్సార్‌సిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుల సమావేశంలో జగన్

**విజయవాడ,ఏప్రిల్29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్‌గా వైయస్సార్‌సీపీ పని చేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు మాజీ సీఎం వైయస్ జగన్ నిర్దేశించారు.మంగళవారం తాడేపల్లిలోని వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుల సమావేశంలో జగన్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలన్నారు.. క్షేత్రస్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ, ప్రజాసమస్యలపై ఉద్యమించేందుకు సిద్ధంగా ఉండేలా పార్టీని సమాయత్తం చేయాలని ఆయన ఆదేశించారు. కూటమి ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమై, ప్రజల గోడు పట్టించుకోని నిర్లక్ష్యం తాండవిస్తోందని, దీనిపై ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత పార్టీపై ఉందని జగన్‌గారు గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారికి వైయస్ఆర్‌సీపీ అండగా ఉండాలనే కోణంలో పలు అంశాలు నిర్దేశించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకుంటూ, కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయడంతో పాటు, పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. నియోజకవర్గ సమన్వయకర్త నుంచి మండల స్థాయి వరకు పార్టీ శ్రేణులు పూర్తి సమన్వయంతో పని చేయాలని కోరారు రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయి. బాధితులకు అన్యాయం జరుగుతున్న ప్రతిచోటా వైయస్ఆర్‌సీపీ ఉండాలని వైయస్ జగన్ సూచించారు. ప్రజలకు కూటమి పార్టీలు 143 వాగ్దానాలను ఇచ్చాయి. సూపర్ సిక్స్ కాస్తా గాలికి వదిలేశారు. గత వైయస్ఆర్‌సీపీ హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు, ప్రజల జీవన ప్రమాణాల్లో తీసుకువచ్చిన మార్పులను మరోసారి గుర్తు చేసుకోవాలి. ఇప్పుడు వాగ్దానాల అమలు అనేది ఎక్కడా లేదు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు జరుగుతోంది. సంక్షేమ పథకాలు పేదలకు చేరువ కావడం లేదు. విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. పేదలు తమ పిల్లలను చదివించుకోలేక, బడికి పంపాల్సిన పిల్లలను కూలికి పంపుతున్నారు. ఇటువంటి స్థితిలో వైయస్సార్‌సీపీ వారికి అండగా నిలబడుతుంది. రైతులను పట్టించుకునే తీరికే కూటమి ప్రభుత్వానికి లేదు. మన ప్రభుత్వ హయాంలో రైతేరాజుగా ప్రాధాన్యత ఇచ్చాం. రైతుభరోసా ద్వారా రైతులకు అండగా నిలిచాం. విత్తనం నంచి విక్రయం వరకు ఆర్బీకేల ద్వారా ఆనాడు వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంది.

## శ్రీశైలం డ్యాం భద్రతపై డ్యామ్ సేఫ్టీ బృందం పరిశీలన



డ్యాం స్థితిగతులను పరిశీలించిన ఎన్.డి.ఎస్.ఎ బృందం

**శ్రీశైలంప్రాజెక్టు,ఏప్రిల్29,ప్రభాతవార్త** ఉభయ తెలుగు రాష్ట్రాలకు త్రాగు,సాగునీటికి భహుళార్థ సాదక ప్రాజెక్టుగా పేరుగాంచిన శ్రీశైలం జలాశయంను మంగళవారంనాడు నేషనల్ డ్యాం సేఫ్టి ఆథారిటి బృందం క్షేత్రస్థాయిలో పరిశిలించారు.వీరికి శ్రీశైలం డ్యాం చీఫ్ఇంజనీరు కబిర్‌బాషా ఘనస్వాగతం పలికారు.జలశయం స్థితిగతులపై ఎన్.డి.ఎస్.ఏ చైర్మన్ అనిల్ జైన్(న్యూఢిల్లి)డ్యాం వ్యూ పాయింటు వద్ద డ్యాం ఎస్.ఈ శ్రీరామచంద్రమూర్తి,అధికారులతో సమావేశం అయి వివరాలను అడిగితెలుసుకున్నారు.2009 వ ఏడాదిలో జలాశయంకు సామర్థ్యంకు మించి అత్యదిక క్యూసేక్కుల నీరు వచ్చిన సందర్భంగా డ్యాం రెడియల్ క్రస్ట్‌గేట్లకు ముందు ఉన్న ప్లంజుపూల్ వద్ద 100 అడుగుల మేర గోయ్యి పడడంతో జలాశయాలకు సంబందించి 2014వ సంవత్సరంలో సి.డబ్ల్యుసి నిపుణులు,పలు బృందాలు సందర్శించి పలు సూచనలు చేయడం జరిగింది.అదే విధంగా 2019వ సంవత్సరంలో గోవా ఎన్ఓసి(నేషనల్ ఇనిస్టిట్ ఆఫ్ ఓషనోగ్రఫీ నిపుణుల బృందం ప్లంజుపూల్ లోతుపై ఆండర్ వాటర్ సర్వే కూడా నిర్వహించడం జరిగింది.ఈక్రమంలోనే ప్లంజుపూల్ దగ్గర ఏర్పడ గోయ్యి వల్ల డ్యాం భద్రతకు ఇబ్బందులు ఏర్పాడుతునా ్నయని నిపుణుల బృందాలు ప్రభుత్వాలకు నివేదికలు ఇవ్వడం కూడా జరిగింది.ఈ నేపథ్యంలోనే నీటిపారుదలశాఖ అధికారులతో కలసి బృందం డ్యాం ముందుబాగాన ప్లంజుపూల్ వద్ద ఏర్పడిన గుంతను పరిశీలించారు.ప్రతి ఏడాది డ్యాం గేట్లను తేరిచి దిగువకు నీటిని వదులుతుండడంతో గోయ్యి మరింత పెరుగుతుంది.

## అమరావతిలో ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు పూర్తి మంత్రి నారాయణ

**విజయవాడ ఏప్రిల్29 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాని మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని మంత్రి నారాయణ తెలిపారు. మిగిలిన పనులను రేపటికి పూర్తిచేస్తామని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. రూ.43 వేల కోట్ల పనులను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుంది. రాజధాని కోసం కేవలం 50 రోజుల్లో ఒక్క సమస్య కూడా లేకుండా రైతులు భూములు ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో రాజధాని కట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సింగపూర్ సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందించాం. 365 కి.మీ ట్రంక్ రోడ్లు, 1500 కి.మీ లే ఔట్ రోడ్లు నిర్మించేలా ప్లాన్ ఉంది. గతంలోనే రూ.41 వేలకోట్లకు పనులు ప్రారంభమయ్యాయి. 2019కు ముందు రూ.5 వేల కోట్ల బిల్లులు కూడా చెల్లించాం. గత ప్రభుత్వం రాజధానిపై మూడు ముక్కలాట ఆడింది. న్యాయపరమైన సమస్యలు లేకుండా ముందుకెళ్లేందుకు ఇంత సమయం పట్టింది. మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి చేస్తాం. సోమవారం అమరావతి ప్రాంత రైతులతో సీఎం రెండుగంటలపాటు మాట్లాడారు. 29 గ్రామాల రైతులను ప్రధాని సభకు రావాలని సీఎం స్వయంగా ఆహ్వానించారు. అమరావతిపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని రైతులు కోరారు. ఈ అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారు అని నారాయణ తెలిపారు.

## కానిస్టేబుల్ నుంచి ఐపిఎస్ వరకు ఉదయ్ ప్రయాణం స్ఫూర్తిదాయకం

### - సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

**విజయవాడ ఏప్రిల్ 29, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్‌కృష్ణారెడ్డి కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ వరకు చేసిన ప్రయాణం అభినందనీయమని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ధైర్యం, అవిశ్రాంత కృషి ఉంటే ఏ కల కూడా పెద్దది కాదని ఉదయ్ రుజువు చేశారని సీఎం పేర్కొన్నారు. కష్టపడేవారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారిగా ఉదయ్ ఎదిగారని లోకేశ్ కొనియాడారు. ఆయన ప్రయాణంలో ధైర్యసాహసాలు, త్యాగం, అవిశ్రాంత సంకల్పం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఉల్లపాలేనికి చెందిన ఉదయ్‌కృష్ణారెడ్డి ఇటీవల వెల్లడైన సివిల్స్ ఫలితాల్లో 350వ ర్యాంక్ సాధించారు.



## కాణిపాకం సన్నిధిలో శ్రీలంక మాజీ ప్రధాని

**కాణిపాకం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: శ్రీలంక** దేశ మాజీ ప్రధాని మహీందా రాజపక్సే మంగళవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## నేటి నుండి రామానుజుల అవతార మహోత్సవాలు

**తిరుమల,ఏప్రిల్ 29ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నేటి నుండి మేనెల 2వతేదీ వరకు భగవద్ రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు జరగనున్నాయి. తిరుపతి అన్నమాచార్యకళామందిరంలో మూడురోజులపాటు సాయంత్రం 6గంటల నుండి రాత్రి 8.30గంటల వరకు భగవద్ రామానుజాచార్యులపై సాహితీ సదస్సు ,సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు. నేటి సాయంత్రం 5.30గంటలకు పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి మంగళశాసనాలతో రామానుజాచార్యుల అవతారోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం తిరుపతికి చెందిన ఆచార్య చక్రవర్తి రంగనాధన్ రామానుజాచార్ల వైభవంపై అనుగ్రహభాషణం చేస్తారు. భక్తిసంగీత కార్యక్రమాలు ఉంటాయి.

## మే 2నుండి మొగలిచెర్ల దత్తాత్రేయ ఆరాధన మహోత్సవాలు



**తిరుపతి,ఏప్రిల్ 29ప్రభాతవార్తప్రతినిధి:** వైశాఖమాసంలో నెల్లూరుజిల్లా లింగసముద్రం మండలం మొగలిచెర్లలో కొలువైన దత్తాత్రేయస్వామి ఆరాధన మహోత్సవాలు మూడురోజులు వేడుకగా జరగనున్నాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవనినాగేంద్రప్రసాద్ తెలిపారు.ఈ ఆరాధన మహోత్సవాల్లో మేనెల 2వతేదీ శుక్రవారం సాయంత్రం గ్రామోత్సవం, 3వతేదీ శనివారం కలశోత్సవం, స్వామివారి అభిషేకాలు, 4న ఆదివారం దత్తదీక్షాపరులచే పండరీ భజనలు, దత్త ఆరాధన ఉంటుందన్నారు.ఆరాధన మహోత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తులకు ఉచిత భోజన వసతి ఏర్పాటుచేయబడుతుందని తెలిపారు. భక్తులు దత్తాత్రేయస్వామి బృందావనం దర్శించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆరాధన మహోత్సవాలకు సంబంధించి 9908973699,9182882632నంబర్‌లకు సంప్రదించాలని ప్రసాద్ కోరారు.

## అందరికీ శుభాలు కలగాలి - మాజీక్రికెటర్ శ్రీశాంత్



**తిరుమల,ఏప్రిల్ 29ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలని వేడుకున్నట్లు మాజీక్రికెటర్ శ్రీశాంత్ తెలిపారు. తిరుమలలో స్వామివారి దర్శనం బాగా జరిగిందని, ఆనందంగా ఉందన్నారు. మంగళవారం ఉదయం కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చిన ఆయన ఉదయం విఐపి బ్రేక్‌లో వెంకన్న ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుమలలో అధునాతన క్లీనింగ్ యంత్రం



**తిరుమల,ఏప్రిల్ 29ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమల ఆలయం పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడమేగాక ఈగలు,దోమలు కూడా వాలకుండా టిటిడి జాగ్రత్తలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే ఈ జర్మన్ టెక్నాలజీ యంత్రంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నేలభాగంపై పనిచేస్తూ శుభ్రత పాటిస్తోంది. ఇందులో 150లీటర్ల సామర్థ్యం నీటిని నిల్వచేసుకుని ముందుగా నీటిని వెదజల్లి ఆ తరువాత చిన్నపాటి ఇసుకరేణువులు ఉన్నా, గులకరాళ్ళు వంటి ధుమ్ము ఉన్నా పూర్తిగా శుభ్రం చేస్తుంది. వేసవికాలంలో భక్తులకు పూర్తి ఆరోగ్యపరిరక్షణకు కూడా టిటిడి చర్యలు తీసుకుంది. ఈ అధునాతన యంత్రం విరాళంగా అందించారని, దీని పనితీరు బావుందని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయం ముందు ప్రయోగాత్మకంగా పనితీరును పరిశీలించారు. ఇప్పటికే తిరుమలలో ధుమ్ము, మట్టి, చెత్త తొలగించే యంత్రాలు ఉన్నా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇదీ తయారైందని తెలిపారు.

## ఎస్వీగోశాలకు కూలర్ బహూకరణ



**తిరుమల,ఏప్రిల్ 29ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని టిటిడి ఎస్వీగోశాలలో గోమాతలకు వేడినుండి ఉపశమనం కోసం కూలర్ విరాళంగా అందించాడు. టిటిడి బోర్డు సభ్యుడు రంగశ్రీ మంగళవారం మధ్యాహ్నం తిరుపతి జనసేననేత ,ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ తోకలసి జంబోకూలర్ అందజేశారు. ఇప్పటికే కిరన్‌రాయల్ రెండు కూలర్లు అందించారు. కూలర్లు వల్ల గోమాతలకు మరింత చల్లదనం చేకూరుతుంది.

## శ్రీవారి దర్శనంలో సినీనటి ఆషికరంగనాథన్



**తిరుమల,ఏప్రిల్ 29ప్రభాతవార్తప్రతినిధి:** విశ్వంభరచిత్రంలో నటిస్తున్నానని, ఈ చిత్రం ప్రేక్షకులకు నచ్చేలా షూటింగ్ జరుగుతోందని సినీనటి ఆషికరంగనాథన్ తెలిపారు. తిరుమలలో దేవుని అన్నప్రసాదాలు నాణ్యత, రుచిగా బావున్నాయన్నారు. సినీనటి ఆషిక మంగళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి దేవుని దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమలలో భక్తులకు సౌకర్యాలు బావున్నాయన్నారు.

## సిఐడీలో హోంగార్డు పోస్టుల భర్తీ

**విజయవాడ,ఏప్రిల్ 29,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర సిఐడీ విభాగంలో 28 హోంగార్డుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఆసక్తి కల్గిన అభ్యర్థులు మే 1 నుండి 15 లోగా ధరకఖాస్తు చేసుకోవాలని సిఐడి విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్ చెప్పారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్,క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట ,ఆంధ్రప్రదేశ్,ఏపీ పోలీసు హెడ్ క్వార్టర్స్,మంగళగిరి-522503 చిరునామాకు నేరుగా లేదా రిజిష్టర్ పోస్టులో ధరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. పూర్తి వివరాలకు 9440700860 నంబర్‌ను సంప్రదించాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హతలు ఇలా ఉన్నాయి ఏపీకి చెందిన వారై ఉండాలి వయోపరిమితి: 18-50 ఏళ్ళ మధ్య(2025 మే 1 నాటికి) ఉండాలి ఎత్తు:పురుష/లు(160 సెం.మీ,మహిళలు150 సెం.మీ.(ఎస్టీ మహిళా అభ్యర్థులకు 5 సెం.మీల మినహాయింపు),కనీస విద్యార్హత ఇంటర్మీడియెట్.బిటెక్,ఎంసిఎ,బిసిఎ,బిఎస్సీ కంప్యూటర్స్ చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.ఎంపిక ప్రక్రియలో కంప్యూటర్ నైనుణ్యాలు,డ్రైవింగ్ లైసెన్సు కల్గి ఉండాలి.

**VIJAYAWADA MUNICIPAL CORPORATION**
**'E' Procurement Notice No. E6-105802/2025, Dt.29-04-2025**
Construction Strom Water Drain in Iron Yard 43rd Division (Total 1 Work)-Est. Amount Rs.700.00 Lakhs.
**All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of**
Further details and any corrigendum can be seen @ **www. tender.apeprocurement.gov.in.**
**Sd/- For COMMISSIONER**

వార్త

ఆత్మ విశ్వాసం లేకపోవడమే మన అపజయాలెన్నింటికో ప్రధాన కారణం.

-సి.బావే

# ప్రభుత్వ విద్యకు తగ్గుతున్న ఆదరణ!

ఒకనాడు ఎంతో పవిత్రంగా భావించి, ఆరాధించి పూజించిన విద్య రానురాను అంగడి సరుకుగా మారిపోతున్నది. ప్రస్తుతం విద్య ఒక వ్యాపార రూపం దాల్చింది. విద్యనేకాదు విద్యార్థుల తోసహా ఏకంగా విద్యాసంస్థలను అమ్మకానికి పెట్టే దురదృష్టపు రోజులు దాపురించాయి. విద్యాశాఖ అసమర్థతకు నిదర్శనంగా విద్యావ్యాపారం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఆమాటకొస్తే దేశవ్యాప్తంగా రోజురోజుకు విస్తరించిపోతున్నది. ప్రైవేట్ రంగంలో విద్యావ్యాపారం వెర్రితలలు వేస్తున్నది. లాభసాటిగా ఉన్న ఈ వ్యాపారంలో గతంలో ఇతర వ్యాపారాలు చేసేవారు, కాంట్రాక్టర్లు, అన్నింటికంటే ముఖ్యంగా రాజకీయ నాయకులు నేరుగా భాగస్వాములు అవుతున్నారు. విద్యాశాఖలో పటిష్టమైన చట్టాలున్నా అమలు చేయగలిగిన సామర్థ్యంగల అధికారగణం ఉన్నా పరిస్థితిరానురాను అగమ్యగోచరంగా మారుతున్నది. గతంలో ప్రభుత్వరంగంలో పటిష్టంగానే బడులునడిచేవి. కానీ పరిస్థితులు మారిపోయాయి. పాలకుల అశ్రద్ధ, కొందరు అధికారుల స్వలాభాపేక్ష, అవినీతి, వీటన్నింటిమించి న రాజకీయ జోక్యంతో విద్యాప్రమాణాలు నానాటికీ దిగ జారిపోతున్నాయి. రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బీదాబిక్కి జనంకూడా నాణ్యమైన విద్య ప్రైవేట్ పాఠశాలల్లోనే దొరుకుతుందని నమ్మకంతో ఆ వైపు మొగ్గుచూపుతున్నారు. ఏమాత్రం ఆర్థిక వసతి లేనివారు, మరో దారిలేని వారు విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల బాటపడుతున్నారు. గ్రామాలకు కూడా ఈ ప్రైవేట్ విద్యా వ్యాపారం విస్తరిస్తున్నది. ఇక రానురాను ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఏమిటనేది ప్రశ్న ఉదయిస్తున్నది.

గత దశాబ్దం కాలంగా యేడాది యేడాదికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంటే ప్రైవేట్ రంగంలో పెరిగిపోతున్నది. తెలంగాణలోప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలలో గత పదేళ్లలో ముప్పైరెండు శాతం దాదాపు మూడోవంతు తగ్గిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన 2014-15 విద్యాసంవత్సరంలో 24లక్షల 85వేల మంది పిల్లలు ప్రభుత్వబడుల్లో చదువుతుండగా ఈ విద్యాసంవత్సరం (2024-25)లో వారి సంఖ్య పదహారు లక్షల ఎనభైఆరువేలకు పడిపోయింది. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాకరంగా చేపట్టినగురుకులాల్లో కూడా ఈ పదేళ్లల్లో విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే తగ్గుముఖం పట్టినట్లే కన్పిస్తున్నది. ప్రధానంగా కరోనా రక్కసి విజృంభణ సమయంలో విద్యారంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపింది. చదువుకు స్వస్తి చెప్పిన విద్యార్థులు లక్షల సంఖ్యలో ఉన్నారు.వారిని తిరిగి బడిబాట పట్టించడంలో పాలకులు విఫలమయ్యారనే చెప్పొచ్చు.అందుకు తల్లిదండ్రుల సహకారం కూడా లేకపోవడం కారణం. ఇక అన్ని రకాల ప్రభుత్వవిద్యాసంస్థల్లో పిల్లల సంఖ్య పరిగణనలోకి తీసుకున్నా ఈ పదేళ్లకాలంలోనాలుగులక్షల ముప్పై ఏడువేల మంది తగ్గారని విద్యాశాఖ గణాంకాలు వెల్లడి స్తున్నాయి. ఇక ప్రైవేట్‌పాఠశాలల్లో ఈ పదేళ్లకాలంలో ముప్పైఒక లక్ష పదిహేడువేల మందినుండి ప్రస్తుతం ముప్పైఆరులక్షల డెబ్బైమూడువేల మందికి పెరిగింది. ప్రతి యేడాది ప్రభుత్వ స్కూళ్లకంటే ప్రైవేట్ స్కూళ్లల్లో విద్యార్థుల సంఖ్య ఊహించని విధంగా పెరిగిపోతున్నది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎటువైపు దారితీస్తుందో? ఎందుకు ఈపరిస్థితి దాపురిస్తున్నది? కారకులెవరో? కారణాలు ఏమిటి? అని అటు అధికార వర్గాలకు కానీ,పాలకులకు కానీ తెలియందికాదు. దీనిపై చర్చోపచర్చలు కూడా జరుపుతున్నారు. ప్రభుత్వ పథకాలు, ఆశయాలు, కాగితాలవరకు బాగానే ఉంటున్నాయి. ఆచరణకు వచ్చేసరికి అసలు సమస్యలు కారణాలవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో యేటా వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. ప్రభుత్వాల బడిబాటఅంటూ పాఠశాలల్లో చేర్పించడం, ఎన్నో ప్రోత్సాహకాలుప్రకటించే ప్రయత్నాలు చేస్తున్నారు. మరొకపక్క మధ్యాహ్నభోజనం పథకం, ఉచిత పుస్తకాలు,అన్నీ సమకూరుస్తున్నా ప్రైవేట్ విద్యాసంస్థలు డిమాండ్ చేసే ఫీజులు చెల్లించి రకరకాలుగా డ్రస్సులు, బూట్ల పేరుతో వసూలుచేస్తున్నా అటువైపే మొగ్గుచూపుతున్నారు.ఇక విద్యాబోధన విషయంలో ప్రైవేట్‌రంగంలో కంటే ప్రభుత్వరంగంలో అర్హులైన,అనుభవం కలిగిన బోధనా సిబ్బందిఉంది. అయినా ఆబాట పట్టడం లేదు.అన్నింటికంటే ముఖ్యంగా పాఠశాలల్లో కనీస వసతుల కొరత తీవ్రంగా కన్పిస్తుంది.పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్లు వంటి వసతులు లేకపోవడంతో బాలికలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. స్వాతంత్ర్యంవచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా అందరికి విద్య అందించాలన్న లక్ష్యం కనుచూపుమేరలో కన్పించడం లేదు. దేశాభివృద్ధికేకాదు మానవజాతి అభ్యున్నతికి విద్యపునాది అనేది నిర్వివాదాంశం.ఆరేళ్లనుంచి పధ్నాలుగేళ్ల బాలబాలికలందరికీ ఉచితవిద్య అందించాలనే కార్యక్రమం పదేళ్లలో పూర్తి చేయాలని స్వాతంత్ర్యం రాగానే ఆనాడే ప్రజలు నిర్ణయించారు. ఆ సంకల్పం కాగితాల్లోనే కన్నుమూసింది. ఇక డిపెప్,ఎపెప్,సర్వశిక్ష అభియాన్ వంటి కార్యక్రమాలు చేపట్టి దేశవ్యాప్తంగా లక్షలాది కోట్లరూపాయలు వెచ్చించారు, వెచ్చిస్తున్నారు.కానీ లక్ష్యానికి చేరుకోలేకపోతున్నారు.ఇప్పటికైనా బాలబాలికలను భావిపౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వరంగంలోని విద్యాసంస్థలు ఇంతటి దారుణ పరిస్థితుల్లోకి నెట్టడం సమంజసంకాదు.విద్యావ్యాపారాన్ని ఆపకపోతే భవిష్యత్‌లో ఎలాంటి విపరీతధోరణలు చోటు చేసుకుంటాయో ఊహిస్తేనే భయాందోళనలు కలుగుతాయి.విద్యను వ్యాపారంగా మార్చేవారిపై ఉక్కుపాదంమోపాలి. అలాగే ప్రభుత్వరంగంలో విద్యాప్ర మాణాలు పెంచేందుకు అవసరమైన అన్నిచర్యలు చేపట్టాలి.


# అవినీతిని పెకలిస్తేనే అభివృద్ధి!

***నిజానికి పరిపాలనా నిపుణుల అభిప్రాయం ప్రకారం బ్యూరోక్రసీలో అవినీతి పైనుండి క్రిందకు ప్రవహిస్తుంది. కాని పైస్థాయిలో భారీ అవినీతి ఆచూకీ కూడా కనపడడం లేదంటే ఆ స్థాయిలో అవినీతి జరగడం లేదా? జరిగినా అది అవినీతి నిరోధకశాఖవలకు చిక్కడంలేదా? అనే సందేహం సామాన్య ప్రజలను సైతం వేధిస్తోంది. ప్రజల సొమ్ముతో వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తూ జీతభత్యాలు తీసుకుంటున్న అన్నిస్థాయిల ఉద్యోగులు వారి వారి ఉద్యోగ సంబంధిత మార్గదర్శకాలను త్రికరణ శుద్ధిగా నిర్వర్తిస్తూ అవినీతికీ, ఆర్థిక ప్రలోభాలకు పాల్పడడం ఓపాపంగా, చట్ట రీత్యా శిక్షార్హమైన నేరంగా భావిస్తూ నీతిగా, నిజాయితీతో తమతమ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించినప్పుడే అవినీతి అంతం కాకున్నా కొంత మేరకైనా నియంత్రించబడుతుంది.***



డాక్టర్ నీలం సంపత్

ప్రపంచంలో ఎక్కడైనా కోరికల పుట్ట లాంటి మానవుల కోరికలను తీర్చేశక్తి నిస్సందేహంగా ఆర్థిక వనరులదే. ఐతే వాటి నిర్వహణ అవినీతి విష కౌగిలిలో చిక్కి మానవ జీవనం విధ్వంసానికి కారణమవుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో అవినీతి ఏదో ఒక దేశానికో, పాలనా విధానానికో పరిమితమైనది కాదు. రాచరిక,నియంతృత్వ పాలనలోనే కాదు ప్రజాస్వామ్య వ్యవస్థలోనూ, చివరకు కమ్యూనిస్టు, సోషలిస్ట్ పాలనలోనూ దాని మనుగడ ప్రమాదకరంగా పరిణమిస్తోంది. ఉన్నతాధికారులతో సహా అనేకమంది ప్రపంచ చిత్ర పటంలో అవినీతికి పాల్పడి ఆయా దేశాల్లో ప్రజా జీవనాన్ని విధ్వంసానికి గురిచేసి జైలు పాలైన సంఘటనలు కోకొల్లలు.ఐనా అవినీతిని అరికట్టలేకపోతుండడం దురదృష్టకరమే. ఒక వ్యక్తి లేదా ఒక సమూహం వ్యక్తిగత లాభంకోసం అధికారాన్ని దుర్వినియోగం చేయడం ద్వారా నగదు లేదా వస్తు లేదా ఇతర ఆస్తుల రూపంలో లబ్ధిని పొందడం. అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం నిజాయితీ లేని క్రిమినల్ నేరమేనని చెప్పక తప్పదు. ప్రపంచ స్థాయిలో అవినీతి స్థాయిని లెక్కించే కరప్షన్ పర్ సెప్షన్ ఇండెక్స్ 2024 ప్రకారం అవినీతి అతి తక్కువగా వున్న దేశాలలో డెన్మార్క్, ఫిన్లాండ్, న్యూజిలాండ్, లుగ్జెమ్ బర్గ్, నార్వే, స్విట్జర్లాండ్, స్వీడన్‌లు కొనసాగుతుండగా అత్యంత అవినీతికర దేశాల్లో దక్షిణ సూడాన్, సోమాలియా, వెనిజులాలున్నాయి. ఇక మన దేశం విషయానికి వచ్చినప్పుడు 180 దేశాల జాబితాలో మనదేశం 96వ స్థానంలోవుండడం బాధాకరం. మిలటరీ పాలనలోకొనసాగుతున్న పాకిస్థాన్ 91వ స్థానంతో మనకంటే మెరుగైన స్థితిలో వుండడం గమనార్హం. కమ్యూనిస్ట్ చైనా 43వ ర్యాంక్‌తో మరింత తక్కువ అవినీతికర దేశంగా కొనసాగుతోంది. మన దేశంలో వివిధరాష్ట్రాలలో, కేంద్ర పాలిత ప్రాంతాలలో అవినీతిని పరిశీలించినప్పుడు బీహార్, యు.పి, రాజస్థాన్, యం.పిల తర్వాత ఐదో స్థానం తెలంగాణ రాష్ట్రానిదే కావడం అత్యంత దురదృష్టకరంగా అభివర్ణించక తప్పదు. మరోవైపు కేరళ, గోవా, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు తక్కువ అవినీతికరమైనవిగా గుర్తించబడినవి. ప్రపంచంలో రెండవ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారత దేశంలో 1948లో జీప్‌స్కామ్, 1951లో సైకిల్ స్కామ్,1981 లో సిమెంట్ స్కామ్,బీహార్‌లో పశువుల దాణా స్కామ్, 1987 లో బోఫోర్స్ స్కామ్, 2012 లో యు.పి.లో జరిగిన యన్.ఆర్.హెచ్. యమ్ స్కామ్,ఆదర్శ హౌజింగ్ సొసైటీ స్కామ్, రఫేల్ యుద్ధ విమానాల స్కామ్, 2జి స్కామ్‌లే కాకుండ ఇంకా విచారణ దశలో వున్న అనేక స్కాములలో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిన నేపథ్యంలో భవిష్యత్‌లో అలాంటి అవినీతి జరగకుండ నిరోధించడం కోసం సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సి.బి.ఐ లాంటి ప్రతిష్టాత్మక నేర విచారణ, పరిశోధనా సంస్థల ఏర్పాటుతో పాటు,ఐ.పి.సి, అవినీతి నిరోధక చట్టం, మనీ లాండరింగ్ చట్టం,లోక్‌పాల్ ఏర్పాటు, లోకాయుక్త చట్టం, బి.యన్.యస్ ,విజిల్ బ్లోయర్ ప్రొటెక్షన్ చట్టం లాంటి అనేక చట్టాలను జారీచేసినా అవినీతిని అరికట్టలేకపోతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. తొలిసారి అవినీతిని అసహ్యించుకున్న వారే దానిని ఒకసారి దాని రుచి మరిగిన తర్వాత ఆలింగనం చేసుకుంటారని చెప్పడానికి దేశంలో అవినీతి నిరోధక ఉద్యమాన్ని ముందుండి నడిపించిన సామాజిక కార్యకర్తలు కొంత మంది రాజకీయ నాయకులుగా మారి అవినీతి ఆరోపణలతో జైలుకెళ్లిన వైనాన్ని ఉదాహరణగా చెప్పక తప్పదు.ఐతే రాబోయే కాలంలో ఆ ఆరోపణలు ఏ




మేరకు నిజమౌతాయో వేచి చూడకతప్పదు.గతంలో దక్షిణ భారతంలో ఓ ప్రాంతీయపార్టీని అధికారానికి దూరం చేసిన 2జి స్కామ్ అసలు స్కామేకాదని దర్యాప్తులో తేలిన వైనం బహిరంగ రహస్యమే.ఆచరణలో అధికశాతం అవినీతి ప్రభుత్వ పథకాలు,భారీ నీటి పారుదల ప్రాజెక్టులు, వేల లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలో జరుగుతున్న నేపథ్యంలో అన్నిరకాల అవినీతులకు రాజకీయ అవినీతే మూలంగా భావించక తప్పదనేది పాలనా నిపుణుల నిశ్చితాభిప్రాయం. నిజానికి అవినీతికి కారణాలలో ముఖ్యమైనవి ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన విధానాలలో పారదర్శకత లోపించడం, ప్రజల భాగస్వామ్యం లేకపోవడం,ఆయా శాఖల అధికారులకు అకౌంటెబిలిటీ ఫిక్స్‌చేయకపోవడం,చట్టాలను అమలుపరిచే సంస్థలైన రెవిన్యూ,విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, అవినీతి నిరోధక శాఖ, పోలీసుశాఖలు ఆశించిన స్థాయిలో అవినీతి నిరోధక చర్యలను తీసుకోలేకపోవడం,బ్యూరోక్రటిక్ రెడ్ టేపిజమ్, అన్నింటికీ మించి రాజకీయ జోక్యాలేనని చెప్పక తప్పదు. నిజానికి అన్ని బడాస్కాములు కేంద్రంలో,రాష్ట్రంలో అధికారపార్టీ నేతలూ,వారి కుటుంబ సభ్యులే కేంద్ర బిందువుగా కార్యనిర్వాహక వ్యవస్థ తోడ్పాటుతోనే జరిగినట్లు ఆయా అవినీతి కేసులను ఎంక్వైరీ చేసిన విచారణ సంస్థల నివేదికలు తేటతెల్లం చేస్తున్నాయి.గతేడాది రాష్ట్ర అవినీతి నిరోధకశాఖ వెల్లడి చేసిన సమాచారం ప్రకారం రెవెన్యూశాఖ అగ్రభాగాన వుంది. రెవెన్యూశాఖలో భారీ అవినీతికి కారణం భూముల విలువ కోట్లకు పెరగడంతో పాటు,భూమి పై హక్కులను బదిలీ చేయడానికి సంబంధించిన విధానాలలో లోపాలేననే సత్యాన్నిజీర్ణించుకోకతప్పదు. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న పట్టణీకరణ, చట్ట విరుద్ధమైన లేఔట్లు, లోపభూయిష్టమైన గృహ నిర్మాణ అనుమతులు అవినీతిని పెంచి పోషిస్తున్నాయేమోననే భావనతో పాటు హైదరాబాద్ మహానగరం చుట్టూ ఆవరించివున్న ఔటర్ రింగ్ రోడ్‌ను ఆనుకొని అఖిల భారత సర్వీసుల అధికారుల్లో కొంతమంది అధికార దుర్వినియోగంతో వందల ఎకరాల భూముల్ని ఆక్రమించుకొని ఫాంహౌస్‌లూ, విల్లాలు నిర్మించుకున్నారనే ఆరోపణల పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దీనికి కొనసాగింపు గా నిన్నటి రోజున ఓ ముప్పై మంది ఐ.ఎ.యస్ ఐ.పి.యస్ అధికారులు యాజమాన్యపు హక్కులను కలిగివున్న భూదాన్ భూములను నిషేధిత భూముల జాబితాలో చేర్చాల్సిందేననే రాష్ట్ర హైకోర్ట్‌ఉత్తర్వులు తాత్కాలికంగా సదరు అధికారుల ప్రతిష్టకు ఎంతో కొంత నష్టాన్ని కలిగించేవేనని చెప్పక తప్పదు. ఆ తర్వాత అవినీతి విలయ తాండవం చేస్తున్నశాఖల్లో రవాణాశాఖ, పోలీసుశాఖలుపోటీ పడుతున్నాయని చెప్పడానికి సదరు శాఖలకు సంబంధించిన ఉద్యోగులు,అధికారులు అవినీతి నిరోధక శాఖ వలలో చిక్కుకుంటున్న వైనాన్ని తెలియజేస్తున్న పత్రికా కథనాలే సాక్ష్యంగా భావించక తప్పదు. ఐతే అవినీతి కూపాలుగా మారిన ప్రతి ప్రభుత్వశాఖలో ఉద్యోగులపై ఏ.సి.బి ట్రాప్‌లతోపాటు ఆదాయాన్ని మించి ఆస్తులను కలిగివున్న కేసులను సైతం నమోదు చేస్తున్నవైనాన్ని గమనించినప్పుడుమెజారిటీ సందర్భాల్లో క్రింది స్థాయి ఉద్యోగులే బలి పశువులుగా మారుతున్న వైనాన్ని బట్టి పైస్థాయి అధికారులు ఏవో అదృశ్యశక్తుల ఆశీస్సులతోనే ఏ.సి.బి దాడులను తప్పించుకోగలుగుతున్నారంటూ బాధిత ఉద్యోగులు తమ ఉక్రోషాన్ని వెళ్ళగక్కుతున్నారు.వారి ఆవేదనలో ఎంతోకొంత నిజముందనే భావనను సపోర్ట్ చేసేవిధంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో జిల్లా ఆపైస్థాయి అధికారులపై ఏ అవినీతి కేసులు నమోదు కావడం లేదు.భారీ అవినీతి ఆరోపణలతో విచారణ కొనసాగుతున్న కాళేశ్వరంప్రాజెక్ట్ నిర్మాణ బాధ్యతలనునిర్వహించిన ఇసి అధికారి ఆదాయాన్ని మించినఆస్తులను కలిగివున్నాడనే ఆరోపణతో ఆయన ఆస్తులపై జరుగుతున్న దాడుల్లో పెద్ద మొత్తంలో అక్రమ ఆస్తులు వెల్లడౌతున్న వార్తా కథనాలు విస్తుగొలుపుతున్నాయి.నిజానికి పరిపాలనా నిపుణుల అభిప్రాయం ప్రకారం బ్యూరోక్రసీలో అవినీతి పైనుండి క్రిందకు ప్రవహిస్తుంది. కాని పైస్థాయిలో భారీఅవినీతి ఆచూకీకూడా కనపడడం లేదంటే ఆ స్థాయిలో అవినీతి జరగడం లేదా ? జరిగినా అది అవినీతి నిరోధకశాఖవలకు చిక్కడంలేదా?అనే సందేహం సామాన్య ప్రజలను సైతం వేధిస్తోంది. ప్రజల సొమ్ముతో వివిధ ప్రభుత్వశాఖలలో పనిచేస్తూ జీతభత్యాలు తీసుకుంటున్న అన్నిస్థాయిల ఉద్యోగులు వారి వారి ఉద్యోగ సంబంధిత మార్గదర్శకాలను త్రికరణశుద్ధిగా నిర్వర్తిస్తూ అవినీతికీ,ఆర్థిక ప్రలోభాలకు పాల్పడడం ఓపాపంగా,చట్ట రీత్యా శిక్షార్హమైన నేరంగా భావిస్తూ నీతిగా,నిజాయితీతో తమతమ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించినప్పుడే అవినీతి అంతం కాకున్నా కొంత మేరకైనా నియంత్రించబడుతుంది. ●

> పనులను చేయడంలో రహస్యం ఒకటుంది. అదేమిటంటే ఆ పనుల్ని వాయిదా వేయడం కాదు. వెంటనే చేయడం.



ఆడమ్ స్మిత్

> అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.



ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు



### ఏటీఎం సరే! రైళ్లలో బోగీలు పెంచండి

గత పది సంవత్సరాలలో రైల్వే శాఖ ఎన్నో మార్పులు చేసుకుంటూ అన్నివ్యవస్థల వలే పెరుగుతున్న ఆధునికతను తమ శాఖలో అమలు పరచుకుంటూనే వస్తుంది. ఇటీవల రైలులో ఏటీఎం సేవలను రైల్వేశాఖ ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకురావడం చాలా హర్షించదగ్గ విషయం. అయ్యితే రైళ్లలో ఎక్కువగా ప్రయాణించే పేద వాళ్ల కోసం రైల్వే శాఖ ఆలోచించడం లేదు. ప్రతీ ట్రైన్‌కి ఏసీ, స్లీపర్‌క్లాస్ బోగీలను పెంచుతున్నారే కానీ మధ్య తరగతివారు,పేదలు ఎక్కువగా ప్రయాణించేసెకండ్ క్లాస్ జనరల్ బోగీలను తగ్గిస్తున్నారు. ముందు రైల్వేశాఖ వీటిని పెంచడంపై దృష్టిపెట్టండి. అలాగే సీనియర్ సిటిజన్స్ టికెట్స్ రాయితీకూడా వెంటనే పునరుద్ధరించాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### సమాన హక్కులు కల్పించాలి

మావోయిస్టులు ఏమంటున్నారోవిందాం ఎందుకంటే వాళ్ల పౌర సమాజంతో విస్తృతసంబంధాలను ఏర్పచుకుంటున్నారు కదా. గిరిజనుల కోసమే రాజ్యాంగంలో చేర్చిన షెడ్యూల్ 5లో రాజ్యంగం గిరిజనులు కోసం ఏమి హామీ పడిందోప్రభుత్వాలు మరొకసారి అవలోకనంచేస్తే బాగుంటుందేమో.మరి అలా రాజ్యాంగాన్ని రాజ్యాంగ సూత్రాలను మరొకసారి అవలోకనం చేస్తే బాగుంటుందేమో. ప్రత్యేక తెలంగాణఉద్యమం సమయంలో మావోయిస్టులు తెలంగాణకు మద్దతు ఇస్తూ చర్చలు హైద్రాబాద్ లోను వరంగల్ లోను, విశాఖపట్టణంలోను, చర్చలు జరగాలి అని కోరుకున్నారు. అందులో వరంగల్‌లో జరగబోయే చర్చలలో ప్రత్యేక తెలంగాణ అంశం ప్రధానంగా ఉండాలి

-భారత అవినాష్, జనగామ

### ధర్మం తప్పుతున్న మానవ సంబంధాలు

మానవ సంబంధాలు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. సంసార బంధాలు కూడా ధర్మం తప్పుతున్నాయి. భార్యా భర్తలు వివాహేతర కారణాల వల్ల ఒకరి నోకరిని అనేక పద్ధతుల ద్వారా హతమార్చడం, అలాగే ఆస్తి తగాదాలతో కొడుకులు, తండ్రులు, తల్లులు కూడా హత్యలకు పాల్పడడం, వావివరుసలకు విలువ ఇవ్వకుండా మానభంగాలకు మరగడం, ఇటువంటి వార్తలు నిత్యం దర్శనమిస్తున్నాయి. వారికి చావే శరణ్యమవుతోంది.

-కె.రామయ్య, నల్గొండ

### పాక్‌ను ఒంటరి చేయాలి

పెహల్గాంలో విహార యాత్రికులను ఉగ్రవాదాలు ఊచకోత జరిగిన వెంటనే ఈమారణకాండకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోడీ ప్రజలకు హామీ యివ్వడం జరిగింది.ఉగ్రవాదులవల్ల భర్తలనుకోల్పోయిన వారికి న్యాయం జరగడం అనేది కల్ల.న్యాయ మంటే భర్తలు పనరుజ్జీవులు కావాలి, సావిత్రికి సత్యవంతుడులాగా.ఉగ్రవాదులను మట్టుబెడితే వీరికి న్యాయం జరగడమేమిటి?ప్రతికార చర్యలు ఆ వేడి మీదే తీసుకోవాలి. ఆలస్యమయితే పరిస్థితులు అనుకున్నట్టుగా అనుకూలించవు. సింధునదీ జలాలను ఆపితే భారత్‌లో రక్తం ప్రవహింప చేస్తామని మన శత్రువులు హెచ్చరికలు చేస్తున్నారు. భారత్ మీద 130యుద్ధ శకటాలను పాకిస్థాన్ గురిపెట్టి ఉంచిందనివార్తల్లోచ్చాయి.పాక్‌ను ఒంటరిచేసేప్రయత్నం చేయాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మానవత్వానికి మాయని మచ్చ

ఇటీవల జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం అనంతనాగ్ జిల్లా పహల్గామ్ సమీపంలోని బైసరన్ పచ్చిక మైదానంలో జరిగిన ఉగ్రదాడి భారతదేశాన్ని కలవరపెట్టింది.ది రెసిస్టెన్స్ ఫ్రంట్ అనే ఉగ్రవాద సంస్థ, పాకిస్తాన్‌కు అనుబంధంగా పనిచేస్తూ, ఈదాడికి బాధ్యత వహించింది. ఈ దాడిలో కనీసం 28 మంది మరణించగా, 20 మందికి పైగా గాయపడ్డారు. 2019లో జరిగిన పుల్వామా దాడి తర్వాత ఈప్రాంతంలో జరిగిన అత్యంత ప్రాణాంతకమైన దాడిగా ఇది భావించబడుతోంది. ఈదాడిలో హిందూ పర్యాటకులనే లక్ష్యంగాచేసుకోవడం,మతపరమైన ద్వేషాన్ని ప్రతిబింబిస్తుంది. పహల్గామ్, 'మినీ స్విట్జర్లాండ్'గా ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతం, సహజ సౌందర్యంతో పర్యాటకులను ఆకర్షిస్తుంది.

-తోట యోగేందర్, నల్లగొండ జిల్లా

### రైతు సేవలో వ్యవసాయ మార్కెట్ యార్డు!

ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోవ్యవసాయ మార్కెట్ యార్డులకు పాలకవర్గాల నియామకాలు చేపట్టి మార్కెట్ యార్డులకు పునరుత్తేజంకలిగిస్తున్నారు.రాష్ట్రజనాభాలో 70శాతం ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం.రైతులు తమ ఉత్పత్తులకు సరైన ధరలు రాక, తూకాల్లో మోసాలు,దళారులకు అయినకాడికి అమ్ముకునే దుస్థితి నెలకొంది. ఇప్పుడు ఈ నియామకాలు కేవలం అలంకారప్రాయమైన రాజకీయ పదవులుగా భావించక, రైతులకు సేవచేయడానికి వచ్చినఒక సదవకాశంగా నూతనంగా నియమితులైనవారు చిత్తశుద్ధితోఅంకితభావంతో పని చేయాలి.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు,ఏలూరు జిల్లా

# అట్టడుగు వర్గాల ఆయుష్మాన్ భవ

డా : బుర్ర మధుసూదన్ రెడ్డి

ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం' ప్రవేశపెట్టడంతో పేద బడుగు బలహీనవర్గాల ప్రజలకు సకాలంలో వైద్య ఆరోగ్య పరిరక్షణ చర్యలకు నడుం బిగించినట్లు అయింది. ఏప్రిల్ 2018లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ పథకం నేడులక్షల భారతీయ అట్టడుగువర్గాలకు ఆరోగ్యాన్ని అందుబాటు ఖర్చుతో అందించే వరంగా మారింది. ఐరాస నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో భారత్ తీసుకున్న ఏకైక పేదల పక్షపాత పథకంగా గత ఏడు ఏళ్లుగా కొనసాగుతున్నది. కేంద్ర రాష్ట్ర రాజకీయాలకు అతీతంగా సమ్మిళిత వైద్య ఆరోగ్య సంరక్షణ" ధ్యేయంగా కొనసాగుతున్న ఆయుష్మాన్ భారత్ పథకం అన్నిరాష్ట్రాలకు విస్తరించవలసిన అవసరం ఉందని తెలుసుకోవాలి. అందరికీ అందుబాటులో వైద్య ఆరోగ్యం అనే నినాదంతో ప్రారంభమైన ఆయుష్మాన్ భారత్ పథకం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, అట్టుడుకుతున్న వర్గాలకు ఆ పథకం ఆరోగ్య గొడుగు పట్టడం, ఆయుష్మాన్ కార్డులను కుటుంబాలకు అందజేయడం లాంటి లక్ష్యాలను అమలు చేయడానికి ప్రతి ఏటా 30 ఏప్రిల్ రోజున ఆయుష్మాన్ భారత్ దినోత్సవం" పాటించడంతో పాటు రెండు వారాల పాటు ఆయుష్మాన్ ఆనవాయితీగా మారింది. 2025 ఆయుష్మాన్ భారత్ దినోత్సవ ఇతివృత్తంగాఅందరికీ ఆరోగ్య సురక్ష అట్టడుగు వర్గాల ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం" అనే అంశాన్ని తీసుకుని ముందుకు సాగుతున్నారు. ఆయుష్మాన్‌భారత్




పథకం పరిధిలోకి అందరినీ చేర్చడానికి విస్తృతమైన ప్రయత్నాలు లేదా ప్రచారాలు నిర్వహించడం జరుగుతున్నాయి. దారిద్ర్య రేఖకు దిగువనఉన్న అభాగ్యులను ఈ పథకంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలుతీసుకుంటూ,ప్రజలకు పథకానికి మధ్య దూరాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తో, ఆరోగ్యం ఓ కనీస మానవ హక్కుఅని, అదివిలాసం (లగ్జరీ) కాదని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభించడం,పేద కుటుంబాలకు ఆయుష్మాన్ కార్డులు జారీచేయడం, వైద్యఖర్చులను భారీగా తగ్గించడం, గ్రామీణ వైద్యసిబ్బందిని ప్రోత్సహించడం, పేదల నమ్మకాన్ని గెలుచుకోవడం, ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించడం, కొనసాగడం సంతోష దాయకం. భారత అట్టడుగు వర్గాల్లో 55కోట్ల లబ్ధిదారులను ఈపథకం కిందకు తీసుకొచ్చి వారి వైద్యఖర్చులను భారీగా తగ్గించడం జరుగుతోంది. దేశవ్యాప్తంగా 5లక్షల కుటుంబాలు,40కోట్ల ఆయుష్మాన్ కార్డులు అందజేసి 31,846 ఆసుపత్రుల ద్వారా ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కీళ్ల మార్పిడి, బైపాస్ సర్జరీ లాంటి వైద్య చికిత్సలు కూడా ఈ పథకం కిందకు చేర్చబడ్డాయి. ఆయుష్మాన్ భారత్ దివస్‌లో భాగంగా గ్రామీణ స్థాయి వరకు వైద్య శిబిరాలు, ఆరోగ్య విద్య సెమినార్లు, పౌర సమాజానికి చేరువలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఆరోగ్య భారత మే సంపన్న భారతం అనే నినాదాన్ని నిజం చేయడానికి దోహదపడుతున్న ఆయుష్మాన్ భారత్ పథకం నిరుపేద కుటుంబాలకు ఆరోగ్య ఆసరా కావాలని కోరుకుందాం, రేపటి వైద్య ఆరోగ్య సంరక్షణకు నేడే ఆయుష్మాన్ కార్డులు తీసుకుందాం. ●

# ఆర్థిక సృజనాత్మకతకు వెలుగుబాట

డి జె మోహన రావు

ఒకప్పుడు ఆర్థిక వ్యవస్థ సేవల, సాంకేతిక రంగాల చట్రంలో తిరిగేది. కానీ ఇప్పుడు కాలం మారింది. 21వ శతాబ్దంలో మానవ మేధస్సు, కల్పనాశక్తి, ప్రతిభతో నడిచే సృజనాత్మక ఆర్థికవ్యవస్థ శక్తిమంతమైన ఉనికిని చాటుతోంది. ఇది కేవలం డబ్బు సంపాదించే మార్గం కాదు. ఆలోచనల ద్వారా విలువను పెంచే నూతన దృక్పథం. సృజనాత్మకత, తెలివితేటలే ఇక్కడ ప్రధాన పెట్టుబడులు. ఈవ్యవస్థ ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తుంది.లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తుంది. ప్రపంచవేదికపై దేశ ప్రతిష్టను పెంచుతుంది. అపార సాంస్కృతిక సంపద, భిన్నత్వం, యువత కలిగిన భారతదేశానికి ఇది గొప్ప అవకాశం. సృజనాత్మకత కేవలం కళకాదు, ఆర్థికశక్తి. వ్యక్తిగత సృజనాత్మకత, నైపుణ్యాలు, ప్రతిభ ఆధారంగా ఎదిగే వివిధ పరిశ్రమల కలయిక ఇది. మేధో సంపత్తిని ఉపయోగించి ఆర్థిక విలువను సృష్టిస్తుంది. 2001లో జాన్ హౌకిన్స్ రచించిన 'ది క్రియేటివ్ ఎకానమీ' ఈ భావనకు ప్రాచుర్యం కల్పించింది. పరిశోధన, అభివృద్ధి, సాంస్కృతిక వస్తువులు, సేవలు, కళలు దీని పునాది. మన హస్తకళలు, పెయింటింగ్‌లు, శిల్పాలు, మ్యూజియంలు, చారిత్రక ప్రదేశాలు, సంగీతం, నృత్యం, నాటకాలు, మీడియా ప్రచురణలు మన ఆలోచనలను లోకానికి చాటుతాయి. చలనచిత్రాలు, యానిమేషన్, డిజిటల్ కంటెంట్ నేటి తరం ప్రపంచం. ఆర్కిటెక్చర్, డిజైన్, ఫ్యాషన్, ప్రకటనలు, మార్కెట్ రీసెర్చ్, కంప్యూటర్ గేమ్స్, సాఫ్ట్‌వేర్ డిజైన్ వంటి రంగాలు సృజనాత్మకతకు పట్టం కడతాయి. డిజిటల్ విప్లవం, ఇంటర్నెట్ విస్తరణతో ఈ ఉత్పత్తులు,సేవలు ప్రపంచవ్యాప్తంగా వేగంగా చేరుతున్నాయి. యుఎన్సిటిఎడి 2024 నివేదిక ప్రకారం 2022లో సృజనాత్మక సేవల ప్రపంచ వాణిజ్యం 1.4 ట్రిలియన్ డాలర్లకు చేరింది (2017 నుండి 29శాతం వృద్ధి). సృజనాత్మక వస్తువుల ఎగుమతులు 19శాతం పెరిగి 713 బిలియన్ డాలర్లకు చేరాయి. మొత్తంగా, ఈ ఆర్థికవ్యవస్థ సంవత్సరానికి 2 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తోంది, 50మిలియన్ల ఉద్యోగాలకు మద్దతునిస్తోంది. సాఫ్ట్‌వేర్ సేవలు, పరిశోధనాభివృద్ధి, ప్రకటనలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. డిజిటలైజేషన్ ఈ రంగానికి ఊతమిచ్చింది. అభివృద్ధి చెందిన,చెందుతున్న దేశాలు అవకాశాలను అందిపుచ్చుకుంటున్నాయి. ఈ ధోరణి రాబోయే సంవత్సరాల్లో మరింత బలపడుతుందని అంచనా వేస్తున్నారు. అపార సాంస్కృతిక వారసత్వం, విభిన్న కళారూపాలు, నైపుణ్యం కలిగిన హస్తకళాకారులు, అతిపెద్ద యువ జనాభా



మన బలం. మన సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తోంది. ప్రస్తుతం దీని విలువ 30 బిలియన్ డాలరు. జిడి పికి 2.5శాతం తోడ్పడుతుంది. 8శాతం శ్రామిక శక్తికి ఉపాధినిస్తుంది. ఇన్ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ వంటి రంగాలు వేగంగా ఎదుగుతున్నాయి. గౌహతి, కొచ్చి వంటి నగరాలు సృజనాత్మక కేంద్రాలుగా మారుతున్నాయి. ఇది పట్టణాలు, గ్రామాల్లోని కళాకారులకు ఉపాధినిస్తుంది,యువతకు, మహిళలకు అవకాశాలు కల్పిస్తుంది. పర్యాటకాన్నిప్రోత్సహిస్తుంది. మన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఎగుమతులు పెంచవచ్చు. మన చలనచిత్రపరిశ్రమ, సంగీత రంగం, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి అనేక రంగాలు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయి.అయితే, ఈ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. అసంఘటిత రంగం, సరైన ప్రోత్సాహం లేకపోవడం, జాతీయ విధానం కొరవడటం, పెట్టుబడి లభ్యత తక్కువగా ఉండటం, బలహీనమైన మేధోసంపత్తి హక్కుల పరిరక్షణ, డిజిటల్ నైపుణ్యాల కొరత, సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం ప్రధాన సమస్యలు. సమగ్ర గణాంకాల కొరత విధానాల రూపకల్పనకు ఆటంకం కలిగిస్తోంది. ఈ సమస్యలను పరిష్కరించడానికి మరింతలోతైన దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. చిన్నతరహా కళాకారులకు, హస్తకళాకారులకు సరైన శిక్షణ, ఆర్థికసహాయం, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి. మేధో సంపత్తి హక్కుల పరిరక్షణకు కఠినమైన చట్టాలు రూపొందించాలి. వాటిని సమర్థవంతంగా అమలు చేయాలి. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటును పెంచాలి. డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహించాలి. ఈసవాళ్లను అధి గమించడానికి సమగ్ర జాతీయ విధానం రూపొందించాలి. ప్రత్యేక నిధులు కేటాయించాలి. పెట్టుబడులను ఆకర్షించాలి. కఠినమైన చట్టాల ద్వారా పైరసీని అరికట్టాలి. సృజనకారులకు వారి హక్కులపై అవగాహనకల్పించాలి. సృజనాత్మక కేంద్రాలు ఏర్పాటు చేయాలి.డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలి. ఆన్‌లైన్,ఆఫ్‌లైన్ మార్కెట్ ప్లేస్‌లను ప్రోత్సహించాలి, అంతర్జాతీయ మార్కెట్‌కు అనుసంధానం చేయాలి. సమగ్రడేటా సేకరణవ్యవస్థ ఏర్పాటుచేయడం చాలాముఖ్యం. పరిశోధన అభివృద్ధికి ప్రోత్సాహకాలు అందించాలి. విద్యా వ్యవస్థలో సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు ప్రవేశపెట్టాలి. ప్రభుత్వ,ప్రైవేట్‌రంగాల మధ్య బలమైన భాగ స్వామ్యం ఏర్పడాలి.భవిష్యత్తులో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ మరింత కీలకంకానుంది.డిజిటలైజేషన్, కృత్రిమమేధస్సు వంటిసాంకేతికతలు సృజనాత్మక ప్రక్రియలనుమారుస్తాయి.భారత దేశం తన సాంస్కృతిక శక్తిని,యువత ప్రతిభను ఉపయో గించి ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు. ఇది సామాజిక సమ్మిళితత్వానికి,ప్రాంతీయాభివృద్ధికి తోడ్పడుతుంది. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈరంగం కీలకపాత్ర పోషిస్తుంది. సరైన విధానాలు, ప్రోత్సాహంతో భారతదేశం సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలో ప్రపంచనాయకత్వంవహించే అవకాశం ఉంది. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# కెనడా ఎన్నికల్లో లిబరల్స్‌కే విజయం

**టొరంటో, ఏప్రిల్ 29:** కెనడాలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో అధికార లిబరల్ పార్టీ విజయం దిశగా దూసుకెళ్లింది. వరుసగా నాలుగోసారి అధికారం చేపట్టడం దాదాపు ఖాయమైనట్లే కన్పిస్తోంది. దీంతో నూతన ప్రధానిగా మార్క్ కార్నీ మరోసారి బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల ప్రకారం లిబరల్ పార్టీ 145 స్థానాల్లో గెలుపొందగా మరో 20 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఇక, కన్జర్వేటివ్ పార్టీ 134 స్థానాలు దక్కించుకుని మరో 13 చోట్ల ముందంజలో కొనసాగుతోంది. ఫ్రాంకోయిస్ ఫిలిప్ బ్లాంచెట్ నేతృత్వంలోని బ్లాక్ క్యూబెకాయిస్ పార్టీ 22 సీట్లలో గెలిచి, మరో స్థానంలో ఆధిక్యంలో ఉంది. ఖలిస్థానీ అనుకూలుడైన జగ్మీత్‌సింగ్ ఈ ఎన్నికల్లో పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. ఆయన నేతృత్వంలోని న్యూ డెమోక్రటిక్ పార్టీ నాలుగు స్థానాలు గెలిచి మరో 3 చోట్ల ఆధిక్యంలో ఉంది. దీంతో ఆయన పార్టీ

### మళ్లీ పిఎంగా మార్క్ కార్నీ

అధ్యక్ష పదవి నుంచి దిగిపోయారు. కెనడా పార్లమెంట్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో మొత్తం 343 స్థానాలున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 172 మంది సభ్యుల అవసరం. అయితే, లిబరల్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోయినప్పటికీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. దీంతో మిత్రపక్షాలతో కలిసి మార్క్ కార్నీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే కన్జర్వేటివ్ పార్టీ నేత పియరీ పొయిలీవ్రా ఓటమిని అంగీకరించారు. అమెరికాతో సుంకాల యుద్ధం, కెనడా యుఎస్‌లో 51వ రాష్ట్రంగా చేరాలంటూ ట్రంప్ బెదిరింపుల వేళ ఈ ఎన్నికలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అటు భారత్‌తోనూ కెనడాకు దౌత్య విభేదాలు కొనసాగుతున్నాయి.దీంతో కొత్తప్రభుత్వం ఏర్పాటుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ యేడాది జనవరిలో జస్టిన్ ట్రూడో ప్రధాని పదవికి రాజీనామా చేయడంతో లిబరల్ పార్టీ సభ్యులు తదుపరి ప్రధానిగా మార్క్ కార్నీని ఎన్నుకున్నారు. ప్రధాని బాధ్యతలు చేపట్టిన కార్నీ ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. కెనడా కాలమానం ప్రకారం ఏప్రిల్ 28న పోలింగ్ జరగగా, ఆ వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టారు. ప్రస్తుతం ఫలితాలు వెలువడుతున్నాయి.




# సమితిలో మరోసారి పాక్‌ను ఏకిపారేసిన భారత్



**న్యూయార్క్, ఏప్రిల్ 29:** అంతర్జాతీయ వేదికపై పాకిస్తాన్‌కు భారత్ గట్టి షాక్ ఇచ్చింది. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత్‌లో హింసకు పాల్పడుతున్న పాకిస్తాన్‌పై ఐక్యరాజ్యసమితిలో విరుచుకుపడింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నామని పాకిస్తాన్ మంత్రి బహిరంగంగా చెప్పారని ఎద్దేవా చేసింది. న్యూయార్క్‌లో ఉగ్రవాద అనుబంధ నెట్‌వర్క్ బాధితుల కార్యక్రమంలో ఐక్యరాజ్యసమితికి భారత డిప్యూటీ శాశ్వత ప్రతినిధి ఉన్న యోజన పటేల్ పాల్గొన్నారు. పహల్గాం దాడి ఘటనను ఆమె ప్రస్తావిస్తూ పాకిస్తాన్‌పై మండిపడ్డారు. 2008లో జరిగిన 26/11 ముంబయి దాడుల తర్వాత పహల్గాం ఉగ్రవాద దాడి అత్యధిక సంఖ్యలో ప్రాణ నష్టం జరిగింది. ఈ సీమాంతర ఉగ్రవాదానికి కొన్ని దశాబ్దాలుగా మేం బాధితులుగా ఉన్నాం. ఉగ్ర చర్యలతో బాధితులపై, సమాజంపై ఎలాంటి ప్రభావం ఉంటుందో మాకు తెలుసు. ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నామని, ఉగ్ర సంస్థలకు నిధులు సమకూరుస్తున్నామని ఇటీవల పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్వయంగా చెప్పిన మాటలను ప్రపంచం మొత్తం విన్నది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నామని వారు బహిరంగంగా పాకిస్తాన్ అంగీకరించింది, ఎవరూ ఆశ్చర్యపోలేదు. పాకిస్తాన్ ఎలాంటి మోసపూరిత దేశమో మరోసారి స్పష్టమైంది. ఆ దేశం అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోంది. ఇకపై ప్రపంచం కళ్లు మూసుకుని కూర్చోదు. భారత్‌పై నిరాధార నిందలు వేయడానికి అంతర్జాతీయ వేదికలను పాక్ తరచూ దుర్వినియోగం చేస్తోంది. పహల్గాం ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించారు. ఉగ్రవాదాన్ని అంతర్జాతీయ సమాజం ఎన్నటికీ సహించబోదని ఆమె యోజన పటేల్ హెచ్చరించారు. మరోవైపు భారత్ పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించడం కోసం శాంతియుతంగా మాట్లాడుకోవాలని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ అన్నారు. అందుకోసం ఎలాంటి మద్దతు ఇవ్వడానికైనా యుఎన్ సిద్ధంగా ఉందని సోమవారం గుటెరస్ ప్రతినిధి కార్యాలయం తెలిపింది. భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న పరిస్థితి తులపై తీవ్ర ఆందోళన చెందుతున్నాం. రెండు ప్రభుత్వాలు సంయమనం పాటించి, ఉద్రిక్తతలను నివారించాలి. ఎలాంటి సమస్యనైనా నిర్మాణాత్మక చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవచ్చని నేను నమ్ముతున్నా. ఇరు వైపులా ఉద్రిక్తత తగ్గించుకుని చర్చలను తిరిగి ప్రారంభించడానికి దోహదపడే చర్యలకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం అని గుటెరస్ తెలిపారు.

# పాక్‌కు వైమానిక దాడుల భయం.. రాడార్ వ్యవస్థల తరలింపు



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 29:** పహల్గాం ఉగ్రదాడితో భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. అలాగే తమపై భారత్ వైమానిక దాడులు చేయొచ్చని భయపడుతోన్న పాకిస్థాన్ ఆ దిశగా చర్యలు చేపడుతోంది. దాంతో నియంత్రణ రేఖ వెంబడి పాక్ బలగాలు అప్రమత్తమవుతున్నాయి. భారత్ వైమానిక దాడులను పసిగట్టడానికి సియాల్‌కోట్ ప్రాంతానికి పాకిస్థాన్ సైన్యం తన రాడార్ వ్యవస్థలను తరలిస్తున్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ సరిహద్దుకు 58 కి.మీ. దూరంలో ఉన్న ఖోర్ కంటోన్‌మెంట్ వద్ద టిపిఎస్-77 రాడార్ సైట్‌ను ఏర్పాటు చేసింది. టిపిఎస్-77 మల్టీ-రోల్ (ఎంఆర్ఆర్) అనేది అత్యంత సామర్థ్యం గల రాడార్ వ్యవస్థ. ప్రపంచ వ్యాప్తంగా పరిస్థితులను గమనించేందుకు,ఎయిర్ ట్రాఫిక్ పర్యవేక్షణ కోసం ఉపయోగిస్తారు. గత వారం భారత్ రఫేల్ సహా ఫ్రంట్‌లైన్ ఫైటర్‌జెట్లు పెద్దఎత్తున సైనిక విన్యాసంలో పాల్గొన్నాయి. మరోవైపు మన నౌకాదళం ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంది. పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి విదితమే. దీనికి భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తు న్నాయి. దీంతో గుబులుగా ఉన్న ఆ దేశం పిఒకెలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ఖాళీ చేయిస్తున్నట్లు తెలు స్తోంది. ఉగ్రవాదులను ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలిం చడం ప్రారంభించింది. ఈ మేరకు నిఘావర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది. పహల్గాం ఘటన నేపథ్యంలో భారత్ ప్రతీకర దాడి చేపడుతుందని, త్వరలోనే ఇది జరిగేఅవకాశం ఉందని పాకిస్థాన్ రక్షణశాఖ మంత్రి ఖవాజా మహమ్మద్ ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. 'ఇప్పుడు అది (ప్రతీకారదాడి) జరగనున్న విషయం కాబట్టి మా బలగాలను అప్రమత్తం చేశారు. దాడులు జరిగే పరిస్థితుల్లో కొన్ని వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆ మేరకు చర్యలు తీసుకున్నాం' అని మంత్రి ఖవాజా ఆసిఫ్ ఓ వార్తసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. అయితే, తన అంచనాలకు దారితీసిన వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు.

# అయోధ్యలో 42 అడుగుల ఎత్తయిన ధ్వజస్తంభం

**అయోధ్య, ఏప్రిల్ 29:** అక్షయ తృతీయ 2025 నేపథ్యంలో అయోధ్య రామమందిరంపై జెండా పోల్ ను ప్రతిష్టించారు. ఆలయ శిఖరంపైన జెండా స్తంభాన్ని సాంప్రదాయల ప్రకారం కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వెల్లడించారు. 42 అడుగుల పొడవైన ఈ స్తంభాన్ని హిందూ క్యాలెండర్ ప్రకారం వైశాఖ శుక్ల ద్వితీయ ముహూర్తంలో ఉదయం 8గంటలకు పెట్టినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ఉదయం 6.30 గంటలకు ప్రారంభం కాగా, ఉదయం 8 గంటలకు పూర్తైనట్లు వివరించారు. దీనికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు.

**త్వరలోనే మండపాల నిర్మాణం పూర్తి:** మరోవైపు అయోధ్య రామమందిర నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ఏడు మండపాల నిర్మాణం పూర్తి కానున్నట్లు చంపత్ రాయ్ చెప్పారు. రామ్ దర్బార్‌లోని విగ్రహాలు మే నెలలో వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈశాన్య ప్రాంతంలో శివాలయం, నైరుతి మూలలో సూర్య దేవాలయం నిర్మిస్తున్నట్లు వివరించారు. 2025 అక్టోబర్ నాటికి అన్ని పనులు పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. కాగా, ఇప్పటికే అయోధ్య రామాలయ మొదటి అంతస్తులో సీత, లక్ష్మణ, హనుమాన్, భరత, శతృఘ్న సమేతుడైన శ్రీరాముని పాలరాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయోధ్య అయోధ్య రామాలయంపై ధ్వజస్తంభం అయోధ్యలో రామయ్య దర్శనానికి వచ్చే భక్తుల రాకపోకలను మరింత సులభతరం చేసేలా 80 మీటర్ల పొడవున్న ఓ సొరంగాన్ని సిద్ధం చేశారు అధికారులు. ప్రదక్షిణ చేసుకునే భక్తులు, ఆలయానికి వచ్చే వారి మధ్య రద్దీ తలెత్తకుండా ఆలయానికి తూర్పు భాగంలో నేల మట్టానికి దాదాపు 15 అడుగుల దిగువన 80 మీటర్ల పొడవైన సొరంగాన్ని నిర్మించినట్లు చెప్పారు. ఈ సొరంగం గుండా ఒకేసారి 1.5 లక్షల మంది భక్తులు ఆలయ ప్రదక్షిణ చేయడానికి వీలు కలుగుతుందని చెబుతున్నారు. దేశంలో ఆలయ ప్రదక్షిణ కోసం నిర్మించిన అతి పెద్ద సొరంగం ఇదేనని అంటున్నారు. ప్రదక్షిణ కోసం 800 మీటర్ల పొడవైన గోడను నిర్మించే ప్రాజెక్టులోనే సొరంగం ఓ భాగమని వివరించారు. అక్టోబరు నాటికి సొరంగం పనులు కూడా 100 శాతం పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



# అత్యాచార నిందితుడికి జైలులోనే అదే యువతితో పెళ్లి

**గంజాం, ఏప్రిల్ 29:** వరుడు సూర్యకాంత్ బెహెరా ఒక విచారణ ఖైదీ. అతడు రేప్ కేసులో నిందితుడు. వధువు మరెవరో కాదు. ఈ విచారణ ఖైదీపై అత్యాచార ఆరోపణలు చేసిన బాధిత మహిళ. ఈ ఇద్దరూ ఒడిశాలోని గంజాం జిల్లా కొడాలా సబ్ జైలు ప్రాంగణంలో ఉన్న హనుమాన్ ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. హిందూ సంప్రదాయాలు, ఆచారాల ప్రకారం ఈ పెళ్లిఘట్టం జరిగింది. అదనపు జిల్లా జడ్జి నుంచి జైళ్లశాఖ డీజీకి ఆదేశాలు అందిన తర్వాతే ఈ వివాహాన్ని జైలు అధికారులు చేయించారు. పెళ్లి జరిగాక వరుడు జైలులోని తన సెల్‌లోకి తిరిగొచ్చాడు. వధువు తన అత్తవారింటికి వెళ్లి కొత్త జీవితాన్ని ప్రారంభించింది. కోర్టులో ఇంకా పెండింగ్ దశలోనే ఉన్న ఈ కేసుఆసక్తికరంగా మారింది. సూర్యకాంత్ బెహెరా ఒడిశాలోని పోలసర పోలీస్ స్టేషన్ పరిధిలోని గోచాబాది గ్రామస్తుడు. అతడు 2024 నవంబరు నుంచి కొడాలా సబ్ జైలులో విచారణ ఖైదీగా ఉంటున్నాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి తనపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ 22 ఏళ్ల యువతి సూర్యకాంత్‌పై ఆరోపణలు చేసింది. దీనిపై ఆమె పొలసర పోలీసులకు ఫిర్యాదు ఇచ్చింది. దీంతో పోలీసులు సూర్యకాంత్‌పై కేసు నమోదు చేసి, 2024 నవంబర్‌లో అరెస్టు చేశారు. సామరస్యంగా వివాదాన్ని పరిష్కరించుకునేందుకు అప్పటి నుంచి నిందితుడు, ఫిర్యాదు చేసిన యువతి కుటుంబాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. కొన్ని



నెలల తర్వాత ఈ చర్చలు ఫలించి, వారు ఒక ఒప్పందానికి వచ్చారు. నిందితుడు సూర్యకాంత్, బాధిత యువతి పెళ్లికి అంగీకరించారని కోర్టులో పిటిషన్ వేశారు. దీనికి కోర్టు అనుమతి ఇవ్వడంతో కొడాలా సబ్ జైలులో ఇద్దరికి పెళ్లి జరిపించారు. ఈ కేసులో కోర్టు తుది తీర్పును వెలువరించే వరకు నిందితుడు సూర్యకాంత్ జైలులోనే ఉంటాడు. ఈ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకున్న తర్వాత నిందితుడు, బాధితురాలి కుటుంబాలు కోర్టుకు తమ వాంగ్మూలాలను సమర్పించాయి. ఇటువంటి తీవ్రమైన సమస్యలకు కూడా ఒక పరిష్కారాన్ని కనుగొనొచ్చని ఈ కేసు నిరూపించిందని సీనియర్ న్యాయవాది ప్రఫుల్ల కుమార్ మిశ్రా అన్నారు. ఈ వివాహంపై కొడాలా సబ్ జైలు జైలర్ తరణిసేన్ దేహురీ కీలక వ్యాఖ్యలు చేశారు. అత్యాచార కేసు నిందితుడు సూర్యకాంత్‌కు, ఈ కేసులోని బాధితురాలితో పెళ్లి జరిగింది. ఇద్దరూ ఇష్టపూర్వకంగానే వివాహం చేసుకున్నారు. అత్యాచార కేసుల్లో ఈ విధంగా వివాహాల ద్వారా నేరాన్ని తప్పించుకునే యత్నం చేయడం సరికాదు అనేది నా అభిప్రాయం అని వ్యాఖ్యానించారు.

# ప్రధాని మోడీ, కేజ్రీవాల్‌లు మాపార్టీకి క్షమాపణలు చెప్పాలి

### కాంగ్రెస్ ప్రతినిధి జైరామ్ రమేష్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:**కామన్వెల్త్ క్రీడల గురించి తమ పార్టీపై తప్పుడు ఆరోపణలు చేసినందుకు ప్రధాన మంత్రి మోదీ, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. 2010 కామన్వెల్త్ క్రీడలకు సంబంధించిన కేసులో ఈడీ ముగింపు నివేదికను ఢిల్లీకోర్టు అంగీకరించింది. దీనిపై స్పందిస్తూ కాంగ్రెస్ సీనియర్‌నేత జైరాం రమేశ్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 2014కు ముందు ఆమ్ ఆద్మీపార్టీ, బీజేపీకలిసి 2జి, కామన్వెల్త్ గేమ్స్ వంటి కుంభకోణాలను సృష్టించి తమ పార్టీని అప్రతిష్టపాలు చేశాయని ఎక్స్‌వేదికగా జైరాం రమేశ్ అన్నారు. నిజాయితీపరులు,అంకితభావం కలిగిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్‌పై తప్పుడు ఆరోపణలుచేశారని జైరాంరమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 2జి కేసుకు సంబంధించిన నిజం ఇప్పటికే కోర్టులో బయటపడిందన్నారు. సోమవారం కామన్‌వెల్త్ క్రీడల కేసులో ఈడీ క్లోజర్ నివేదికను కోర్టు అంగీకరించిందని జైరాం రమేష్ పేర్కొన్నారు. కాబట్టి మోదీ, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ కాంగ్రెస్‌కు, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈడీ క్లోజర్ రిపోర్ట్‌పై స్పందిస్తూ 2జి, కామన్వెల్త్ గేమ్స్ వంటి కేసులు రాజకీయ వేధింపులని బీజేపీపై కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా అన్నారు. వారి స్వంత వైఫల్యాల నుంచి దృష్టిని మళ్లించడానికి ఇలాంటి విమర్శలు చేశారని పేర్కొన్నారు. కోర్టు నిర్ణయం కేవలం చట్టపరమైన విజయం మాత్రమే కాదని, అసత్యాలను ప్రచారంచేసే రాజకీయ నేరారోపణ అని అన్నారు. సీబీఐ, ఈడీ రెండు క్లోజర్‌రిపోర్ట్ ఇచ్చాయి. తమవిచారణల్లో ఆరోణలను నిరూపించలేక పోయాయి. ఇప్పుడు ప్రధానమంత్రి మోదీ,అరవింద్ కేజ్రీవాల్ దేశ ప్రజలకు క్షమాపణలు చెబుతారా అని పవన్ ఖేరా స్పందించారు.

# జిప్‌లైన్ రైడర్ సెల్ఫీవిడియోతో మరింత కీలక సమాచారం

### పహల్‌గాం దాడిపై ఎన్ఐఏ అధికారుల విస్తృత సోదాలు

**శ్రీనగర్, ఏప్రిల్ 29:** పహల్‌గామ్ ఉగ్రదాడికి సంబంధించి ఓ కొత్త వీడియో వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఆ వీడియో పలు అనుమానాలకు తావిస్తోంది. అహ్మదాబాద్‌కు చెందిన ఓ పర్యాటకుడు జిప్‌లైన్‌పై రైడ్ చేస్తూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. అందులో ఉగ్రదాడికి సంబంధించిన దృశ్యాలు రికార్డయ్యాయి. జిప్‌లైన్‌పై ప్రయాణిస్తూ అతడు కేరింతలు కొడుతుండగా కింద ఉన్న పర్యాటకులు కేకలు వేస్తూ పరుగులు తీస్తున్న దృశ్యాలు అందులో నిక్షిప్తమయ్యాయి. అంతేకాదు తుపాకీ శబ్దాలు కూడా వినిపించాయి. ఈ రైడ్‌కు ముందు జిప్‌లైన్ ఆపరేటర్ వ్యవహార శైలిపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 'అల్లాహూ అక్బర్' అంటూ మూడు సార్లు జిప్‌లైన్ ఆపరేటర్ అనడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనేపథ్యంలో అతడిని విచారించేందుకు ఎన్ఐఏ సమన్లు జారిచేసినట్లు తెలుస్తోంది. మరోవైపు పెహల్‌గామ్ ఉగ్రదాడికి పాల్పడిన ముష్కరుల కోసం కశ్మీర్ లోయలో వేట కొనసాగుతోంది. గత వారం రోజులుగా కశ్మీర్ లోయను సైన్యం జల్లెడపడుతోంది. ఈ క్రమంలో ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి.

ఉగ్రవాదులు చైనా మెసేజింగ్ యాప్ లను వాడినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. ఈ యాప్‌ల సాయంతోనే ఉగ్రవాదులు భారత సరిహద్దుకు ఆవల ఉన్నవారితో సమాచారాన్ని పంచుకున్నాయని, ఆదేశాలు అందుకున్నాయని వివరించాయి.ఈ యాప్‌లను 2020లో గల్వాన్ ఘర్షణ అనంతరం భారత్ నిషేధించిందని పేర్కొన్నాయి.



# గాడాంధకారంలో ఐరోపాదేశాలు

**మాడ్రిడ్, ఏప్రిల్ 28 :** ఐరోపా దేశాలైన స్పెయిన్, పోర్చుగల్, ఫ్రాన్స్‌లలో అంధకారం అలుముకుంది. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. ప్రజా రవాణా స్తంభించి భారీ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడ్డాయి. విమానాల రాకపోకలకు తీవ్ర జాప్యం ఏర్పడింది. రైలు సర్వీసులు సైతం నిలిచిపోయాయి.ఆసుపత్రుల్లో సర్జరీలు ఆగిపోయాయి. మెట్రో రైళ్లలో ప్రయాణికులు చిక్కుబడిపోగా, నిలిచిపోయిన లిఫ్టులలోనుంచి బయటపడలేక చాలామంది అందులోనే ఉండిపోయారు. పవర్ గ్రిడ్‌ను పునరుద్ధరించేందుకు విద్యుత్తు పంపిణీ సంస్థలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో స్పానిష్, పోర్చుగీస్ ప్రభుత్వాలు అత్యవసర క్యాబినెట్ సమావేశాలు నిర్వహించాయి. స్పెయిన్‌కు ఈశాన్య సరిహద్దుల్లో ఉన్న ఫ్రాన్స్‌లోని కొంత భాగం కూడా తాత్కాలికంగా విద్యుత్తు సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఫ్రాన్స్‌లో కొంతభాగంతోపాటు పోర్చుగల్ వ్యాప్తంగా విద్యుత్తు సరఫరా స్తంభించినట్లు ఆ దేశ విద్యుత్తు సరఫరా సంస్థ ఆర్ఈఎన్ ధ్రువీకరించింది. ఐరోపాలో గంటలపాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం వెనుక సైబర్‌దాడి ఉండే అవకాశం లేకపోలేదని స్పెయిన్, పోర్చుగల్‌లోని పవర్ గ్రిడ్ ఆపరేటర్లు వెల్లడించాయి. స్పెయిన్, పోర్చుగల్‌లోని ప్రధాన నగరాలను కలిపే యూరప్‌లోని పవర్ గ్రిడ్‌పై సైబర్ దాడి జరిగి ఉండవచ్చని స్పానిష్ అధికారులు చెప్పారు. అయితే దీన్ని నిర్ధారించడానికి తమ వద్ద ఆధారాలు లేవని వారు తెలిపారు. ఈ తీవ్ర విద్యుత్తు సమస్యకు కారణాలు ఏమిటో ఎవరికీ అంతుబట్టడం లేదని, సైబర్ దాడి జరిగి ఉండవచ్చన్న వాదనను కూడా తోసిపారేయలేమని వారు చెప్పారు. విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ కోసం విద్యుత్తు కంపెనీలతో పని చేస్తున్నట్లు స్పానిష్ గ్రిడ్ ఆపరేటర్ రెడ్ ఎలెక్ట్రికా ప్రకటించింది. మాడ్రిడ్ అండర్‌గ్రౌండ్ వ్యవస్థను ఖాళీ చేయిస్తున్నట్లు స్పానిష్ రేడియో స్టేషన్లు తెలిపాయి. ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో మాడ్రిడ్ సిటీ సెంటర్ వద్ద భారీగాట్రాఫిక్ జామ్ అయినట్లు కేడర్ సెర్ రేడియో స్టేషన్ తెలిపింది. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడానికి కారణాలు ఏమిటో అధికారులు వివరించలేకపోతున్నారు. సైబర్ దాడి జరిగే అవకాశాన్ని కూడా వారు తోసివేయడం లేదు. మాడ్రిడ్ వీధులలో వందలాది మంది ఉద్యోగులు తమ ఆఫీసు భవనాల బయట నిలబడ్డారు. ముఖ్యమైన భవనాల వద్ద భారీగా పోలీసులను మోహరించారు. మాడ్రిడ్‌లోని నాలుగు ఆకాశ హర్మ్యాలలో ఒకదాన్ని ఖాళీ చేయించినట్లు సాక్షులు తెలిపారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ఎక్కడికక్కడ ఆగిపోయిన మెట్రో కార్లు, ఎలివేటర్లలో వందలాది మంది ప్రజలు చిక్కుకుపోయినట్లు స్థానిక రేడియో తెలిపింది. దేశవ్యాప్తంగా ట్రాఫిక్ లైట్లు నిలిచిపోయినట్లు పోర్చుగీస్ పోలీసులు తెలిపారు. లిస్బన్, పోర్టోలో మెట్రోను మూసివేసినట్లు వారు చెప్పారు. రైళ్లు కూడా నిలిచిపోయినట్లు తెలిపారు. రైళ్లలోనే ప్రయాణికులు చిక్కుకుపోవడంతో సబ్‌వే స్తంభించిపోయినట్లు లిస్బన్‌కు చెందిన సబ్‌వే ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్ మెట్రోపాలిటనో డేలిబ్బోవా తెలిపింది. బ్యాకప్ జనరేటర్లతో లిస్బన్ విమానాశ్రయం పనిచేస్తున్నదని పోర్చుగల్ టాప్ ఎయిర్ వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా విమానాల రాకపోకలలో తీవ్ర జాప్యం ఏర్పడినట్లు స్పెయిన్‌లో 46 విమానాశ్రయాలను నిర్వహిస్తున్న ఏఈఎన్ఏ వెల్లడించింది. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ఇంటర్‌నెట్, టెలిఫోన్ సర్వీసులకు కూడా అంతరాయం ఏర్పడింది. అత్యవసర సర్వీసులకు ఫిర్యాదు చేసేందుకు సైతం ప్రజలకు ఫోన్, నెట్ సౌకర్యం లేకుండాపోయింది. విద్యుత్తు లేకపోవడంతో అన్ని వ్యవస్థలూ స్తంభించిపోయాయని లిస్బన్‌లో నివసించే ఓ 23 ఏళ్ల అనువాద విద్యార్థిని తెలిపింది. ఏం జరుగుతోందో, ఎందుకు విద్యుత్తు నిలిచిపోయిందో తమకు ఏమీ తెలియడం లేదని ఆమె చెప్పింది. ట్రాఫిక్ లైట్లు పనిచేయకపోవడంతో రోడ్లన్నీ ట్రాఫిక్‌తో బీభత్సంగా ఉన్నాయని, పరిస్థితి భయానకంగా ఉందని ఆమె తెలిపింది. పోర్చుగల్‌లోని దవాఖానల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. విద్యుత్తు లేకపోవడంతో మిసెరికోర్డియా దవాఖానలో ముందు జాగ్రత్తగా ఆపరేషన్లను రద్దు చేశారు. ప్రయాణికుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆపరేషన్లను రద్దు చేసినట్లు పోర్చుగల్‌లోని 24 దవాఖానలను నిర్వహించే యూనియన్ ఆఫ్ పోర్చుగీస్ మిసెరికోర్డియాస్(యూఎంపీ) తెలిపింది. పోర్చుగల్, స్పెయిన్‌లోని అనేక మెట్రో స్టేషన్లను అధికారులు మూసివేశారు. సోల్ మెట్రో స్టేషన్‌తోసహా అనేక చోట్ల ఎలివేటర్లలో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు అత్యవసర సర్వీసుల సిబ్బంది శ్రమిస్తున్నారు.

# క్రోమా షోరూంలో అగ్నిప్రమాదం



**ముంబై:** ముంబైలోని బాంద్రాలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంగళవారం తెల్లవారుజామున బాంద్రా వెస్ట్‌లోని లింక్ స్క్వేర్ షాపింగ్ మాల్ బేస్‌మెంట్‌లో ఉన్న క్రోమా షోరూమ్‌లో మంటలు చెలరేగాయి. క్రమంగా అవి షోరూమ్ మొత్తం వ్యాపించడంతో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. మంటలు క్రమంగా మాల్ మొత్తానికి విస్తరించాయి. దీంతో ఆ ప్రాంతంలో భారీగా పొగలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని 12 ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేసేందుకు రంగంలోకి దిగారు. ఉదయం 4.11 గంటలకు అగ్నిప్రమాదానికి సంబంధించిన సమాచారం అందిందని ముంబై ఫైర్ బ్రిగేడ్ వెల్లడించింది. రెండు గంటల్లోనే మంటలు బిల్డింగ్ మొత్తానికి ప్రమాదకర స్థాయికి వ్యాపించాయన్నారు. జీప్లస్3గా ఉన్న షాపింగ్ మాల్ భవనంలో మొదటి మూడు అంతస్తుల్లో క్రోమా షోరూమ్ ఉన్నదని చెప్పారు. దీంతో మంటలు వేగంగా బిల్డింగ్ మొత్తానికి వ్యాపించాయని తెలిపారు. 12 మోటార్ పంపుల సాయంతో సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితోపాటు పోలీసులు సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారన్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఎవరూ గాయపడలేదని చెపారు.

# రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం: 22 మంది మృతి

**బీజింగ్, ఏప్రిల్ 29:** చైనాలో విషాదం చోటుచేసుకుంది. లియోనింగ్ ప్రావిన్స్‌లోని లియోయాంగ్ నగరంలో మంగళవారం ఒక రెస్టారెంట్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 22 మంది మృతిచెందారు. మధ్యాహ్నం 12.25 గంటలసమయంలో రెస్టారెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో 22 మంది మృత్యువాతపడగా మరో ముగ్గుఉరికి గాయాలైనట్లు అక్కడి మీడియా ప్రకటించింది. ఈ ప్రమాదానికి కారణాలుమాత్రం ఇంకా తెలియరాలేదు. ఈఘటనపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌స్పందించారు. ఈ ఘటనలో క్షతగాత్రులకు చికిత్స అందించాలని ఆయన ఆదేశించారు. ఈనెలలోనే చైనాలో ఈప్రమాదం రెండో అతిపెద్ద అగ్నిప్రమాదం. ఈనెలలోనే 9న నార్త్‌చైనాలోని హెబీ ప్రావిన్స్‌లోని ఓనర్సింగ్‌హోమ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 20 మంది వృద్ధులు మృతిచెందారు. చెంగ్డూ నగరంలోని లాంగ్హువా కౌంటీలోని నర్సింగ్‌హోమ్‌లో మంటలు చెలరేగిన సమయంలో 39 మంది వృద్ధులు భవనంలో ఉండగా 20 మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటన అప్పట్లో విషాదాన్ని రేకెత్తించింది.



# ఎన్‌కౌంటర్‌లో హతమైన ఉగ్రవాదిఫోన్‌లో మూసా ఫొటో

**శ్రీనగర్, ఏప్రిల్ 29:** జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేతలోభాగంగా గతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన ఒక ఉగ్రవాదినుంచి స్వాధీనంచేసుకున్న ఫోన్‌నుంచి పహల్గాం మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మూసా ఫోటో బయటపడింది. బైసరన్‌లోయ ఉగ్రదాడిలో పాల్గొన్న విదేశీ ఉగ్రవాదులు జమ్ముకాశ్మీర్‌లోకి చాలాకాలం క్రితమే ప్రవేశించినట్లు దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి. సుమారు ఏడాదిన్నర క్రితమే ఒక ఉగ్రబృందం సాంబా కథువాలమధ్య సరి హద్దు కంచెను కత్తిరించింది. ఈ బృందంలో పహల్గాం దాడిలో పాల్గొన్న అలిభాయ్ అలియాస్ తాలా, హాసీమ్ ముసా అలియాస్ సులేమానీలు ఉన్నట్లు తేలింది. అప్పటి నుంచి వీరు పలుదాడుల్లో పాల్గొన్నారు. దీనితోనే చొరబాట్ల అంశం దర్యాప్తులో కీలకం అయింది. బిఎస్ఎఫ్ సీనియర్ అధికారిపై హోంశాఖ ఇందుకు సంబంధించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఆర్మీ, రాష్ట్రీయ రైఫిల్స్ బృందాలు అనంత్‌నాగ్‌లోని పర్వతశ్రేణుల్లో గాలింపును ముమ్మరంచేసాయి. సాంకేతిక ఆధారాలు, స్థానిక జాతుల సహకారంతో ఈవేట సాగుతోందని అధికారులు వెల్లడించారు.



### పహల్గాం ఉగ్రదాడి మృతులకుటుంబాలకు

# రూ.50 లక్షల పరిహారం

**ముంబయి, ఏప్రిల్ 29:** మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన ఆ రాష్ట్రపౌరులకు ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. ఆరుగురు మృతులకుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మంగళవారం వెల్లడించారు. దీంతోపాటు వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వనున్నట్లు వివరించారు.మంగళవారం మహారాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వీటికికూడా కేబినెట్ ఆమోదం.హడాస్‌పూర్ నుంచి యావత్‌మల్ మధ్య రాష్ట్ర రహదారిని ఆరువరుసలుగా విస్తరించేందుకు ఆమోదం తెలిపింది. షిప్ యార్డ్, షిప్ రీసైక్లింగ్ అభివృద్ధి పనులకు ఓకే చెప్పింది.

# సిఎం చంద్రబాబు నేతృత్వంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి: మంత్రి సవిత

**విజయవాడ.ఏప్రిల్29.ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్రమోడి పర్యటనను విజయవంతం చేద్దామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో కూటమి నాయకులతో మంగళవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు వసంత కృష్ణ ప్రసాద్, అయితాబత్తుల ఆనందరావులతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, మే రెండో తేదీన లక్ష కోట్ల రూపాయలతో చేపట్టనున్న అమరావతి రాజధాని పనులకు ప్రధాన మంత్రి నరేంద్రమోడి చేతుల మీదుగా శ్రీకారం చుడుతున్నామన్నారు. రాష్ట్రానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్రమోడికి ఘన స్వాగత పలుకుదామని మంత్రి సవిత పిలుపునిచ్చారు. మైలవరం నియోజక వర్గంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ప్రధాని పర్యటనను విజయం చేయాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏపీలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఏపీ అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోడి అండదండలు అందిస్తున్నారన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవం అమరావతి రాజధాని అని అన్నారు. రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారమందిస్తోందన్నారు. 2014 రాష్ట్ర విభజన తరవాత ఏపీ రాజధాని లేకుండా అయిపోయిందన్నారు. అమరావతి ప్రాంత రైతులు ల్యాండ్ పూలింగ్ ద్వారా 34 వేల ఎకరాలు రాజధాని కోసం ఇచ్చారని, వారి త్యాగం మరువలేనిదని ధన్యవాదాలు తెలిపారు. ఆనాడు అమరావతి నిర్మాణానికి అసెంబ్లీ సాక్షిగా అంగీకరించిన జగన్... తరవాత పనులను అడ్డుకున్నారన్నారు. జగన్ అయిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించాడన్నారు. ఆయన అసమర్థ పాలనతో విసిగివేసిన ప్రజలు...సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి జై కొట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడి సహకారంతో రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఏపీపై ప్రధాని నరేంద్రమోడి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఆయన సహకారంతో అమరావతి రాజధాని పనులను సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. ఈ నెల రెండో తేదీన అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభానికి పీఎం నరేంద్రమోడి రాష్ట్రానికి వస్తున్నారన్నారు. ఆయనకు కూటమి నాయకులు ఘన స్వాగతం పలకాలన్నారు. ఇందుకోసం మైలవరం నియోజక వర్గం నుంచి అధిక సంఖ్యలో కూటమి నాయకులు, ప్రజలు తరలిరావాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోడి రాక ఆంధ్రప్రదేశ్ ప్రజలకు పండగలాంటిదని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు.



ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతగానో సహకరిస్తోందన్నారు. పోలవరం, రాజధాని అమరావతి, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు, విశాఖ పరిశ్రమకు ఆర్థిక సాయం, రైల్వే జోన్ ఇలా ఎన్నో అభివృద్ధి పనులకు పీఎం నరేంద్రమోడి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. అమరావతి అభివృద్ధి చెందితే, మైలవరం నియోజక వర్గానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఏపీకి ఎంతో మేలు చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీకి మైలవరం పెట్టనికోటన్నారు. నియోజక వర్గం నుంచి మోడి పర్యటనకు 25 వేల మంది తరలిరావడం ఖాయమని ఎంపీ తెలిపారు. రాజధాని అభివృద్ధితోనే మైలవరం కూడా ప్రగతిపథం దూసుకుపోతుందని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తెలిపారు.

# పాక్‌కు అనుకూలరీతిలో మాట్లాడితే అక్కడికే వెళ్ళిపోండి : పవన్‌కళ్యాణ్

**విజయవాడ,ఏప్రిల్ 29,ప్రభాతవార్త ప్రతినిధి:** మత ప్రాతిపదికన 26 మందిని చంపిన పాకిస్థాన్‌కు అనుకూలరీతిలో మాట్లాడటం సరికాదని,అలా మాట్లాడాలనుకుంటే ఆ దేశానికే వెళ్ళిపోవాలని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. మత ప్రాతిపదికన చంపడం సరికాదన్నారు. ఇటీవల జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి మంగళగిరి సికె కన్వెన్షన్ హాలులో నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదం,హింపై అందరూ ఒకేలా స్పందించాలన్నారు. కాశ్మీర్,భారత్‌లో భాగమని, ఇలాంటి విషయాలపై ఓట్లు,సీట్లు కోసం మాట్లాడకూడదని చెప్పారు.కశ్మీర్ భారత్‌లో భాగమని, ఇలాంటి విషయాలపై ఓట్లు, సీట్ల కోసం మాట్లాడకూడదని చెప్పారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదన్‌రావు కుటుంబానికి పార్టీ తరఫున రూ.50 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఉగ్రఘటనలో జనసేన ఓ కార్యకర్తను కోల్పోయిందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. సత్యం మాట్లాడాలంటే చాలా ధైర్యం కావాలని చెప్పారు. చనిపోయిన మధుసూదన్‌రావు ఎవరికి హాని చేశారని కుటుంబాన్ని తీసుకొని కశ్మీర్‌కు వెళ్తే చంపేశారని పవన్ అన్నారు. కశ్మీర్ మనది కాబట్టే అక్కడికి వెళ్లామని అలానే ఉగ్రవాదులు గుర్తింపుకార్డు అడిగి కాల్చి చంపారు మధు భార్య చెప్పారని పవన్ తెలిపారు. హిందువులకు ఉన్న దేశం ఇదొక్కటేనని పవన్ తెలిపారు. ఇక్కడ కూడా ఉండొద్దంటే ఎక్కడికి పోవాలని అన్నారు. యుద్ధ పరిస్థితులు వచ్చినా సిద్ధంగా ఉండాలని మత కలహాలు సృష్టించే వారిపై అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలని పవన్ కల్యాణ్ అన్నారు. కశ్మీర్‌లో జరిగితే ఆ ప్రకంపనలు మనకు తగిలాయని సరిహద్దు నియంత్రణ వద్ద విధులు చాలా కష్టమని అన్నారు. ఉగ్రవాదులను ఎలాంటి



పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఉగ్రవాదుల ఏరివేతలో ప్రతి ఒక్కరూ ఎన్డీయేకు మద్దతుగా నిలవాలి. దేశంలో సహనం ఎక్కువైంది అతి సహనం మంచిది కాదు. కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉండాలి. ఇప్పటికైనా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. తప్పు జరిగినప్పుడు తప్పు అని చెప్పాలి. ముస్లింలపై వివక్ష చూపిస్తే ఇంతమంది ఇక్కడ ఎలా ఉంటారు. శరణార్థులు దేశానికి

# తూట్రాళ్లపల్లి వద్ద మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని అడ్డుకున్న పోలీసులు

**అనంతపురం, ఏప్రిల్ 29 (ప్రభాత వార్తా బ్యూరో)** అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి (వైసీపీ ), జేసీ ప్రభాకర్ రెడ్డి (టిడిపి) వర్గాల మధ్య మళ్ళీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. పెద్దవడుగూరు మండలం మండలం కండ్ల గూడూరు లో ఒక వైసీపీ నాయకుడు ఏర్పాటుచేసిన విందుకు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి వెళుతుండగా పోలీస్ అడ్డుకున్నారు. అదే ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి వస్తున్నాడని పోలీసులు చెబుతూ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి అడ్డుకోవడం, డిన్నర్ కి వెళ్ళకుండా వెనక్కి పంపడం వివాదమైంది. పోలీసులతో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి వాగ్వివాదానికి దిగి నిరసన చేయాల్సి వచ్చింది. ఈ సమయంలో అనంతపురం లో ఆర్డిటికీ మద్దతుగా అనంతపురంలో మాజీ ఎమ్మెల్యే, తాడపత్రి మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్ రెడ్డి ఒక కార్యక్రమంలో పాల్గొని పెద్దవడుగూరు మండలానికి వచ్చాడు. జేసీ గూడ తిరుగు ప్రయాణంలో కండ్ల గూడూరు కు రావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి . పెద్దవడుగురు మండలం దిమ్మగుడిలో జెసి వాహనాలు వెళ్లకుండా పోలీసులు కట్టెలు అడ్డంపెట్టినట్లు సమాచారం. తూట్రాళ్ల పల్లె వద్ద నుంచి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని పోలీసులు వెనక్కి పంపడంలో ఆయన చివరకు ఎల్లనూరు మండలం మండలం తిమ్మంపల్లికి వెళ్లినట్లు తెలిసింది.. ఆ తర్వాత పెద్దవడూరు మండలం దిమ్మ గుడి నుంచి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని పెద్దపప్పూరు మండలం మీదుగా తాడపత్రి పట్టణానికి వెళ్లినట్లు సమాచారం. తాడపత్రి నియోజకవర్గంలో గత రెండు వారాలుగా ప్రశాంతంగా ఉన్న వాతావరణం మళ్లీ తీవ్ర రూపం దాల్చింది. దీంతో వైసిపి ,టిడిపి వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మంగళవారం నియోజకవర్గంలోని యాడికి మండలంలో పర్యటించారు. నగరూరు గ్రామంలో వైసీపీ నాయకుడు బ్రహ్మానందరెడ్డి ఇంటిలో కొద్దిసేపు గడిపారు.

అక్కడ నుంచి వైసిపి నాయకుడు ఏర్పాటు చేసే విందుకు ఆ గ్రామస్తులు ఆహ్వానం మేరకు కండ్ల గూడూరు గ్రామానికి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి వెళ్తుండగా దారి మధ్యలో తూట్రాళ్లపల్లి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. కండ్ల గూడూరుకు వెళ్ళవద్దు

అని పోలీస్ అధికారులు హుకుం జారీ చేశారు. దీంతో ఆయన నిరసన వ్యక్తం చేస్తూ అక్కడే ఉన్న వంతెన మీద సుమారు ఎక్కువసేపు వైసిపి కార్యకర్తలతో కలిపి బైఠాయించారు.

# ఆర్డీటీకి అండగా మేమున్నాం..

## - ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌ను కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి



మాంఛో ఫెర్రర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తదితరులు

**అనంతపురం అర్బన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త** ఆర్డీటీ సంస్థకు విదేశీ నిధులు ఆగిపోయిన అంశం నేపథ్యంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌ను కలిశారు. అర్బన్ నియోజకవర్గ టీడీపీ నాయకులతో కలిసి ఆయన ఆర్డీటీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ మాంఛో ఫెర్రర్‌ను కలిసి ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్.సి.ఆర్.ఏ) రెన్యూవల్ కాకపోవడంపై చర్చించారు. గత 3 సంవత్సరాలుగా జరుగుతున్న పరిణామాలన్నింటిని తెలుసుకున్నారు. ఆర్డీటీలో ఇప్పటి వరకు నిధులు లేని కారణంగా ఆగుతున్న సేవా కార్యక్రమాలు గురించి ఆరా తీశారు. ఆర్డీటీ సంస్థ జిల్లాకు ఒక వరం లాంటిందని ఈ విషయంలో సంస్థకు మేము అండగా ఉంటామని మాంచోతో దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇప్పటికే జిల్లా ఎమ్మెల్యేలంతా చర్చించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబుని కలుస్తున్నట్టు వివరించారు. మే 2న ప్రధాని మోదీ రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో ఆయన దృష్టికి ఆర్డీటీ అంశాన్ని తీసుకెళ్తామని దగ్గుపాటి అన్నారు. ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ అయి ఆ సంస్థ నిధులు యధావిధిగా వచ్చే వరకు తాము విశ్రమించమని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు.

ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి సరిపూటి రమణ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మినరసింహా, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, మైనార్టీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి జె.ఎం. బాషా టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజధాని అమరావతి పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలి -బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలని, మే 2న ప్రధాని నరేంద్రమోడి సభను విజయవంతం చేసేందుకు ప్రతి నియోజకవర్గం నుండి వేలాదిగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు, కూటమి కార్యకర్తలు, నేతలు తరలిరావాలని రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మం త్రి సవిత పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని ఎస్ఎల్ఎస్ కళ్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం స్థానిక ఎంఎల్ఏ, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ ఏర్పాటుచేసిన పార్టీ సమావేశానికి మంత్రి సవిత ముఖ్యఅతిధిగా విచ్చేశారు. జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే-మాదిగ కార్పొరేషన్ చైర్మన్, ఉండవల్లి శ్రీదేవి, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అతిధులుగా పాల్గొన్నారు. గత ఐదేండ్లుగా ప్రజలు పడిన కష్టాలను గుర్తుచేసుకుని సిఎం చంద్రబాబునాయుడు కసిగా అమరావతి పునర్నిర్మాణ పనులు చేపడుతున్న సందర్భంలో నియోజకవర్గం నుండి టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు 20 వేల మందికి తగ్గకుండా హాజరుకావాలని విజ్ఞప్తిచేశారు. నేతలు నెట్టెం రఘురామ్, శ్రీరాం రాజగోపాల్, ఉండవల్లి శ్రీదేవి కూడా ప్రసంగిస్తూ ప్రధాని సభను జయప్రదం చేయాలని ఆకాంక్షించారు. ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్‌ను కృష్ణా జిల్లా కేంద్ర సహకార పరపతి బ్యాంక్ చైర్మన్‌గా సిఎం చంద్రబాబునాయుడు నియమించటం పట్ల కూటమి నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తంచేస్తూ మంగళవారం ఆయన నివాసంలో కలుసుకుని ఘనంగా సన్మానించారు. అతి త్వరలో ఆప్కాబ్ చైర్మన్ స్థానాన్ని సిఎం చంద్రబాబు కల్పిస్తారని నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తంచేస్తూ రఘురామ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నాయకులు శ్రీరాం సుబ్బారావు, శ్రీరాం ధనుంజయ, నూకల కుమారరాజ, సాయిప్రసాదు, కట్టా వెంకటనరసింహారావు, ముల్లంగి రామకృష్ణారెడ్డి, ఆచంట సునీత, కన్నెబోయిన రామలక్ష్మి, మేకా వెంకటేశ్వర్లు, వడ్లమూడి రాంబాబు, సీతారమయ్య, పలువురు బిజెపి, జనసేన నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఖాతా టీడీపీ వశం

**బొబ్బిలి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త** నెలరోజులుగా బొబ్బిలి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సొంతగూటి కౌన్సిలర్లే జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎక్స్ అఫీషియో సభ్యులు ఆర్‌వీఎస్‌కే రంగారావుతో పాటు పదిమంది వైసిపి కౌన్సిలర్లు పదిమంది టిడిపి కౌన్సిలర్లు కలిసి ప్రొసైడిరగ్ ఆఫీసర్ ఆర్డీవో రామ్మోహన్ రావు అధ్యక్షతన చేతులెత్తే కార్యక్రమం నిర్వహించారు వీరందరినీ లిఖితపూర్వకంగా సంతకాలు తీసుకొని ఆర్డిఓ అవిశ్వాస తీర్మానం ప్రకటించారు. మాజీ చైర్మన్‌తో కలిసి 9మంది వైసీపీ కౌన్సిలర్లు హాజరై ఆర్డీవో ప్రకటించిన వెంటనే వెనుతిరిగి వెళ్లిపోయారు. నెల రోజులుగా జరుగుతున్న ఉత్కంఠ ముగిసింది. చక్రం తిప్పిన బేబీ నాయన టిడిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నిక ఎప్పుడు జరుగుతుందో గెజిట్ వచ్చిన తర్వాత తెలుస్తుందని ఆర్డిఓ తెలిపారు.

# ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు పూర్తి.

**విజయవాడ,ఏప్రిల్29,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభించేందుకు వచ్చే నెల 2వ తేదీన ప్రధాని మోదీ హాజరయ్యే సభకు భారీగా తరలివచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా వేదిక వద్దకు చేరుకునేలా 11 మార్గాలను సిద్ధం చేశామని మంత్రి నారాయణ తెలిపారు. 11 చోట్ల వాహనాల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రయాణానికి ఇబ్బంది లేకుండా రూట్‌మ్యాప్‌ను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. అలాగే ట్రాఫిక్ జామ్ కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు సీఎం ఆదేశాలిచ్చారని వివరించారు. ప్రధాని మోదీ సభ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు ఆదివారం ఉండవల్లిలోని నివాసంలో అధికారులు, మంత్రుల ఉన్నత స్థాయి కమిటీతో సమీక్షించారు. సమావేశ వివరాలను మంత్రి నారాయణ వివరించారు షెడ్యూల్‌లో స్వల్పమార్పులు: ప్రధాని రాకకు సంబంధించి షెడ్యూల్‌లో స్వల్పమార్పులు చోటు చేసుకున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల ప్రజలూ తరలి రానున్నారని సుమారు 5 లక్షల మంది సభకు హాజరవుతారని తెలిపారు. అందుకు తగ్గట్టు అన్ని ఏర్పాట్లు చేయాలని, సభకు వచ్చే వారెవరికీ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులను సీఎం ఆదేశించారని తెలిపారు. సభ జరిగే రోజు సాయంత్రం వాతావరణంలో స్వల్పంగా మార్పులు ఉండొచ్చనే సమాచారం ఉందని ఒకవేళ జల్లులు పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా సీఎం చంద్రబాబు సూచనలు చేశారని మంత్రి వివరించారు. 2వ తేదీ మధ్యాహ్నం 3:25 గంటలకు సచివాలయం హెలిప్యాడ్ వద్దకు ప్రధాని చేరుకుంటారు.

# తిరుపతిలో భవనం నిర్మాణ కార్మికులు దుర్మరణం

**తిరుపతి,ఏప్రిల్ 29ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతినగరం శివార్లలోని మంగళం తుడ క్వార్టర్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఐదంతస్థుల భవనంపై నండి జారిపడి ముగ్గురు కూలీలు దుర్మరణం చెందారు. మరో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఐదవఅంతస్థులో కర్రకు కట్టిన తాడు తెగిపోవడంతోనే ప్రమాదశాత్తు ఈ విషాదసంఘటన మంగళవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు....తిరుపతి మంగళం క్వార్టర్స్‌లో విశ్రాంత ఉపాధ్యాయుడు ఆండాళయ్య మూడంతస్థుల భవన నిర్మాణం కోసం తుడ అనుమతి పొందాడు. ఈ భవనం నిర్మాణం కోసం ఓ కాంట్రాక్టర్‌తో నిర్మాణ పనులు చేయిస్తున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా ఐదంతస్థుల భవనం నిర్మాణం చేపట్టాడు. ప్రతిరోజులాగే మంగళవారం ఉదయం కూడా నెల్లూరుజిల్లా పెళ్ళకూరు మండలంకు చెందిన భవన కార్మికులు బడితోట శ్రీనివాస్(39), ఒంగోలుకు చెందిన శ్రీకాళహస్తిలో ఉంటున్న కె.శ్రీనివాసులు(37),కె.వసంత్(35)తో బాటు మరో ముగ్గురు కార్మికులు ఐప అంతస్థులో భవనం స్లాబ్ నిర్మిస్తున్నారు. ఈ పనులకోసం కర్రసాయంతో తాడును కట్టుకుని ఉన్నారు. పనులు చేస్తుండగా ఉన్నఫళంగా కర్రజారిపోవడంతో క్రిందపడ్డారు. ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ విషాద సంఘటనకు అక్రమనిర్మాణమే కారణంగా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ గుర్తించారు. దీనికి కారణమైన కార్యదర్శిని సస్పెన్షన్ చేశారు. ఈఓపిఆర్‌డికి నోటీసులు ఇచ్చారు. సమాచారంఅందుకున్న అదనపు ఎస్పీ రవిమనోహరచారి, తిరుచానూరు సిఐ సునీల్‌కుమార్,పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాలను తిరుపతి ఎస్వీ వైద్యకళాశాలకు తరలించారు.

# జత్వానీ కేసులో ఐపీఎస్‌ల పిటిషన్ల విచారణ మే 1కి వాయిదా

## -హైకోర్టులో పీఎస్ఆర్ పిటిషన్

**విజయవాడ,ఏప్రిల్ 29,ప్రభాతవార్త ప్రతినిధి:** సినీనటి కాదంబరి జత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారులు కాంతిరాణా తాతా,విశాల్‌గున్ని,అప్పటి ఏసిపి కె.హనుమంతరావు దర్యాప్తు అధికారి(ఐవో) ఎం.సత్యన్నారాయణ హైకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై విచారణ మే 1వ తేదీకి వాయిదా పడింది. సీఐడి తరపున పీపీ లక్ష్మీనారాయణ సమయం కోరడంతో విచారణను వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.పిటీషనర్ల తరపున సీనియర్ న్యాయవాది శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ ఈ కేసులో నిందితునిగా ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును తాజాగా అరెస్ట్ చేసి రిమాండుకు పంపారన్నారు. పిటీషనర్లవిషయంలో తొందరపాటు చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. తదుపరి విచారణ వరకు స్టే విధించాలన్నారు. హైకోర్టుకు ఇటీవల ఏజీ ఇచ్చిన హామీకి భిన్నంగా సిఐడీ వ్యవహరిస్తోందన్నారు. దీనిని న్యాయమూర్తి స్పందిస్తూ,ఏజీ గతంలో ఇచ్చిన హామీ పిటీషనర్లకు మాత్రమే వర్తిస్తుందన్నారు. హైకోర్టులో తదుపరి విచారణలోపు దర్యాప్తు నిమిత్తం పిటీషనర్లను విచారణకు పిలవబోమని, దర్యాప్తు పూర్తి చేసి అభియోగపత్రం దాఖలు చేయడానికి కొంత సమయంలో పడుతుందని మాత్రమే ఏజీ గతంలో కోర్టుకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని మే 1 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొంటూ విచారణను వాయిదా వేశారు. మరో వైపు తనపై ఇదే కేసును కొట్టేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు హైకోర్టులో పిటీషన్ వేశారు.

# ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధికి సహకరించండి

## -కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్

**విజయవాడ,ఏప్రిల్29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధి వేగంగా జరిగేందుకు పూర్తిగా సహకరించాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులపై టి.జి భరత్ చర్చించారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నోడ్స్ హైదరాబాద్ బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ కింద ఓర్వకల్ నోడ్, చెన్నై బెంగుళూర్ ఇండస్ట్రియల్ కారిడార్ కింద కృష్ణపట్నం నోడ్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ నోడ్‌లకు రైల్ కనెక్టివిటీ కోసం అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కేంద్ర మంత్రితో చర్చించి వినతిపత్రం అందజేశారు ఓర్వకల్ నోడ్ కింద దూపాడు రైల్వే స్టేషన్ నుండి ఓర్వకల్ మీదుగా బేతంచర్ల వరకు కొత్త కార్డ్ రైల్వే లైన్ అభివృద్ధి, ఓర్వకల్ పారిశ్రామిక నోడ్ వరకు రైల్వే సైడింగ్ 53 కిలో మీటర్లు అభివృద్ధి చేయాలని కోరారు. దీంతో పాటు కృష్ణపట్నం రైల్వే స్టేషన్ నుండి ఓబులవారిపల్లె కృష్ణపట్నం సెక్షన్ నుండి కృష్ణపట్నం పారిశ్రామిక నోడ్ వరకు రైల్వే సైడింగ్ 12 కిలోమీటర్లు అభివృద్ధి చేయాలన్నారు. ఓర్వకల్ మరియు కృష్ణపట్నం నోడ్‌లను ఆధునిక మౌలిక సదుపాయాలతో పాటు ఇంటిగ్రేటెడ్ మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులతో స్థిరమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థలుగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇవి అభివృద్ధి చెందితే 4 లక్షలకుపైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయనని చెప్పారు. అంతేకాకుండా విదేశీ పెట్టుబడులతో సహా సుమారు రూ. 55,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.



# వివేకానంద హత్యకేసులో నిందితుల బెయిల్ పిటిషన్‌ను వాయిదా వేసిన సుప్రీం కోర్టు

**విజయవాడ,ఏప్రిల్29,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డికి మంజూరైన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ విచారణ జరిగింది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌కు కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కావాలని అవినాశ్ రెడ్డి తరపు న్యాయవాదులు సర్వోన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ అభ్యర్థనపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాతో కూడిన ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. కౌంటర్ దాఖలుకు సమయం ఇస్తూ, తదుపరి విచారణను జులై చివరి వారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. అయితే, అప్పటికి తన పదవీకాలం ముగియనున్నందున, ఈ కేసు విచారణను వేరొక ధర్మాసనానికి బదిలీ చేసే అవకాశం ఉందని జస్టిస్ ఖన్నా సూచనప్రాయంగా తెలిపారు. విచారణ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన తాజా దర్యాప్తు నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది. సీబీఐ అధికారి రాంసింగ్‌తో పాటు వివేకా కుమార్తె సునీతారెడ్డి, ఆమె భర్తపై గతంలో నమోదైన కేసు పూర్తిగా కక్షసాధింపు చర్య అని ప్రభుత్వం తన నివేదికలో పేర్కొంది. ఇద్దరు పోలీసు అధికారులను అడ్డం పెట్టుకుని ఎంపీ అవినాశ్ రెడ్డే ఈ కేసును బనాయించారని ఆరోపించింది. అవినాశ్ రెడ్డి బెయిల్‌పై బయట ఉంటే సాక్ష్యాలను తారుమారు చేయడం, సాక్షులను ప్రభావితం చేయడం లేదా బెదిరించడం వంటివి చేస్తారనడానికి ఈ ఘటనే నిదర్శనమని ప్రభుత్వం తరపు న్యాయవాదితో పాటు, సునీత తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదించారు. అందువల్ల అవినాశ్ రెడ్డి బెయిల్‌ను తక్షణమే రద్దు చేయాలని వారు కోర్టును అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం, విచారణను వాయిదా వేసింది.


# సిబిఐ వలలో రైల్వే డిఓఎం

## - సోలాపూర్,హైదరాబాద్,గుంతకల్లులలో సోదాలు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 29,ప్రభాతవార్త** అవినీతి ఆరోపణలపై దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లో డిఓఎంగా పనిచేస్తున్న ఓ అధికారిని మంగళవారం సిబిఐ అరెస్టు చేసింది. వివరాల్లోకి వెళితే : దక్షిణ మధ్య రైల్వే జోనల్ ప్రధాన కేంద్రంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, చీఫ్ కంట్రోలర్‌ల నియామకాలకు సంబంధించి భారీఎత్తున లంచం డిమాండ్ చేసినట్లు సిబిఐకి ఫిర్యాదులు వెళ్లడంతో సదరు అధికారిపై నిఘా ఉంచినా సిబిఐ బృందం మంగళవారం సదరు అధికారి నుండి రూ.40వేలు నగదు, యుపిఐ రూపంలో మరో 1.25లక్ష లరూపాయలు కలిపి మొత్తం రూ.1.65లక్షలను సదరు అధికారి నలుగురు అభ్యర్థుల నుండి తన కుమారుడి బ్యాంకు ఖాతాలో బదలాయించినట్లు సిబిఐ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

ఇదిలా ఉండగా సదరు అధికారి కుమారుని బ్యాంకు ఖాతాలో రూ.31,62,500లు నగదు ట్రాన్‌సెక్షన్ జరిగినట్లు సిబిఐ గుర్తించింది. ఇందులో భాగంగా సోలాపూర్,హైదరాబాద్, గుంతకల్లులలో సోదాలు నిర్వహిస్తుంది. ఇందుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సిబిఐ వివరించింది.

# ‘ద సిబిఎన్ వే ప్రిన్సిపిల్స్ ఆఫ్ విజనరీ లీడర్షిప్ ’పుస్తకాన్ని ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు’



**విజయవాడ ఏప్రిల్29,ప్రభాతవార్త ప్రతినిధి:** "ద సీబీఎన్ వే ప్రిన్సిపల్స్ ఆఫ్ విజనరీ లీడర్షిప్ "పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఇన్ఫోలెక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పసుపులేటి సత్యేంద్ర రవిచంద్ర ఈ పుస్తకాన్ని సీఎం చంద్రబాబు సచివాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. చంద్రబాబు 75 ఏళ్ల ప్రయాణాన్ని పుస్తకరూపంలోకి తెచ్చారు. ఆయన విద్యాభ్యాసం, రాజకీయ నేపథ్యం, చేపట్టిన ప్రాజెక్టులు, ఐటీ పాలసీ, ఈగవర్నెన్స్, విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు, వృద్ధిరేటు పెరుగుదలకు తీసుకున్న చర్యలు, పీపీపీ విధానం, వ్యవసాయంలో సాంకేతికతను తెచ్చి రైతుల ఆదాయం పెంపుదల, బుడమేరు వరదల సమయంలో టెక్నాలజీ వినియోగించి బాధితులను ఆదుకున్న ఘటనలు, విజన్ 2020, విజన్ 2047 వంటి వాటి గురించి పుస్తకంలో సత్యేంద్ర వివరించారు. మొత్తం 3 విభాగాలుగా 15 అధ్యాయాల్లో పుస్తకాన్ని రచించారు. చంద్రబాబు తీసుకొచ్చిన ఐటీ కంపెనీల కారణంగా కాకినాడకు చెందినవారు హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగం పొందినట్లు సత్యేంద్ర వివరించారు. అవకాశాలను అందిపుచ్చుకుని తాను మేనేజింగ్ డైరెక్టర్ స్థాయికి ఎదిగినట్లు సత్యేంద్ర తెలిపారు.

## గ్రామీణాభివృద్ధిలో చేనేత సహకార సంఘాలు కీలక భూమిక : కలెక్టర్ మహేష్ కుమార్

**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
చేనేత సహకార సంఘాలు గ్రామీణ పేదల అవసరాలను తీరుస్తూ గ్రామీణాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తాయని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో 19 చేనేత సహకార సంఘాలకు2025- 26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 12 కోట్ల 45 లక్షల 50 వేలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రుణాల మంజూరుకు ఆమోదముద్ర వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 23 చేనేత సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వ రాయితీలతో ప్రోత్సాహకాలు అందించి వారి అభివృద్ధికి హితోదికంగా సహకరించాలన్నారు. జాతీయ హ్యాండ్లూమ్స్ కో- ఆపరేటివ్ డిపార్ట్మెంట్ ద్వారా నూలు, రంగు రసాయనాలను తదితర సామాగ్రి 50% రాయితీపై అందిస్తూ మేలు చేకూర్చాల న్నారు. ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాలు రుణాలు అందించడం తోపాటు సహకార సంఘాలు కూడా కార్మికులకు వ్యక్తిగతంగా రుణాలు అందించే అవకాశం కల్పిస్తూ తద్వారా చేనేత కార్మికులకు ఉపాధి కల్పించి ఆర్థికంగా, సామాజికంగా ఉన్నతి సాధించేలా కృషి చేయాలన్నారు. చేనేత సహకార సంఘాలు గ్రామీణ పేదల అభివృద్ధి అవసరాలను తీర్చడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయిన్నారు. సమాజంలో పేదలు తక్కువ ప్రాతినిధ్యం వహించే వారి ఆర్థిక ప్రయోజనాలను కాపాడతాయన్నారు. చేనేత సంఘాల ఆర్థిక స్థితిగతులను ఉత్పత్తుల డిమాండ్ సప్లై అంశాలపై అధికారుల ద్వారా ఆరా తీశా రు.



ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు పెద్దిరెడ్డి, ప్రాంతీయ ఉపసంచాలకులు ధనుంజయ్, వీవర్స్ సర్వీసెస్ సెంటర్ సహాయ సంచా లకులు జ్ఞాన శేఖర్, జిల్లా మానిటరింగ్ అధికారి హరిప్రసాద్, జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 30 - ఏప్రిల్ - 2025



## పది' లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు చిరు సత్కారం



**అంబాజీపేట , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
ఇటీవల ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు చిరు సత్కారం, నగదు బహుమతిని అందజేశారు. మండలంలోని ఇసుకపుడే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వి ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో 23 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు వ్రాయగా 22 మంది ఉత్తీర్ణులయ్యారని, వీరిలో ఏడుగురు విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారన్నారు. 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులను గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు గ్రామస్తుల సమక్షంలో దుస్సాలువాతో సత్కరించారన్నారు. అలాగే పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినికి రూ. 1,000లు, మిగిలిన విద్యార్థులకు రూ. 500లను గ్రామ సర్పంచి తరపట్ల మోహన్ సింగ్ బాబురావు నగదు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల సమైక్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఎస్ఎంసి చైర్మన్ పళ్ళ స్వామినాయుడు, పిడి బూల చిరంజీవి, ఉపాధ్యాయులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పదవతరగతి పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించిన ఆర్.డి.ఓ

**కొత్తపేట రూరల్ , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త )**
కొత్తపేట మండలం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల లో అత్యదిక మార్కులు సాదించిన విద్యార్దులను కొత్తపేట రెవిన్యూ డివిజినల్ అధికారి పి.శ్రీకర్ దుస్సాలువాతో సత్కరించి మెమెంటో అందించారు. ఈ విద్యా సంవత్సరంమార్చి నెలలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో కొత్తపేట మండలంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్దులు 587 మార్కులతో సయ్యద్ రషీద్ బేగం జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాల కొత్తపేట ప్రథమ స్థానం, 584 మార్కులతో బి. వాణి శ్రీవిద్య జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వానపల్లి ద్వితీయ స్థానం, 578 మార్కులతో పి. లక్ష్మి ప్రనవ్య జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వానపల్లి తృతీయ స్థానం సాధిచడం జరిగినది. మండల విద్యా శాఖాదికారులు ఆద్వర్యములో విద్యార్దులు, తల్లిదండ్రులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమక్షములో కొత్తపేట రెవిన్యూ డివిజినల్ అధికారి విద్యార్దులను సత్కరించి అబినందించారు. వీరు విద్యార్దులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇదే



ఒరవడి కొనసాగిస్తూ ఉన్నతముగా ఎదగాలని ఉద్బోదించారు. భవిష్యత్ ప్రణాళిక అడిగి విద్యార్దులకు తగు సూచనలు చేశారు. మంచి కెరియర్ ను ఎంచుకొని అత్యున్నత స్థానములో ఉండాలని సూచించారు. అదేవిధముగా డా. అబ్దుల్ కలాం జీవిత చరిత్ర పుస్తకమును విద్యార్దులకు బహూకరించారు. ఈ కార్యక్రమములో మండల విద్యా శాఖాదికారులు ఎం. హరి ప్రసాద్, కె.లీలావతి గారు విద్యార్దులను పూలమాలలతో సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమములో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.సత్యనారాయణ, కె.సత్యనారాయణ ఉపాధ్యాయులుబి. శేషగిరి రావు మరియు మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కౌలు రైతుల వివరాలను సేకరించాలి తహసిల్దార్ తాతారావు



**శంఖవరం, ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
కౌలు రైతులను గుర్తించి వారి వివరాలు సేకరించాలని తాసిల్దార్ ఎ.తాతారావు సిబ్బందికి సూచించారు. శంఖవరం తాసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ మరియు వ్యవసాయ సిబ్బందితో కౌలు రైతుల గుర్తింపుపై సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి కౌలు రైతులను గుర్తించి వారి వివరాలు సేకరించాలని తెలిపారు. కౌలు రైతులకు కౌలు పత్రాల ద్వారా ప్రభుత్వం అందించే వడ్డీ లేని రుణాలు, పంట బీమా, ఇన్పుట్ సబ్సిడీ , పంట రుణాలు వంటివి లబ్ది చేకూరే అవకాశం ఉందని వ్యవసాయ అధికారి పి గాంధీ తెలిపారు. రెవెన్యు, వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎక్కువ మంది కౌలు రైతులను గుర్తించాలని వివరించారు. ఎ ఈ ఓ శ్రీనివాస్, మౌళి ప్రసాద్,వి. ఆర్ ఓ లు,రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## కాకినాడ జిజిహెచ్ సూపరిడెంట్ గా విఠల్

**కాకినాడ టౌన్ , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
కాకినాడ జిజిహెచ్ సూపరింటెండెంట్గా డాక్టర్ ఎం. పాండురంగ విఠల్ కి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీ ఎం ఈ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు సూపరిడెంట్ గా పనిచేస్తున్న లావణ్య కుమారి అనారోగ్యం కారణంగా సెలవు పై ఉన్న నేపథ్యంలో డిప్యూటీ సూపరిడెంట్ , ఆర్థోపెడిక్స్ డిపార్ట్మెంట్ కు హెచ్ ఓ డి గా ఉన్న విఠల్ కి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. హాస్పిటల్ నిర్వహణ, వైద్యులు సిబ్బంది సమన్వయంతో ముందుకు వెళుతున్న తరుణంలో విఠల్ సమర్థత సామర్థ్యం గుర్తించి ప్రభుత్వం ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించింది.



## నేషనల్ ఐకాన్ అవార్డు అందుకున్న సత్యనారాయణ



**మామిడికుదురు , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
మామిడికుదురు మండలం లోని నగరం గ్రామానికి చెందిన కళాభూషణ్ మంగం సత్య నారాయణ మహాత్మా జ్యోతిరావు పూలే నేషనల్ ఐకాన్ అవార్డును అందుకున్నారు. రాజమండ్రి ఆనం రోటరీ కళా కేంద్రం నందు అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ ఈ అవార్డును అందుకున్నట్లు మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. నేషనల్ ఐకాన్ అవార్డును అందుకున్న సత్యనారాయణ పలువురు గ్రామస్తులు,తోటి కళాకారులు అభినందనలు తెలిపారు.

## పుస్తకాల పఠనంతోనే ఉన్నత స్థానం : కలెక్టర్ షాన్ మోహన్

**ఉమ్మడి తూర్పుగోదావరి**
**జిల్లా బ్యూరో, ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
1962 సంవత్సర సీనియర్ రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, కైట్ విద్యాసంస్థల గౌరవాధ్యక్షులు యం గోపాలకృష్ణ కర్మయోగి అనే పుస్తకాన్ని రచించి మంగళవారం జేఎన్టి యుకెలో కర్మయోగి అనే పేరుతో పుస్తకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షాన్ మోహన్, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు, మేజర్ జనరల్ ప్రసాద్, ప్రొఫెసర్ మురళీకృష్ణ, కైట్ కాలేజ్ చైర్మన్ పోతుల విశ్వం, కైట్ డైరెక్టర్ ఐశ్వర్యలు ఈ పుస్తకా విష్కరణలో పాల్గొని పుస్తకాలు చదవడం వల్ల జీవితంలో ఏ విధంగా ఉపయోగపడుతుందో విద్యార్థులకు తెలియజేశారు. అలాగే మాజీ ఐఎఎస్ అధికారి ఎం గోపాలకృష్ణ నాయుడు కాకినాడ ప్రాంతంలో గోదావరి ఎరువులు కర్మాగారాన్ని నిర్మించడానికి ఆయన కీలకపాత్ర వహించారని వక్తలు కొనియాడారు. మాజీ కేంద్ర మంత్రి





పల్లంరాజు, మురళీకృష్ణ ఉన్న అనుబంధాన్ని విద్యార్థులకు తెలిపారు. ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సృజనా శక్తిని పెంపొందించు కోవడానికి పుస్తకాలు చదవడం వల్ల ఎంతో దోహదం చేస్తాయని ప్రతివారు జీవితంలో ఐఎఎస్, ఐపీఎస్ గ్రూప్ వివిధ శాఖలో పరీక్షలు రాయాలంటే ప్రతి పుస్తకం భవిష్యత్తును సూచిస్తుందని విద్యార్థులకు తెలిపారు, కైట్ విద్యా సంస్థల చైర్మన్ విశ్వం మాట్లాడుతూ తనకు చిన్నతనం నుండి గోపాలకృష్ణ తో చాలా దగ్గర పరిచయాలు ఉన్నాయని తన ఎదుగుదలకు ఆయన ఒక కారణమని అందుకే తమ కైట్ విద్యా సంస్థలకు ఆయన్ని గౌరవాధ్యక్షులుగా నియమించానని చెప్పారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ తాను ఈ పుస్తకాన్ని తన జీవితంలో జరిగిన సంఘటనను మధురానుభూతిని పొందు పరిచారని ఈ పుస్తకం చదవడం వల్ల ఇప్పటి విద్యార్థులు తల్లిదండ్రులను ఏ విధంగా గౌరవించాలి సమాజంలో అందరి వద్ద గౌరవం పొందాలంటే ఏ విధంగా ప్రవర్తించాలి అన్ని కలగలిపి ఉంటాయని ఎవరన్నా తనలాంటి వాళ్ళు పుస్తకం రచిస్తే తప్పక ప్రతి ఒక్కరూ చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులకు సూచించారు. అనంతరం గోపాలకృష్ణ నాయుడు ఆయన సతీమణి సుజాతలను సన్మానించి జ్ఞాపకలను అందజేశారు ల. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కైట్ విద్యార్థులు, గోదావరి ఎరువుల కర్మాగారం విశ్రాంతి ఉద్యోగులు, వివిధ రాజకీయ నాయకులు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధి కూలీకి పాము కాటు



**సీతానగరం,, ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
మండలంలోని ఇనుగంటివారి పేట గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ కానేటి శాంతమ్మ మంగళవారం కాలువలో పని చేస్తుండగా పాము కాటుకు గురయ్యారు. ఆమెకు సీతానగరం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ఏపీఓ సత్యవతి తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం,ఆర్థికాభివృద్ధి : సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి





**గండేపల్లి , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయం సాగు విధానాన్ని అందరూ ఆచరించాలని సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర కోరారు. గండేపల్లి మండలం నాయకంపల్లి లో వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సులో పాల్గొని రైతన్నలను చైతన్యపరిచారు. పంటలకు రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వినియోగించడం వల్ల నేల తల్లిని నిర్జీవం చేస్తున్నామని, భూమిలో ఉండి పంటకు ఉపయోగపడే వానపాములు,అనేక రకాల మిత్ర జీవులు చనిపోవడం వల్ల నేల సహజ జీవం కోల్పోతుందని, రసాయనిక ఎరువులు పురుగు మందులతో పండించే పంటల వలన అందరికీ అనేక రకాల రోగాలు రావడం వ్యాధి నయం కోసం హాస్పటల్లో చేరి అప్పులు పాలవడం ప్రతి కుటుంబాల్లోనూ జరుగుతుందని భూమిని బలోపేతం చేయడానికి పంట దిగుబడి పెంచడానికి రసాయనిక ఎరువులు తగ్గించి, ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ఇచ్చే పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు చల్లడం ద్వారా 40నుండి50 రోజుల్లోనే భూమికి మంచి బలం ఆరోగ్యం చేకూర్చే సహజసిద్ధమైన ప్రకృతి ఎరువు తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవడం జరుగుతుందని, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం పంటలకు వాడటం తద్వారా ఆరోగ్యకరమైన పంట పండించడానికి అవకాశం ఉంటుందని సూర్యచంద్ర రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రజలను చైతన్య పరుస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని సూర్యచంద్ర అభినందించారు.

## మెడికవర్ హాస్పిటల్ సామాజిక సేవలు అభినందనీయం : ఎస్పీ బిందు మాధవ్

**కాకినాడ రూరల్ ,**
**ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
కాకినాడ అచ్చంపేట జంక్షన్ సమీపంలో సామాన్యులకు అత్యాధునిక వైద్య సదుపాయాలతో సేవలు అందిస్తున్న మెడికవర్ హాస్పిటల్స్ సామాజిక సేవలు అభినందనీయమని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. మంగళవారం ఉదయం కాకినాడ పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం సెంటర్ హెడ్ శుభాకర రావు ఆధ్వర్యం లో కాకినాడ జిల్లా ఎస్పీ సమక్షంలో 100 బారికేడ్లను అందజేశారు. ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా జిల్లా పోలీసు శాఖకు మెడికవర్ హాస్పిటల్ సంస్థ అండగా ఉందని కొనియాడారు. పోలీసులకు అనేక సందర్భాల్లో ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం గతంలో కూడా అనేక కార్యక్ర



మాలను నిర్వహించిన మెడికవర్ హాస్పిటల్ యాజమా న్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. హాస్పిటల్ సెంటర్ హెడ్ శుభాకర రావు మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖకు ఎప్పుడూ వైద్య , ఆరోగ్య సేవలకు సంబంధించిన విషయంలో మెడికవర్ హాస్పిటల్ ముందంజలో ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం హాస్పిటల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఉమెన్ అండ్ చైల్డ్ విభాగాన్ని ఎస్పీ బిందుమాధవ్, అడిషనల్ ఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ , పెద్దాపురం డి.ఎస్ .పి లు మనీష్ దేవరాజ్ పాటిల్, శ్రీహరి రాజు, సిఐలు చైతన్యకృష్ణ, భగవాన్, ట్రాఫిక్ సిఐ లు మురళీకృష్ణ, రామ రావు, మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ ఆపరేషన్స్ హెడ్ ఖాద్రి , మార్కెటింగ్ హెడ్ ఎన్. నాగరాజు , హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సికిల్ సెల్ ఎనీమియాతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**మామిడికుదురు , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచించారు. దీనిపై పాశర్లపూడి గ్రామంలో సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రజల నుండి రక్త నమూనాలను సేకరించారు. సికిల్ సెల్ కణాలు శరీరంలో రక్త కణాలు తగ్గటానికి దారితీస్తాయన్నారు. దీనివల్ల మనిషిలో రక్తహీనత ఏర్పడి కళ్ళు పసుపు రంగులో మారి ఒళ్ళు నొప్పులు,కీళ్ల నొప్పులు రావటం ఈ వ్యాధి ప్రధాన లక్షణాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఎం.పి.హెచ్.ఎస్ రాజేంద్ర బాబు,ఎల్. టి. హరిశ్చంద్ర,హెల్త్ అసిస్టెంట్ కొమ్ముల సూర్య నారాయణ, ఏఎన్ఎంలు భూలక్ష్మి, వెంకటలక్ష్మి,లక్ష్మి పాల్గొన్నారు.

## మత్స్యకార పరిహారం పెంపు పై సి.ఎంకు ధన్యవాదాలు

**కాకినాడ టౌన్,**
**ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
ప్రతీ ఏటా వేట విరామ సమయంలో మత్స్యకారులకు అందించే వేట పరిహారాన్ని 10వేల నుంచి 20వేలకు పెంపు పట్ల కాకినాడ నగరానికి చెందిన బోటు యజమానులు, మత్స్యకార లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ఉప్పుటేరులో బోటుపైన తమ అభిమానాన్ని చాటుకున్నారు. మంగళవారం స్థానిక ఏటిమొగ రోడ్డులో ఉన్న బోటు యజమానుల కార్యాలయం వద్ద నుంచి జగన్నాథపురం వంతెన వరకు ఉప్పుటేరు గుండా బోట్లతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావు (కొండబాబు) మాట్లాడుతూ వేట విరామ సమయంలో మత్స్యకారులకు పదివేల నుంచి 20వేల రూపాయలు ప్రకటించిందన్నారు. ఇప్పటికే చాలామందికి



లబ్ధిదారులకు వారి ఖాతాలో నగదు చేరాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు పరిహారం ఇవ్వకుండా మాయమాటలతో వారిని అప్పటి సీఎం జగన్ మోసం చేశారన్నారు.

ఒక్క కాకినాడ నగరంలోనే 390 బోట్లు ఉన్నాయని వారిలో నాలుగు వేల మంది లబ్ధిదారులున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బోటు యజమానుల సంఘం అధ్యక్షుడు సంగాని నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మల్లాడి రాజు, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు బలసాడి రంగారావు, బోటు యజమానులు నాటి బాబు, పాలెపు ధర్మారావు, లంకాడి రాజు, సంగాని బుజ్జి, చింతా పేర్రాజు, చెక్కా లక్ష్మణ్, లంకే నూకరాజు, పంతాడి రాజు, కొంపెల్ల రాంబాబు టీడీపీ నాయకులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశ్రీ అవార్డు స్వీకరించిన స్వర్గీయ మిరియాల కుమార్తె శిరీష దేవి



**రావులపాలెం, ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
రావులపాలెం గ్రామానికి చెందిన బుర్ర కథ కళాకారుడు స్వర్గీయ మిరియాల అప్పారావుకి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డును ఆయన కుమార్తె మిరియాల శిరీష దేవి స్వీకరించారు. ఈ ఏడాది జనవరిలో ఆయన మరణం అనంతరం పెద్దకర్మ రోజున ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించిన విషయం తెలిసిందే. సోమవారం దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో జరిగిన పద్మ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును శిరీష దేవి అందుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, బండారు సంజీవ్ తదితరులు అభినందించారు.

# రాజ్యసభ అభ్యర్థిగా పాకా ప్రకటనపై పాలూరి హర్షం

**కొత్తపేట రూరల్ , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
రాజ్యసభ ఉప ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా బిజెపి సీనియర్ నాయకులు, పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్పాక వెంకట సత్యనారాయణను బిజెపి కేంద్ర ఎన్నికల కమిటీ ప్రకటించారు. రాజకీయాల్లో తనదైన శైలిలో ప్రజల కోసం పాలక పక్షాన్ని సైతం నిలదీసి జనం నుండి పుట్టిన జననేత ల అధికారం కన్నా ఆత్మాభిమానమే ముఖ్యమంటూ, నిరంకుశత్వ పాలనకు ఎదురొడ్డి నిలుస్తూ, ప్రజా సమస్యలపై గళమెత్తుతూ, నిత్యం బీజేపీ కోసం శ్రమిస్తున్న, అలుపెరుగని యోధుడు,1976లో అర్ ఎస్ ఎస్ లో ప్రస్థానం ప్రారంభించి బిజెపి కార్యకర్తగా నేతగా ఎదిగి, వైసీపీనేత విజయసాయిరెడ్డి స్దానం ఖాళీఅవ్వగా కూటమిలో బిజెపి తరుపున రాజ్యసభకు పాకా ను పంపడంపై పాలూరి అభినందనలు తెలిపారు.




# ఓఎన్జిసి సహకారంతో తాగునీరు సరఫరా



**మామిడికుదురు , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త )**
మామిడికుదురు మండలంలోని పాశర్లపూడి లంక గ్రామంలో బొరుసు వారి వీధి,మేడిది వారి గ్రూపులలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న కారణంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. ఓఎన్జిసి వారు సమకూర్చిన రెండు వాటర్ ట్యాంకర్ల ద్వారా రోజుకు 44 వేల లీటర్ల నీటిని అందిస్తున్నామని సర్పంచ్ తెల్లగారెడ్డి సూర్యప్రకాశరావు తెలిపారు. ఈ తాగునీటి ట్యాంకర్లను సర్పంచ్ మంగళవారం ప్రారంభించారు. వేసవికాలం పూర్తి అయ్యేవరకు ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తామన్నారు. తాగునీటి కోసం సరఫరా కోసం ఓఎన్జిసి వారు ముందుకు రావడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు కోలా సత్యనారాయణ,తెలగారెడ్డి ఏసు,గ్రామస్తులు,ఓఎన్జిసి అధికారులు పాల్గొన్నారు.

# అకాల వర్షం - ఆందోళనలో అన్నదాత



**రావులపాలెం, ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
రావులపాలెం మండలంలో మంగళవారం రాత్రి అకాల వర్షం దంచి కొట్టింది. ఉదయం నుంచి ఎండలు, అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన సామాన్య ప్రజలను రాత్రికి వరుణుడు సేద తీర్చాడు. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరి పంట కోతల దశలో ఉన్న నేపథ్యంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం నష్టాలు మిగిల్చేలా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# పహల్గం ఉగ్రదాడిలో అమరులకు జనసేన పార్టీ నివాళి..పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ రూరల్ , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త )**
జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో మంగళగిరి సీకే కన్వెన్షన్ హాల్లో పహల్గం ఉగ్రదాడిలో మరణించిన అమరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొని మృతుడు చిత్రపటానికి పుష్పాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఉగ్రవాద దాడిలో మృతి చెందిన సోమిశెట్టి మధుసూదన్ కుటుంబానికి జనసేన పార్టీ తరపున 50 లక్షలు విరాళాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రకటించారని ఎమ్మెల్యే నానాజీ తెలిపారు . ఈ సందర్భంగా జనసేన పార్టీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే లు పాల్గొని ఉగ్రవాదుల దాడి లో మరణించిన కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ అండగా ఉంటుందనీ ఒక ప్రకటనలో మీడియాకు తెలిపారు.

# అధిక వేలానికి శ్రీ పంచాయతన సీతారామ చంద్రమూర్తి దేవస్థానం భూములు


**శంఖవరం , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
శంఖవరం మండలంలోని ఎస్ జగ్గంపేటలోని పురాతన ఆలయంగా పేరుగాంచిన శ్రీ పంచాయతన సీతారామ చంద్రమూర్తి స్వామి వారి దేవస్థానంకు చెందిన భూముల కౌలుకు నిర్వహించిన వేలంలో అధిక ఆదాయం సమకూరడంతో దేవాదాయ శాఖ అధికారులు, దేవస్థానం పాలక వర్గం హర్షం వ్యక్తం చేసారు. స్వామి వారి ఆలయ ఆవరణలో పిఠాపురం గ్రూపు 4 దేవాలయాల కార్యనిర్వహణాధికారి జి అశ్విని, ఆలయ వంశపారంపర్య ఛైర్మన్ మోగంటి తిరుపతిరాజు ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ పి రాజబాబు భూముల వేలం నిర్వహించారు. ఎస్ జగ్గంపేటలోని సర్వే నెం. 78/2లో గల య.3.32ట్లు భూమికి గడిచిన మూడేళ్ళ కాలానికి ఏడాదికి 56 వేల రూపాయులు ఉండగా, ప్రస్తుతం రాబోయే మూడేళ్ళ కాలానికి ఏడాదికి 1లక్ష 16వేల రూపాయులు చొప్పున శంఖవరం గ్రామానికి చెందిన బైరా రాంబాబు దక్కించుకున్నారు. సర్వే నెం. 24/1లో య.6.09ట్లు మెరక భూమికి మూడేళ్ళ కాలానికి నిర్వహించిన వేలంలో ఏడాదికి 10వేల 5వందల రూపాయుల చొప్పున శంఖవరం గ్రామానికి చెందిన గవరసాని కృష్ణ దక్కించుకున్నారు. ఈ దేవస్థానానికి రౌతులపూడి మండలం గుమ్మరేగుల గ్రామంలో సర్వే నెం.55లో గల య.10.45ట్లు భూమికి మూడేళ్ళ కాలానికి గతంలో ఏడాదికి 1లక్ష55 వేల రూపాయులు ఉండగా, ప్రస్తుతం ఏడాదికి 3లక్షల 60వేల రూపాయులు చొప్పున మూడేళ్ళ కాలానికి ఆదాయం సమకూరింది. ఈ ప్రాంతంలో ఇటీవల సరుగుడు తోటల భూమ్ అధికంగా ఉండడం వల్లే స్వామి వారికి ఎన్నడూ లేని విధంగా, కనివినీ ఎరుగని రీతిలో ఆదాయం సమకూరిందని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మోగంటి మురళీకృష్ణ, టిడిపి సీనియర్ నేత ఓలేటి లక్ష్మీనారాయణ, శంఖవరం, ఎస్ జగ్గంపేట గ్రామాల రైతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రమాదాలు నివారణకు మల్టీ డిసిప్లినరీ బృందాలుగా ఏర్పడాలి

## నగరంలోకి వొచ్చే 21 ప్రధాన రహదారి మార్గంలో అప్రమత్తంగా వ్యవహరించాలి : కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
రహదారి భద్రత, వాహన చోదక నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా రహదారి ప్రమాదాలను నివారించడం సాధ్యం అవుతుందని, ఆమేరకు తదుపరి సమావేశం నాటికి శాఖల వారీగా నివేదికలతో రావాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. క్యాంప్ కార్యాలయం లో కలెక్టర్ అధ్యక్షతన రోడ్లు భవనాలు శాఖ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి రహదారి భద్రత సంఘం ( డిఎల్ఆర్ఎస్సి ) సమావేశం లో జిల్లా ఎస్పీ డి. నరసింహ కిశోర్ తో కలసి కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ జాతీయ రహదారుల పై ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని వీటిలో మరణాల సంఖ్య కూడా ఎక్కువగా ఉండి ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర , ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ అధికారులు రహదారుల ప్రమాద విషయాల్లో దృష్టి సారించాలని చెప్పారు. ప్రమాదాల సంఖ్యను, తీవ్రతను తగ్గించడానికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గత సమావేశం లో తీసుకున్న నిర్ణయాలు అమలు కాకపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై లైటింగ్ ఏర్పాటుకు మూడు నెలల సమయం ఎందుకని ప్రశ్నించారు. టెండర్లతో సంబంధం లేకుండా అత్యవసరంగా పనులు పూర్తి చేయడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని, అందుకు మీ పరిధిలో ఉన్న ఆర్థిక అనుమతులను అనుసరించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదాల తీవ్రతను జాతీయ రహదారుల ఉన్నతాధికారులకు తెలియచేయడం తో పాటు ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారో తెలుపుతూ చర్య నివేదిక(ఏటిఆర్) ను మంగళ వారం సాయంత్రం లోపు సమర్పించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఐరాడ్ యాప్ పై సంబంధిత శాఖల అధికారులందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. రాష్ట్ర రహదారుల టోల్ ధరలు జాతీయ రహదారులతో సమానం గా ఉన్నాయని కానీ, భద్రతా ప్రమాణాలు ఆ స్థాయిలో లేవని అన్నారు. రహదారి అభివృద్ధి సంస్థ అధికారులు తనిఖీలు చేయాలని, ఆదాయం మాత్రమే లక్ష్యంగా పనిచేస్తున్న ఏజెన్సీస్ సరైన ప్రమాణాలు పాటించని వారికి నోటీసులు ఇవ్వాలన్నారు. సమర్థవంతంగా నిర్వహణ, మరమ్మత్తులు చేపట్టేందుకు జవాబుదారుతనం కలిగి ఉండాలన్నారు. గుత్తేదారు (కాంట్రాక్టర్) ల పై జరిమానాలు విధించాలని చెప్పారు.



రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని, నగరం లో వేగ పరిమితి (స్పీడ్ లిమిట్) పెట్టాలని, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేయాలని, శిరస్త్రాణం (హెల్మెట్) లేని వారికి జరిమానాలు విధించాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో గోల్డెన్ అవర్స్ లో ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది. సూచికలను ఏర్పాటు చేయడం వలన ప్రమాదాలను గణనీయంగా తగ్గించడం సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. వ్యవస్థలను లోపాలను గుర్తించి వాటిని అధిగమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న ఎస్పి నరసింహ కిశోర్ మాట్లాడుతూగడచిన మూడు నెలల్లో ప్రమాదాలు, మరణాలు రెట్టింపు అయ్యాయని చెప్పారు. ఆర్టిసి బస్సుల వల్ల ప్రమాదాలు తగ్గాయని, కానీ నాలుగు చక్రాల (ఫోర్ వీలర్స్) వాహనాల వల్ల పెరిగాయని తెలియజేశారు. త్రీ టౌన్ పరిధిలో ఉన్న ప్రాంతాలలో ప్రమాద మరణాలు అధికమయ్యాయని, గామన్ బ్రిడ్జ నుంచి జీరో పాయింట్ వరకు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. జాతీయ రహదారి పై లైటింగ్ సమస్య ఉందని, రహదారుల పనులు చేపట్టినప్పుడు పోలీసు శాఖకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. రవాణా శాఖ, పోలీసు శాఖ, ఇతర సమన్వయ శాఖల అధికారులు మల్టీ డిసిప్లినరీ బృందాలుగా ఏర్పడి సంయుక్తం గా తనిఖీలు చేపట్టాలన్నారు. నగర పరిధిలో హెల్మెట్ ధరించనవసరం లేదనేది కేవలం అపోహ మాత్రమేనని, అలాంటి వెసులు బాటు ఏదీ చట్టం లో లేదని చెప్పారు. అవగాహన, ఇంజనీరింగ్ లోపాలు అధిగమించడం, ప్రణాళికలు అమలు చేయడం ద్వారా ప్రమాద నివారణ సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశం లో ఆర్ అండ్ బి ఎస్ ఈ ఎస్ బి వి రెడ్డి, పోలీసు, రవాణా, జాతీయ రహదారులు, రాష్ట్ర హై వే, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య, పురపాలక , ఎన్ హెచ్ ఏజెన్సీస్, , తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కారు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి..పరారైన కారు

**తొండంగి , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
బెండపూడి జాతీయ రహదారిపై గోర రోడ్డు ప్రమాదం మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు ,పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ...కత్తిపూడి నుండి అన్నవరం వైపు వెళ్తున్న కారు, బెండపూడి వై జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టడంతో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.సదరు వ్యక్తిని ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు.మృతుడు తొండంగి మండలం బెండపూడి గ్రామానికి చెందిన బోనగిరి నూకరాజు, వయసు (83) గా తెలుస్తుంది.మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు.కారు పరారీ అయినట్టు ,గాలింపు చర్యలు చేపట్టినట్టి పోలీసులు తెలిపారు.

# చలివేంద్రంతో సేవ చేయడం అభినందనీయం : శివ

**శంఖవరం , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
చలివేంద్రంతో సేవ చేయడం అభినందనీయమని రాష్ట్ర టిఎన్టియుసి ఉపాధ్యక్షులు వెన్నా శివ అన్నారు. మండలంలోని కత్తిపూడి కాంప్లెక్స్ సమీపంలో వాసవి క్లబ్ సభ్యులచే అందించిన మజ్జిగ పంపిణీ ని ఆయన ప్రారంభి ంచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో భాగంగా ప్రయాణికులు పాదచారులు దాహార్తిని తీర్చడానికి మజ్జిగ చలివేంద్రం ప్రారంభించడం అభినందనీయ మన్నారు. వాసవి క్లబ్ సభ్యులు గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు

# ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి అన్నదాన ట్రస్ట్ కు విరాళం

**కోనసీమ బ్యూరో, ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
స్వయంభు క్షేత్రం ఎంతో పురాతన చరిత్ర కలిగిన ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ %డ% గోపాల స్వామివారి దేవస్థానం నకు కడియం మండలం, జేగురుపాడు చెందిన కుమారి. ఆత్మకూరి జయసూర్య పద్మ, స్వామి వారిని దర్శించుకొని శ్రీ స్వామి వారి అన్నదాన పథకానికి రూ.20,001వేలు విరాళంగా అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వదం అందించారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి , భాగవతుల వెంకట రమణ మూర్తి శ్రీ స్వామి వారి చిత్రపటం తీర్థప్రసాదాలు అందజేసారు.




# ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన



**అంబాజీపేట, ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు. మండలంలోని కె.పెదపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో 576 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన గుత్తుల సురేష్, 560 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన నేదునూరి సంధ్యలను, ప్రజా ప్రతిని ధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వేణు గోపాలకృష్ణ మాట్లాడుతూ పదిమంది విద్యార్థులకు ఐదుగురు విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో గ్రామ సర్పంచి బీర శాంతి,ఎంపిటిసి సభ్యురాలు ఈతకోట ఉషా భార్గవి, ఉప సర్పంచ్ బళ్ల గంగాధరం, ఎస్ఎంసి చైర్మన్ సిహెచ్. కోదండరాముడు, మంద రాజేష్, నేదునూరి పెద్దిరాజు, గొలకోటి నరేష్ తదితరులు ఉన్నారు.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి : కలెక్టర్ మహేష్ కుమార్

**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 30 ( ప్రభాతవార్త ) :**
ప్రతి కుటుంబంలో స్థానికంగా కొబ్బరి కోకో పారిశ్రామి కవేత్త ఉండాలనేది ప్రభుత్వ దార్శ నికతని, వేగ వంతమైన పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా ఔత్సాహిక పారి శ్రామిక వేత్తలను ప్రోత్స హించా లని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సూచిం చారు. స్థానిక కలెక్టరేట్ నందు 14వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. 13 వ డిఏఈపిసి లో తీర్మానించిన అంశాలపై తీసుకున్న చర్యలను పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకే పీ ప్రసాద్ కమిటీ సభ్యులకు వివరించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ప్రధానమంత్రి ఉపాధి కల్పన, విశ్వకర్మ యోజన ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ లు ,బడుగు వికాసం ఎం ఎస్ ఎం ఈ, కోకో పర్మంటేషన్ వంటి పథకాలను సద్విని యోగం చేసుకునేలా యువతకు అవగాహన కల్పించాలన్నారు వివిధ పథకాల కింద ఏర్పాటైన పారిశ్రామిక యూనిట్ల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు, వాటి నిర్వహణ లో ఏవైనా ఇబ్బందులుంటే చక్కదిద్ది పురోగతి దిశగా నడిపించాలని సూచించారు. ఉపాధికి ఊతం, ఉన్నతికి మార్గమైన క్లస్టర్ డెవలప్మెంట్ పరిశ్రమలు స్థాపన, స్వయం ఉపాధితో పాటు మరో పది మందికి ఉపాధి చూపడానికి జీవితంలో ఉన్నతికి చేరుకోవ డానికి ఎం ఎస్ ఎం ఈ లు దోహదపడతాయన్నారు స్వయం ఉపాధి చూపడం సమగ్ర అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో క్రెడిట్ లింక్ తో పాటు రాయితీని కల్పించి పారిశ్రామికంగా ఉపాధి కల్పన పరంగా ప్రగతి సాధించాలన్నారు వివిధ పరిశ్రమల అనుమతుల కోసం నిర్దేశించిన ఏకగవాక్ష విధానం లో 1721 దరఖాస్తులు రాగా 1656 అనుమతించగా, 61 దరఖాస్తులు వివిధ కారణాల మూలంగా తిరస్కరించబడ్డా యని తెలిపారు ప్రధానమం త్రి విశ్వకర్మ యోజన ద్వారా 6902 దరఖాస్తులు వచ్చా యని దశలవారీగా పరిష్కరించడం జరుగుతుందన్నారు జిల్లావ్యాప్తంగా ఎం ఎస్ ఎంఈ యూనిట్ల స్థాపన రాయితీలతో సంబంధించిన 34 దరఖాస్తు రాగా వీటి మంజూరుకు ప్రతిపాదించిన రూ కోటి 61 లక్షలు కమిటీ సభ్యులు అనుమతితో కలెక్టర్ ఆమోద ముద్ర వేశారు. స్థానికంగా రైతాంగానికి కోకో గింజల ఫర్మెంటేషన్ ప్రక్రియ నిర్వహించడంలో ఇబ్బం దులు ఎదుర్కొంటూ గింజల తయారీలో నాణ్యతను కోల్పోతున్న దృష్ట్యా కోనసీమ జిల్లాలో కోకో ఫర్మెంటేషన్ కేంద్రాన్ని నాణ్యమైన కోకో గింజలు తయారీకై ప్రాచుర్యం పొందిన కంపెనీతో నెల కొల్పేందుకు వివిధ కంపెనీలు నుండి ప్రతిపాదనలు కోరా మని ఆ దిశగా "మండే తేజ్" ఇంటర్నేషనల్ సంస్థ ముం దుకు వచ్చి డిపిఆర్ను సమర్పించిందన్నారు .



అదేవిధంగా కంపెనీ ప్రతినిధి నితిన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అనువైన రకాలు సాగు, కోకో లో కాయ కోత అనంతర యాజ మాన్య పద్ధతులు నాణ్యత ప్రమా ణాలు ప్రాముఖ్య తను విశదీకరించారు. పర్మంటేషన్ కేంద్రాన్ని ఆపరేషన్ నిర్వ హణ ఖర్చులు కలిపి డిపిఆర్ ను పునరుద్ధరిం చాలని ఆయన సూచించారు రైతాంగం ఎంతో కష్టపడి పండించిన కోకో గింజలను గిట్టుబాటు ధరలకు కొను గోలు చేయాలని కొనుగోలు దారులైన విజయ్ కుమార్ కు సూచించారు ఉద్యాన పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ తో కూడిన బృందం మే రెం డో వారంలో ఎక్స్పోజర్ విజిట్ కై కేరళ వెళ్లి కొబ్బ రి ఆదారిత పరిశ్రమలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదికలను రూపొం దించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఏడి శివరాం ప్రసాద్, డిఆర్డిఏ పిడి జై చంద్ర గాంధీ ఉద్యాన అధికారి బివి రమణ ఎల్ డి ఎం కేశవ్వర్మ కృషివల కొబ్బరి రైతుల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు అడ్డాల గోపాలకృష్ణ, రైతు ఉత్ప త్తిదారుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# అభద్రతా భావంతో మానసిక వేదన!



కొంతమంది తమలో సమర్థత ఉన్నా తమను తాము తక్కువగా అంచనా వేసుకుని అభద్రకు లోనవుతుంటారు. ఇలా వివిధ కారణాలతో అభద్రతా భావానికి లోనై మానసిక వేదన పడేవారి సంఖ్య ఇటీవల పెరిగి పోతోందని నిపుణులు చెబుతున్నారు. దీనిని ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఈ మనలోని అభద్రతా భావాన్ని ఎలా గుర్తించాలి? దీన్నుంచి ఎలా బయటపడాలి? తెలుసుకుందాం..

తక్కువ చేసి చూసుకొని..

ప్రతి ఒక్కరికీ ఏదో ఒక ప్రత్యేక నైపుణ్యం ఉం టుంది. కానీ కొంతమంది మాత్రమే దానిని సరైన పద్ధతిలో వినియోగించు కుంటారు. అయితే అభద్రతా భావం ఉన్న వారిలో కూడా మంచి నైపుణ్యాలున్నా.. తమను తాము తక్కువగా అంచనా వేసుకుంటారని నిపుణులు అంటున్నారు. సరిగా పని చేసినా తరచుగా ఇతరుల అభిప్రాయం కోరుతుంటారు. అవతలి వారి నుంచి సానుకూల స్పందన వస్తేనే సంతృప్తి పడడం.. లేదంటే బాధపడడం జరుగుతుంది. అయితే వారు ఇలాంటి స్వీయ నమ్మకం పెంపొందించు కోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

ఇతరులతో పోల్చుకుంటూ...

అభద్రతకు లోనయ్యే వారు ఇతరులతో ఎక్కువగా పోల్చు కుంటారు. వారు సాధించిన విజయా లను సాధించాలని ఆరాట పడడం, వారిపై అసూయ పడడం, ఒకవేళ వాటిని చేరుకోలేక పోతే కుంగి పోవడం అభద్రతకు లోనయ్యే వారిలో కనిపించే ముఖ్య లక్షణాలను నిపుణులు చెబుతున్నారు.

నిందించడమే పనిగా..!

అభద్రతా భావం ఉన్న వారు తమ సమస్యను పరిష్కరించు కోవడానికి బదులుగా కప్పిపుచ్చు కోవడానికి ఎక్కువగా ప్రయత్నిస్తారు ఈ ఆశిస్తున్న వారి లోపాలకు ఇతరులను బాధ్యులను చేస్తూ వారిని నిందిస్తుంటారు. అయితే వీరు అప్పటికప్పుడు సంతృప్తి పొందినా భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని అంటున్నారు. కాబట్టి ఇలాంటి స్వభావం ఉన్న వారు తమ సమస్యను పరిష్కరించేందుకు నిపుణుల సహాయం తీసుకోవడం మంచిది.

భవిష్యత్తు గురించి ఆందోళన..

అభద్రతాభావం ఉన్నవారిలో భవిష్యత్తు గురించిన ఆందోళనలు ఎక్కువగా ఉంటాయి. ప్రతి చిన్న విషయం గురించి ఎక్కువగా ఆలోచిస్తారు. ఇది క్రమంగా ఒత్తిడికి దారి తీస్తుంది. ఆ ఒత్తిడిని ఇతరులపై చూపించడం వల్ల రిలేషన్‌లోనూ సమస్యలు ఎదురవుతుంటాయి. అలాగే వీరు ఇతరులను, చివరికి సన్నిహితులను కూడా నమ్మడానికి వెనకాడుతారు. ఇది క్రమంగా మానసిక సమస్యలకు దారి తీసే అవకాశం ఉంటుంది.కాబట్టి ఇలా అభద్రతా భావంతో బాధపడే వారు.. దీన్నుంచి బయటపడాలంటే ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం, స్వీయ ప్రేమను పెంచుకోవడం ముఖ్యం. వీటికి తోడు నిపుణుల సలహాలు పాటిస్తే ఈ సమస్య నుంచి త్వరగా బయటపడచ్చు. ★

# స్క్రీన్‌కు దూరంగా..

ఇళ్లల్లో పిల్లలు చేతిలో స్మార్ట్‌ఫోన్లు లేకుండా ఉండటం లేదు. అమ్మదో, నాన్నదో, అన్నదో, అక్కదో ఎవరిది కనిపిస్తే వారిది తీసుకుని గేమ్స్ ఆడుతుంటారు. ఇంకేవో చూస్తూ ఉంటారు. వారి నుండి ఫోన్ లాక్కోవాలన్నా, వారి కంట పడకుండా జాగ్రత్త చేసుకోవాలన్నా ఇంట్లో వాళ్లకి పెద్ద సమస్యగా తయారయింది. ఇదివరకు టివిలో కార్టూన్లు, పిల్లల ప్రోగ్రామ్‌లు చూసేవారు. అస్తమానం టివి ముందు కూర్చోవద్దన్నా వినేవారు కాదు. టివి కట్టేస్తే పెద్ద గోల చేసి ఆన్‌చేసే వరకు విసిగించేవారు. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు వాళ్లకి మంచి ఎంటర్‌టైన్‌మెంట్‌గా తయారయ్యాయి. అందుకే చిన్న వయసు నుండే పిల్లలకు కళ్లద్దాలు వస్తున్నాయి. వయసు పెరిగేకొద్దీ వాడకం సహజమే అయినా చిన్నతనంలోనే మందపాటి అద్దాలు వాడాల్సి రావడం ఆలోచించాల్సిన విషయం. ఈ పరిస్థితికి ఎన్నో కారణాలున్నాయి. పిల్లలు మొబైల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టీవిలకు తమ కళ్లు అప్పగించేస్తున్నారు. వీటి తెరల నుంచి వచ్చే నీలపు కాంతి కళ్లను దెబ్బతీస్తుంది. కంటిచూపును తగ్గిస్తుంది. ఆరుబయట ఆడుకోవడం వల్ల సహజ కాంతి అందేది. అది కళ్లను ఆరోగ్యంగా ఉంచేది. ఈ తరం పిల్లలేమో ఇంటికే పరిమితమైపోతున్నారు. దీంతో కళ్ల కండరాలు బలహీనపడిపోతున్నాయి. కళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే ఎ,సి,ఇ విటమిన్లు తప్పనిసరి. ఆకుకూరలు, క్యారెట్, టమాటా, నారింజతోపాటు రకరకాల గింజలు కళ్లకు మంచి చేస్తాయి. ఇప్పటి పిల్లలు జంక్‌ఫుడ్‌కు అలవాటుపడుతున్నారు. కంటిచూపు తగ్గటానికి పోషకాహారం తీసుకోకపోవడం ఒక కారణమే. తక్కువ కాంతిలో, సరిగ్గా కూర్చోకుండా, పుస్తకాలను కళ్లకు బాగా దగ్గరగా పెట్టుకుని చదవడం లాంటి పొరపాట్లు కూడా కళ్ల ఆరోగ్యం మీద దుష్ప్రభావం చూపుతాయి. పిల్లలను స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లకు దూరంగా ఉంచాలి. తప్పనిసరిగా స్క్రీన్ చూడాల్సి వస్తే నియమాన్ని పాటించాలి. ప్రతి 20 నిమిషాలకోసారి 20 అడుగుల దూరాన్ని ఓ 20 సెకండ్లపాటు చూడాలి. పిల్లలు ఆరుబయట ఆడుకునేలా చూడాలి. సహజ కాంతిలో గడిపితే కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కంటికి సంబంధించిన వ్యాయామాలు చేయించాలి. కళ్లను వృత్తాకారంగా తిప్పుతూ ఉండమనాలి. చేతులతో కళ్లను సున్నితంగా మసాజ్ చేయాలి. రోజు 8 నుండి 10 గంటలపాటు నిద్రపోయేలా చూడాలి. మంచి నిద్రతో అలసట తగ్గుతుంది. చూపు చక్కగా ఉంటుంది. ★



## ఆధ్యాత్మికం

# భాగవతం

గంగాతీరాన పరీక్షిన్మహారాజు, కొందరు మహర్షులు ఉండగా పదహారు సంవత్సరాల వయసుగల శుకమహర్షి వచ్చాడు. అందరూ లేచి నిలబడ్డారు. రాజు ఆయన వద్దకు వెళ్లి ఫాలము నేలమోపి భయభక్తులతోడ నమస్కరించాడు. చేతులు జోడించి 'నా భాగ్యమెట్టిదో పావనమూర్తివి, పుణ్యకీర్తివీ వేళకు నీవు వచ్చితివి వివేక విభూషణ! దివ్యభూషణా!' అని అన్నాడు. (ప్రథమ స్కంధము - శ్రీమదాంధ్రభాగవతము). దీన్ని బట్టి మనవారు ఆనాడు దేన్ని గౌరవించారో తెలుస్తుంది. వారు గౌరవించింది వయస్సునా? కాదు. శుకమహర్షి 16 ఏండ్లవాడు, మహర్షులు ఎంతో పెద్దవారు. వారు గౌరవించింది సంపదనా? అధికారాన్నా? కాదు. నందలోనూ, అధికారంలోనూ, వయసులోనూ, అన్నిటిలోనూ శుకుని కంటే పరీక్షిన్మహారాజు ఎంతో ఎక్కువ. అయినా ఆయనే శుకునికి సాష్టాంగ నమస్కారం చేశాడు. చేతులు జోడించి వినయ, విధేయతతో మాట్లాడినాడు. మరి ఆనాడు శుకునిలో ఏమి చూసి అందరూ ఆయన్ను గౌరవించారు? శుకునిలో జ్ఞానం, వైరాగ్యం పుష్కలంగా ఉన్నాయి. దిగంబరంగా ఉన్న శుకుడు మూర్తీభవించిన జ్ఞానం, రూపుదాల్చిన వైరాగ్యం. అన్నిటికంటే విలువైనవి అవే ఒక వ్యక్తికి గౌరవాన్ని తెచ్చిపెట్టేవి ఆ రెండే. అందుకే ఆదిశంకరులవారు 'జ్ఞాన, వైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాందేహి' అంటారు. శ్రీకృష్ణుడు, గౌతమబుద్ధుడు, ఆదిశంకరుడు, వివేకానందుడు వీరందరిలో ప్రకాశించేది జ్ఞానం, రెండూ ఒకటే. ఆ రెండూ ఉంటే వైరాగ్యం ఉండి తీరుతుంది. భాగవతసారాన్ని గ్రహించి, ఆచరించి ధన్యుల మవ్వాలి.

– రాచమడుగు శ్రీనివాసులు

## టొమాటో పాలక్ పాస్తా



**కావలసినవి :** 2 కప్పుల పాస్తా, 2 చెంచాలు ఆలివ్ నూనె, చెంచా చొప్పున మిరియాల పొడి, వెల్లుల్లి తరుగు, కాస్త ఉప్పు, ఒక ఉల్లిపాయ, 2 టొమాటోలు,

50 గ్రాములు మష్రూమ్స్, ఒక పెద్ద కట్ట పాలకూర,

5 చెంచాలు వెజ్ మెయొనేజ్, 2 టేబుల్ స్పూన్లు చీజ్ తురుము తీసుకోవాలి.

**తయారీ :** పాస్తాలో ఉప్పు వేసి ఏడెనిమిది నిమిషాలు ఉడికించంచాలి. అడుగంట కుండా అప్పుడప్పుడు కలియ తిప్పు తుండాలి. దించేసి, నీళ్ల తీసేయాలి. కడాయిలో నూనె వేసి.. సన్న సెగమీద వెల్లుల్లి, ఉల్లి తరుగు వేయించాలి. అర నిమిషం తర్వాత టొమాటో ముక్కలు రెండు నిమిషాల తర్వాత మష్రూమ్ ముక్కలు, పాలకూర తరుగు వేసి.. ఇంకో మూడు నిమిషాలు ఉడికించాలి. చిటికెడు ఉప్పు, పావు చెంచా మిరియాల పొడి వేసి కలపాలి. ఒకసారి కడాయి పక్కకు తీసి. మెయోనేజ్ వేసి కలిపి.. మళ్లీ స్టవ్ మీద పెట్టాలి. నీరు ఇంకిన తర్వాత.. ఉడికించిన పాస్తావేసి కలియతిప్పి దించేయాలి. ఇది రుచిగా ఉండటమే కాదు, మంచి పోషకాహారం కూడా. ★

# ఫర్నిచర్ శుభ్రతకు..

పండ్లు ఆరోగ్య పరిరక్షణకే కాదు, ఇంటి పరిశుభ్రతకు పనిచేస్తాయని తెలుసా! అయితే ఈ మాయ చేసేది మాత్రం వాటి తొక్కలు, సాధారణంగా ఇంటి క్రిమింగ్‌లో రసాయనాల ద్రావణాలను వినియోగించి రకరకాల అలర్జీలకు గురి అవుతుంటాం. ఇవి వాటి నుంచి మనల్ని కాపాడటమే కాదు పర్యావరణానికి హాని కలిగించవు. అదెలాగంటే... నిమ్మ, నారింజ పండ్లలో సిట్రిక్ యాసిడ్ పుష్కలం. దీంతో వీటి తొక్కలు క్లీనింగ్ ఏజెంట్‌గా మురికిని ఇట్టే పోగొడతాయి. ఈ పండ్ల తొక్కలను గుప్పెడు తీసుకుని ఓ ప్లాస్టిక్ పాత్రలో వేయాలి. ఇందులో అయిదారు చెంచాల వైట్ వెనిగర్ వేసి బాగా కలిపి మూతపెట్టాలి. ఈ మిశ్రమాన్ని రెండు లేదా మూడువారాలు నాననివ్వాలి. ఆ తర్వాత దీన్ని వడకట్టి సమపాళ్లలో నీటిని కలిపితే అల్పర్పస్ క్లీనర్ సిద్ధమవుతుంది. దీన్ని స్ప్రేబాటిల్లో నింపి తలుపులు, కిటికీలు, టీపాయి అద్దాలు, పొయ్యి చుట్టుపక్కల దిమ్మ వంటింట్లోని సింక్ వంటివాటిపై స్ప్రేచేసి పదినిమిషాల తర్వాత తుడిస్తే చాలు. మురికి దూరమవుతుంది.

అద్దాలకు ప్రత్యేకం...అరటిపండు తొక్క అద్దాలకు ప్రత్యేక క్లీనర్‌గా పనిచేస్తుంది. మురికి ఉన్న చోట ఈ పండు తొక్క లోపలివైపుతో మృదువుగా రుద్దాలి. ఆ తర్వాత మెత్తని వస్త్రంతో తుడిస్తే చాలు. ఈ తొక్కలోని స్టార్చ్ మురికిని, మచ్చలను తొలగి స్తుంది. మైక్రోవేవ్ అవెన్ ను.. ఇందులో ఆహారపదార్థాల అవశేషాలు ఉండిపోయి వేడికి ఎండిపోతాయి. వాటిని సాధారణంగా క్లీన్ చేయడం కష్టమవుతుంది. గుప్పెడు నిమ్మతొక్కల ముక్కలను నీటిని నింపిన బౌల్లో వేసి అయిదు నిమిషాలపాటు మైక్రోవేవ్లో ఉంచి వేడి చేయాలి. నిమ్మరసం ఆవిరి లోపలంతా వ్యాప్తి చెందుతుంది. అపై మెత్తని వస్త్రంతో తుడిస్తే చాలు ఎండిపోయి అవెన్కి పట్టేసిన పదార్థాలన్నింటినీ తేలికగా తుడిచేయొచ్చు. సోఫా, టీపాయ్, డైనింగ్ టేబుల్‌వంటి చెక్క ఫర్నిచర్‌పై దుమ్ము ఎక్కువగా పేరుకుంటుంది. క్రమేణా ఇది మరకలుగా మారుతుంది. కొన్నిసార్లు జిడ్డు అంటుకుని శుభ్రం చేసినా పోదు. ఇటువంటి మరకలకు పండ్ల తొక్కలు చాలు. నారింజ, నిమ్మ లేదా అరటి పండు తొక్క లోపలివైపుతో మరకలున్న చోట మృదువుగా రుద్ది, ఆపై మెత్తని వస్త్రంతో తుడిస్తే చాలు. ఆ ప్రాంత మంతా క్షణాల్లో శుభ్రపడుతుంది. ★



### మంత్రి కందుల దుర్గేష్ కు అరుదైన అవకాశం

# వియత్నాంలో జరగబోయే బుద్ధుడి అవశేషాల ప్రదర్శన నిర్వహణ బాధ్యత



**విజయవాడ,ఏప్రిల్29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కు కేంద్రం నుండి అరుదైన గౌరవం దక్కింది. వియత్నాంలోని హోచిమిన్హ్ నగరంలో మే 1 నుండి 6వ తేదీ వరకు జరగబోయే బౌద్ధ ధార్మిక కార్యక్రమానికి భారత దేశం నుండి బుద్ధ భగవానుని పవిత్ర అవశేషాలను (కపిల్వాస్తు అవశేషాలు)ప్రదర్శించే నిర్వహణ బాధ్యతలను కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కు అప్పగిస్తూ పీఎంవో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వియత్నాం ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో భారత ప్రభుత్వం దేశంలోని వివిధ ప్రాంతాల్లో భద్రపరిచిన బుద్ధుడి పవిత్ర అస్థికలు, అవశేషాలను పటిష్ట భద్రత నడుమ న్యూఢిల్లీ నుండి భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్(ఇండియన్ ఎయిర్ ఫోర్స్) ఎయిర్ క్రాఫ్ట్) చెందిన ప్రత్యేక హెర్క్యులస్ ఎయిర్ క్రాఫ్ట్ లో తీసుకెళ్లనుంది. బౌద్ధ మత అనుచరులు ఎంతో పవిత్రంగా భావించే బుద్ధ భగవానుడి అవశేషాలను బౌద్ధమత అనుచరుల సందర్శనార్థం వియత్నాంలోని హోచిమిన్హ్ నగరంలో ప్రదర్శించనుంది. తద్వారా వియత్నాం, భారతదేశ బౌద్ధ సమాజాలు, ప్రజల మధ్య దీర్ఘకాలిక, స్నేహపూర్వక సంబంధాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. బౌద్ధ మతం పరిఢవిల్లిన భారత నేల నుండి తీసుకెళ్లిన బుద్ధుడి పవిత్ర అవశేషాలను ప్రదర్శన తర్వాత మంత్రుల బృందం భారత్ తరలించనుంది. పీఎంవో ఆదేశాల మేరకు మంత్రి కందుల దుర్గేష్ బుధవారం సాయంత్రం న్యూఢిల్లీ వెళ్లనున్నారు. సమాచారం తెలిసిన వెంటనే మంత్రి కందుల దుర్గేష్ తనకు లభించిన అవకాశం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

## మే 11నుండి రిషికేశ్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**తిరుమల,ఏప్రిల్ 29ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌జిల్లా రిషికేష్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మేనెల 11వతేదీ నుండి 19వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. అక్కడి ఆంధ్ర ఆశ్రమంలోని స్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా మేనెల 6వతేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. మేనెల 10వతేదీ శనివారం సాయంత్రం అంకురార్పణతో ఉత్సవాలు ఆరంభమవుతాయి. ప్రతిరోజూ ఉదయం 7.30గంటలనుండి 9గంటల వరకు ,తిరిగి సాయంత్రం 7గంటల నుండి 8.30గంటల వరకు వాహనసేవలు జరుగుతాయి. మే11న ఉదయం 10.50గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం పెద్దశేషవాహనం, 12న ఉదయం చిన్నశేషవాహనం,సాయంత్రం హంసవాహనం, 13న ఉదయం సింహవాహనం, రాత్రి ముత్యపుపందిరివాహనం, 14న కల్పవృక్ష, సర్వభూపాలవాహనం, 15న ఉదయం పల్లకీ ఉత్సవం,రాత్రి గరుడవాహనం, 16న హనుమంతవాహనం, గజవాహనం, 17న సూర్యప్రభ,చంద్రప్రభవాహనం, 18న రథోత్సవం, సాయంత్రం స్వామివారి కల్యాణం,రాత్రి అశ్వవాహనం, 19న ఉదయం చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. రాత్రి ధ్వజావరోహణం జరుగుతుంది. బ్రహ్మోత్సవాల సమయంలో టిటిడి హిందూ ధర్మప్రచారపరిషత్, అన్నమాచార్యప్రాజెక్టు, దాససాహిత్యప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక,భక్తి సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు ఉంటాయి,

## బంగారం స్వచ్ఛతపై హాల్‌మార్క్ : బిఐఎస్ మార్గనిర్దేశం

**విజయవాడ, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** సంప్రదాయం, నమ్మకానికి చిహ్నామైన బంగారం మన ప్రజలు సంపదగా కూడా పరిగణిస్తారని ఈ అక్షయ తృతయ రోజున స్వచ్ఛమైన బంగారం కొనుగోలు చేయాలని విజయవాడ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ బ్రాంచ్ హెడ్ సైంటిస్ట్ఎఫ్/ సీనియర్ డైరెక్టర్ అండ్ హెడ్ ఎంఎజె వినోద్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. బిఐఎస్ హాల్‌మార్కింగ్ బంగారం స్వచ్ఛతపై హామీ ఇస్తుందన్నారు. బిఐఎస్ హాల్‌మార్కింగ్ పథకం వినియోగదారులను అశుద్ధ లేదా కల్తీ బంగారాన్ని కొనుగోలు చేయకుండా రక్షిస్తుందన్నారు. తయారీదారులు, ఆభరణాల వ్యాపారులు భారతీయ చక్కదనం యొక్క ప్రమాణాలకు కట్టుబడి వుండాలని, మార్కెట్ అంతటా నాణ్యతను నిర్ధారించాలని ఇది నిర్దేశిస్తుందన్నారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎంఎఎన్ఎకెఆన్‌లైన్.ఇన్ ద్వారా ఉచితంగా నమోదు చేసుకోవాలన్నారు. బిఐఎస్ కేర్ యాప్ ద్వారా సులభంగా స్వచ్ఛమైన బంగారాన్ని గుర్తించవచ్చన్నారు. బంగారం స్వచ్ఛత, ధృవీకరణ గురించి అన్ని వివరాలను బిఐఎస్ కేర్ యాప్ ద్వారా తెలుసుకోవాలని, ఫిర్యాదులు చేయవచ్చన్నారు.




### విజయవాడ వాసి సొంతమైన

## బురుండీ కరెన్సీ నోటు!

**విజయవాడ,ఏప్రిల్ 29,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆఫ్రికా ఖండం లోని బురుండీ దేశం 40 సెంటీమీటర్ల పొడవు,29 సెంటీమీటర్ల వెడల్పుతో ప్రపంచలోనే అతి పెద్ద నోట్లను ముద్రించింది. 10,000 ఫ్రాంక్‌ల ముఖ విలువ కల్గిన ఈ నోట్లను కేవలం వెయ్యి మాత్రమే విడుదల చేసింది. వాటిలో ఒక నోటును విజయవాడ నగరానికి చెందిన సీసీఈ శ్రీధర్స్ సంస్థ అధినేత కొమ్మూరి శ్రీధర్ స్వంతం చేసుకున్నారు. ఆ వివరాలను ఆయన సోమవారం తెలిపారు. బురుండీ దేశ ముఖ్య అదాయ వనరుగా ఉన్న వన్యప్రాణులు...వాటి సంరక్షణ కేంద్రాలు,పర్యాటక ప్రాంతాలు,అక్కడి పార్కులను పునరుద్ధరించడానికి ఈ నోట్ల బుకింగ్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని వినియోగించనున్నారు.

## సిబిటి విధానంలో రైల్వే గ్రూప్-బి పదోన్నతి పరీక్షలు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 29,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల్లోని దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో వివిధ విభాగాలలో రానున్న రెండున్నర యేళ్లకు ఏర్పడే 6,584ఖాళీలను అర్హులైన అభ్యర్థులను గ్రూప్-బి గెజిటెడ్ హోదాలో 70శాతం కోటాలో భర్తీ చేసేందుకు తొలిసారిగా వ్రాత పరీక్షలను సిబిటి విధానంలో నిర్వహించనున్నట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. అకౌంట్స్ విభాగంలో 175ఏఎఫ్ఏ,ఆపరేటింగ్‌లో 1,438ఏఓఎం,కమర్షియల్‌లో 298ఏసిఎం, ఎలక్ట్రికల్‌లో 1,244ఏఇఇ, మెటీరియల్ మేనేజ్‌మెంట్‌లో 128ఏఎంఎం,పర్సనల్‌లో 377ఏపిఓ,మెకానికల్‌లో 1,329ఏఎంఇ, ఎస్అండ్‌టిలో 388ఏఎస్‌టీఇ,ఇంజనీరింగ్‌లో 1,197ఏఇఎన్ మొత్తం 6,584గ్రూప్-బి పోస్టులను భర్తీ చేసేందుకు ఎలాంటి అక్రమాలకు తావులేకుండా నిర్దిష్టమైన పద్దతిలో పక్కా పకడ్బందీగా నిర్వహించేందుకు బరోడాలోని భారతీయ రైల్వే జాతీయ అకాడమీ డైరెక్టర్ జనరల్ నియమావళి ప్రకారం ఆర్ఆర్‌బి తరహాలో, సిబిటి పద్దతిలో ఈ పరీక్షలకు మే 4,18వ తేదీల్లో రెండు విడతలు-రెండు షిఫ్టులలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

# ఏడేళ్ల విరామం తరువాత స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల పునఃప్రారంభానికి సన్నాహాలు

### ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ - ఈ విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్లకు సన్నాహాలు

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 29 ప్రభాతవార్త** ఏడేళ్ళ సుధీర్ఘ విరామం తరువాత ఈ విద్యాసంవత్సరం నుంచి పునఃప్రారంభానికి సిద్ధం చేసినట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తెలిపారు.మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మానస పుత్రికగా ప్రసిద్ది చెందిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల 2009 వరకు ఎంతో సమర్థవంతంగా సాగింది. రాష్ట్రంలో కార్పొరేట్ ఇంజనీరింగ్ కళాశాల హవా రాక ముందు నెంబర్‌వన్‌గా మెలిగిన కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఈ కళాశాలకు ఉన్నని సదుపాయాలు మరే ప్రైవేటు కళాశాలలో లేదు. అద్భుతమైన ల్యాబ్‌లు, గ్రంధాలయం భవనాలు ఏర్పరచుకున్నారు. కానీ 2009 తరువాత కళాశాలలో పని చేసే ఉద్యోగుల మద్య సమన్వయం లోపంతో జవాబుదారి తనం లేకపోవటంతో పరిపాలన అధ్వాన్నంగా మారింది. 2019కి మూత పడింది.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గెలిచిన ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి పట్టుబట్టి,విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ నుపలుమార్లు జోరిగలా వెంటపడి పునఃప్రారంభానికి అనుమతి సాధించారు.

**పరిపాలన గాడిలో: విద్యాసంస్థలకు చేయూత:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పాలనను గాడిలో పెడుతూ మూత పడ్డ విద్యాసంస్థలను తెరవటం అలాగే ఖాయిలా పడ్డ ప్రభుత్వాసుపత్రికి సదుపాయాల చికిత్స జరపటానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు.పంచాయతీరాజ్ అతిధి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో 1999లో తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి నియోజకవర్గంలోని నిరుపేదలకు అందుబాటులో సాంకేతిక విద్యను అందించుటకు దేవాదాయశాఖ పరిధిలో స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసారన్నారు.అయితే 2019 నుంచి ఈ కళాశాల పర్యవేక్షణ కొరవడి మూతపడిందన్నారు. తాను ఎన్నికల సమయంలో పునః ప్రారంభానికి భరోసా ఇచ్చానన్నారు.ఈ మేరకు పలు మార్లు విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌తోనూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తెచ్చామని ఈ కళాశాలను అనంతపురంజెయన్‌టియుకు అప్పగించుటకు నిర్ణయించామన్నారు.

**ఒరెండేళ్ళ పాటు దేవస్థానం ఆర్థిక సహాయం:** శ్రీకాళహస్తి దేవస్థానంకు అనుబంధంగా నిర్వహించే స్కిట్ఇ ంజనీరింగ్ కళాశాల పునఃప్రారంభానికి రెండేళ్లపాటు దేవస్థానం ఆర్థిక సహాయం చేయటానికి ప్రత్యేక కమిటి మే 4వ తేదీ సమావేశం అయి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 15 నుంచి కార్యక్రమాలను ప్రారంభించి అడ్మిషన్లను చేపట్టుటకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను అనంతపురం




స్కిట్ఇంజనీరింగ్ కళాశాల దృశ్యం

జెయన్‌టియుకు లీజుకు ఇవ్వటానికి ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ఎంఎల్ఏ వివరించారు.పలుమార్లు జెయన్‌టియు,ప్రభుత్వ స్థాయిలో సమావేశాలను నిర్వహించామన్నారు.ఆడ్మిషన్లు బాగా జరిగి ఆర్థిక పరిపుష్టి కల్గిన తరువాత దేవాదాయశాఖ ఎంత చెల్లించిందో ఆ మొత్తాలను దశల వారికి తిరిగి చెల్లించే ఒప్పందంతో ఆర్థిక సహాయం చేస్తున్నట్లు వివరించారు. అన్ని అంశాలు నరేంద్రమోడీ పర్యటన తరువాత ఖరారు అవుతాయని వివరించారు. స్కిట్ పునఃప్రారంభానికి మంత్రి నారాలోకేష్ సహాకారం మరువరానిదన్నారు. ఈ కళాశాలకు కోట్ల విలువ చేసే 50ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పగించామన్నారు. అంతేకాక ఈ కళాశాల భవనాలకు కోట్లు వెచ్చించామన్నారు.కానీ ఇక్కడ కొందరు ఉన్నత స్థాయి ఉద్యోగులు రాజకీయం చేయటంతో కళాశాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అయితే ప్రస్తుతం మంత్రి లోకేష్ దేవాదాయశాఖ చొరవతో జెయన్‌టియుకు బాధ్యతలు అప్పగించనున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు ఇదో శుభ వార్త అని ఇక్కడ చదువుకునే విద్యార్థులకు ఉద్యోగవకాశాలకు శ్రీకాళహస్తిలో ఎన్నో పరిశ్రమలు ఉన్నాయని ఇంకా వస్తాయనిసుధీర్‌రెడ్డి వివరించారు.ఈ సమావేశంలో చెంచయ్యనాయుడు, విజయకుమార్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయండి

## మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేసిన భారత్ బచావో ప్రతినిధులు

**హైదరాబాద్, ఏప్రిల్ 29 ,ప్రభాతవార్త :**తెలంగాణ చత్తీస్గడ్ సరిహద్దు కర్రెగుటల్లో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని నిలువరించేలా చొరవ చూపాలని మంత్రి సీతక్కకు భారత్ బచావో సంస్థ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.మంగళవారం ఈ మేరకు వారు ప్రజాభవన్‌లో సీతక్కను కలిసి విజ్ఞప్తి చేశారు.వేల సంఖ్యలో కేంద్ర బలగాలు కర్రెగుట్ట ప్రాంతాల్లో సంచరిస్తున్నటంతో ఆదివాసీలు భయాందోళనకు గురవుతున్నారని మంత్రికి తెలిపారు. ఆపరేషన్ కగారును తక్షణం నిలిపి వేయకపోతే పెద్దఎత్తున ప్రాణనష్టం జరిగే అవకాశంఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.వారి విజ్ఞప్తికి సానులకూంగా స్పందించిన సీతక్క ఆదివాసీలప్రయోజనాల దృష్టిలో ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయాలని,శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగాఉండాలన్నారు.తెలంగాణ చత్తీస్గడ్ సరిహద్దుల్లో శాంతియుతవాతావరణం నెలకొనాలి మధ్యభారతంలోని ఆదివాసిప్రాంతాలు రాజ్యాంగంలోని షెడ్యూల్5 పరిధిలోకి వస్తాయని,అక్కడ ఆదివాసీలకు ప్రత్యేక హక్కులు ఉంటాయన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో ప్రత్యేక పరిపాలన విధానాలు ఉంటాయని,అందుకే ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి వారి శాంతియుత జీవన విధానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు.ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలని,బల ప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలనీ ఆదివాసి బిడ్డగా కోరుకుంటున్నా అన్నారు.ఆదివాసీల హక్కులను ఎవరూ కాలరాయవద్దు ఆ జాతి బిడ్డగా ఆది వాసులకు అండగా నిలుస్తానన్నారు. ఆపరేషన్ కగార్ తో ఆదివాసీలు తీవ్రభయాం దోళనతో ఉన్నారని,

మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించాలన్నారు.రెండు వైపుల ప్రాణ నష్ట నివారణకు శాంతి చర్చలు మార్గం చూపుతాయిని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## యుఎస్ నుంచి 'కన్నప్ప' భారీ ప్రమోషన్స్ మొదలుపెట్టనున్న విష్ణు

డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీం ప్రాజెక్టుగా కన్నప్ప సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కన్నప్పపై అంచనాలు భారీ స్థాయిలో నెలకొన్నాయి. కన్నప్ప నుంచి వచ్చిన పోస్టర్లు, టీజర్లు సినిమాపై అంచనాలు పెంచాయి. ఈ చిత్రం నుంచి రిలీజయిన పాటలు అయితే కన్నప్పపై పాజిటివ్ వైబ్ క్రియేట్ చేశాయి. కన్నప్ప చిత్రాన్ని జూన్ 27న విడుదల చేయబోతున్నట్టు ఇటీవల ప్రకటించారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మోహన్ బాబు కన్నప్ప సినిమా నిర్మించారు. ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో మోహన్ బాబు, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, ప్రభాస్, కాజల్, మధుబాల.. వంటి భారీ తారాగణం కీలక పాత్రల్లో నటించారు. జూన్ 27న కన్నప్ప సినిమా రిలీజ్ అవుతున్న నేపథ్యంలో విష్ణు మంచు కన్నప్ప మూవ్‌మెంట్‌ని మే 8 నుంచి అమెరికాలో మొదలుపెట్టనున్నారు. గ్రాండ్‌గా ఈ సినిమా గ్లోబల్ ప్రమోషన్స్‌ని చేయనున్నారు. ఎంతగానో ఎదురుచూస్తున్న భారీ చిత్రం కన్నప్ప రిలీజ్‌కి ముందే ప్రపంచవ్యాప్తంగా సరికొత్త చరిత్ర సృష్టించనుంది. అమెరికాలోని న్యూ జెర్సీలో కన్నప్ప రోడ్ షోతో మొదలుపెట్టి ఆ తర్వాత డల్లాస్, లాస్ ఏంజిల్స్‌లో భారీ ఈవెంట్స్ నిర్వహించ నున్నారు. ఈ క్రమంలో సినిమాలోని ఎక్స్‌క్లూజివ్ ఫుటేజ్, మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ వర్కింగ్‌విజువల్స్ కొంతమంది సెలెక్టెడ్‌ఆడియన్స్‌కి చూపించనున్నారు. కన్నప్ప సినిమాని ఇండియాతో పాటు అమెరికాలో కూడా భారీగా రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు విష్ణు మంచు. ఇప్పటికే కన్నప్ప సినిమా విజువల్స్, సినిమాలోని భక్తిభావాన్ని ప్రేక్షకులు గొప్పగా ఊహించుకుంటున్నారు. ఈ కన్నప్ప మూవ్ మెంట్‌తో విష్ణు మంచు కేవలం సినిమా ప్రమోషన్స్ మాత్రమే చేయడం కాకుండా గ్లోబల్ ఆడియన్స్‌కి గొప్ప సినిమాటిక్ అనుభవాన్ని అందించడానికి సిద్ధమవు తున్నారు. కన్నప్ప ప్రయాణం మే 8 నుంచి ప్రారంభం కానుంది. ఒక కొత్త భక్తి భావం, కథ, సినిమాటిక్ అనుభవాన్ని ప్రేక్షకులకు చూపించనుంది.



## జూన్‌లో 'ఎన్టీఆర్-నీల్'

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌కు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన ప్రస్తుతం కెజియఫ్, సలార్ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన సెన్సేషనల్ ఫిల్మ్ మేకర్ ప్రశాంత్ నీల్‌తో సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్‌నీల్ అనే వర్కింగ్ టైటిల్‌తో కొన్నిరోజుల ముందు సినిమాను ప్రారంభించారు. అనౌన్స్‌మెంట్ నుంచి సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఎక్స్‌పెక్టేషన్స్‌ను మించేలా మేకర్స్ భారీ బడ్జెట్‌తో అన్‌కాం ప్రమైజ్డ్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రోజు రోజుకీ క్రేజీ కాంబోలో తెరకెక్కుతోన్న ఎన్టీఆర్‌నీల్ మూవీపై అంచనాలు పెరుగుతూ వస్తున్నాయి. అభిమానులు, ప్రేక్షకులు ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మేకర్స్ ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతోన్న భారీ పాన్ ఇండియా యాక్షన్ చిత్రాన్ని వరల్డ్ వైడ్‌గా జూన్ 25, 2026లో విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా సినిమా అందరినీ అలరించనుం ది. ఎన్టీఆర్‌నీల్ చిత్రంలో తారక్‌ను పవర్ ఫుల్ పాత్రలో ప్రశాంత్‌నీల్ ఎలా ప్రెజంట్ చేస్తాడో చూడాలని అందరూ ఎంతో ఎగ్జయిట్‌మెంట్‌తో వెయిట్ చేస్తున్నారు. గూజ్‌బంప్స్ తెప్పించే యాక్షన్ సన్నివేశాలు, గ్రిప్పింగ్ స్టోరీతో రానున్న ఈ సినిమా కోసం ఫ్యాన్స్, ఆడియెన్స్ ఎంతో ఆసక్తితో వెయిట్ చేస్తున్నారు. ఈ ఎగ్జయిట్‌మెంట్‌ను పెంచేలా మేకర్స్ ఓ సరైన విడుదల తేదిని ఎంచుకోవటం విశేషం. బ్లాక్ బస్టర్ చిత్రాలను తెరకెక్కించటంలో ప్రశాంత్ నీల్‌కు ఓ ప్రత్యేకమైన శైలి ఉంది. తనదైన స్టైల్లో ఎన్టీఆర్‌ను ఇప్పటి వరకు ఎవరూ వెండితెరపై చూపించని విధంగా సరికొత్త మాస్ అవతార్‌లో నీల్ ఆవిష్కరించనున్నారు. సినీ ఇండస్ట్రీలోనే ఎన్టీఆర్, నీల్ కాంబోలో వస్తోన్న ఈ చిత్రం సరికొత్త బెంచ్ మార్క్‌ను క్రియేట్ చేస్తుందనటంలో సందేహం లేదు.






## 'సింగిల్' ట్రైలర్ లాంచ్

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో హోల్సమ్ ఎంటర్‌టైనర్ సింగిల్‌తో అలరించబోతున్నారు. ఈ చిత్రంలో కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా నటించారు, వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. మేకర్స్



ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ట్రైలర్ ఒక హ్యూమరస్ నోట్‌తో ప్రారంభమవుతుంది. శ్రీ విష్ణు ఒక అమ్మాయి మనసుని గెలుచుకోవడానికి మూడు గోల్డెన్ టిప్స్ ఇస్తాడు. అమ్మాయిలు గుడ్ బాయ్స్‌ని ఇష్టపడతారని చెబుతాడు. తరువాత బ్యాడ్ బాయ్ యాటిట్యూడ్ వస్తుంది. చివరగా, టిప్ నంబర్ త్రీ మాస్ వాయిస్ కస్సింగ్ వర్డ్స్, ఆల్ఫా మేల్ డామినెన్స్. శ్రీవిష్ణు పూర్వ (కేతిక శర్మ) అనే అమ్మాయిని ఇష్టపడినప్పుడు, మరొక అమ్మాయి హరిణి (ఇవానా) అతనిపై ప్రేమ చూపిస్తుంది, ఇది ట్రై యాంగిల్ లవ్ స్టోరీకి స్టేజ్‌ని సెట్ చేస్తోంది. ట్రైలర్ హిలేరియస్ ఎంటర్‌టైన్మెంట్‌ని ప్రామిస్ చేస్తోంది. కామెడీ, రొమాన్స్, లైటర్ డ్రామా బ్లెండ్‌ని అందిస్తోంది. ఈ మూవీ యూత్‌కు, ముఖ్యంగా సింగిల్స్, కుటుంబ ప్రేక్షకులకు సమానంగా నచ్చేలా చూసుకున్నాడు డైరెక్టర్ కార్తీక్ రాజు. శ్రీ విష్ణు తనను కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ అని ఎందుకు పరిగణిస్తారో మరోసారి నిరూపించాడు. అతని కామిక్ టైమింగ్ అదిరిపోయింది. కేతిక శర్మ, ఇవానా పాత్రలు ఆకట్టుకున్నాయి. వెన్నెల కిషోర్ తన అద్భుతమైన డైలాగ్ డెలివరీతో హ్యూమర్‌ని ఎలివేట్ చేశాడు. ఆర్. వేల్‌రాజ్ సినిమాటోగ్రఫీ చిత్రానికి రిచ్ విజువల్స్‌ని అందించగా, విశాల్ చంద్రశేఖర్ సంగీతం హ్యూమర్ టోన్ పెంచుతుంది. ప్రవీణ్ కెఎల్ ఎడిటింగ్ ఎడిటర్ కాగా, చంద్రిక గొర్రెపాటి ఆర్ట్ డైరెక్టర్. గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్ నిర్మాణ విలువలు అత్యున్నత స్థాయిలో ఉన్నాయి. అన్ లిమిటెడ్ ఎంటర్ టైన్మెంట్‌తో వేసవి విందును అందించేలా ట్రైలర్ హామీ ఇవ్వడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. సింగిల్ మే 9న థియేటర్లలోకి రానుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. సీరియస్, ఎమోషనల్ లవ్ స్టోరీగా తీసిన తండేల్ చాలా అద్భుతమైన విజయం సాధించింది. ఆ సినిమాకి విజయాన్ని అందించిన అందరికీ ధన్యవాదాలు. ఆ సినిమా జరుగుతున్నప్పుడే సరదాగా నవ్వుకునే ఒక కథ చేయాలని విద్యాకి చెప్పాను. అప్పుడు భాను రియాజ్ సింగిల్ కథని తీసుకొచ్చారు.

## పహల్గాం ఉగ్రదాడి ఎంతో బాధించింది: నభా నటేష్

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి తన మనసుకు ఎంతో బాధ కలిగించిందని చెప్పింది హీరోయిన్ నభా నటేష్. ఉగ్రదాడులు హేయమైన చర్య అని దేశమంతా బాధితులకు సంఘీభావంగా ఉంటామని నభా పేర్కొంది. అందమైన పహల్గాంలో తాను షూటింగ్ చేశానని, అందమైన అహ్లాదకరమైన ప్రదేశమని నభా నటేష్ తెలిపింది. పహల్గాంలో షూటింగ్ చేసిన జ్ఞాపకాలను ఆమె షేర్ చేసుకుంది. నభా నటేష్ స్పందిస్తూ పహల్గాం బ్యూటిఫుల్ ప్లేస్. అక్కడ నేను నటించిన డార్లింగ్ మూవీ షూటింగ్ చేశాం. చుట్టూ 5 కిలోమీటర్ల మేర అందమైన



లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపాం. భూతల స్వర్గమైన పహల్గాంలో ఉగ్రదాడి జరపడం హేయమైన చర్య. బాధితుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఇలాంటి దాడులు జరిగాక ఫిలింమేకర్స్ పహల్గాం వెళ్లాలంటే ఆలోచిస్తారు. స్థానిక ప్రజలు చాలా మంచివారు, మా టీమ్‌కు స్నేహితులుగా మారిపోయారు. పహల్గాం దాడి ఘటన గురించి వినగానే నాకు అక్కడ షూటింగ్‌చేసిన రోజులన్నీ కళ్లముందు తిరిగాయని చెప్పింది.

## 'స్వాతిముత్యం' సాదర సత్కార వేడుక!!

తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ సౌజన్యంతో ఫిల్మ్ జర్నలిస్ట్ అండ్ అనలిస్ట్ ధీరజ అప్పాజీ సారథ్యంలో, స్వాతిముత్యం సినీ సాంస్కృతిక సాహిత్య సామాజిక సేవాసంస్థ సారథ్యంలో సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టులు ఫోటో జర్నలిస్టులు పి.ఆర్.ఒ.ల సత్కార కార్యక్రమం సందడిగా జరిగింది. హైదరాబాద్‌లోని తెలుగు నిర్మాతల మండలి సమావేశ మందిరంలో జరిగిన ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా మురళీమోహన్, శ్రీమతి సురభి వాణి దేవి, ప్రముఖ నిర్మాత, ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్.ఎన్. సి.సి) అధ్యక్షులు కె.ఎస్. రామారావు, తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షులు కె.ఎల్. దామోదర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్, భాస్కరభట్ల, మోహన్ గోటేటి, పసుమర్తి నాగేంద్రకుమార్, రామ నారా యణ రాజు.కె., ఈతరం సూర్య ప్రకాష్ రెడ్డి, వి.ఎస్.కేశవరావు, వల్లూరు రాఘవరావు, మామిడిపల్లి గిరిధర్, రెంటాల జయదేవ, బత్తుల ప్రసాద్, నాగభైరు సుబ్బారావు, వడ్డి ఓం ప్రకాశ్ నారాయణ, ప్రసన్న ప్రదీప్, రమణ జె.పి.వి., లంక రాంబాబువర్మ, ఫోటో జర్నలిస్టులు రామసాయి రమేష్, ఇటికాల జనార్దన్ రెడ్డి, గోపిశెట్టి శ్రీనివాస్, వర్కింగ్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు.. కార్యదర్శి ఎమ్.ఎన్. భూషణ్, వాసు సజ్జా, ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సురేష్ కొండేటి, ఫిల్మ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.జె.రాంబాబు చిరు సత్కారం స్వీకరించారు. ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రముఖ ఫిల్మ్ జర్నలిస్టులు హేమసుందర్, యజ్ఞమూర్తి, ఆర్.డి.ఎస్.ప్రకాష్, రాఘవేంద్రరెడ్డి, పులగం చిన్నారాయణ, ఫిల్మ్ జర్నలిస్ట్ టర్న్డ్ డైరెక్టర్ నాగు, ఎమ్.డి.అబ్దుల్, శివ మల్లాల, కేశవ, రమణ బాబు, శ్రీపాల్, లక్ష్మీ పెండ్యాల, కార్టూనిస్ట్ రైటర్ డైరెక్టర్ గాంధి మనోహర్, చిత్రాంజలి అధినేత జె.పి., దర్శకులు సత్తిబాబు, బిజినెస్ కో ఆర్డినేటర్ నారాయణ, కోడైరెక్టర్ రేణుక తదితరులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో మిమిక్రి లెజండ్ రమేష్ తనదైన శైలిలో చేసిన ధ్వన్యనుకరణ, విసిరిన ఛలోక్తులు ఆహుతుల పొట్టలు చెక్కలు



చేశాయి. తాను ఫిల్మ్ ఇండస్ట్రీ పట్ల ఆకర్షితుడ్ని కావడానికి పరోక్ష కారకులైన సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టులకు ఉడతా భక్తిగా చిరు సత్కారం చేసే అవకాశం లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన కార్యక్రమ నిర్వాహకుడు ధీరజ అప్పాజీ... కార్యక్రమ నిర్వహణకు వెన్నుదన్నుగా నిలిచిన శ్రీమతి గిడుగు కాంతికృష్ణ తదితరులు.

## 'దీక్ష' షూటింగ్ పూర్తి

ఆర్ కె ఫిలిమ్స్, సిగ్ధ క్రియేషన్స్ బ్యానర్లో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్, పి.అశోకుమార్ నిర్మాతలుగా, ఆర్ కె గౌడ్ దర్శకత్వంలో కిరణ్, ఆలేఖ్యరెడ్డి హీరో హీరోయిన్స్‌గా ఆక్స ఖాన్, తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ ప్రధాన పాత్రలలో నటించిన చిత్రం దీక్ష. లవ్ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ నేటితో హైదరాబాద్‌లో పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దర్శక నిర్మాత డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు అనే పాయింట్‌ను ఇతివృత్తంగా తీసుకుని లవ్ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాము. చాలా అందమైన లొకేషన్స్‌లో, చిత్రీకరణ పూర్తి చేసుకుంది. పాటలు అద్భుతంగా వచ్చాయి. మా బ్యానర్‌కు మంచి పేరు తెచ్చే చిత్రం అవుతుంది. లవ్ యాక్షన్ తో పాటు మైథలాజికల్ ను జోడించి నిర్మిస్తున్న ఈ చిత్రంలో హీరో కిరణ్ భీముడు పాత్రలో అద్భుతమైన నటన కనపరచాడు. మా చిత్రం ద్వారా హీరో కిరణ్‌కి మంచి పేరు, గుర్తింపు వస్తాయి. ఆక్స ఖాన్ స్పెషల్ సాంగ్‌లో, తనదైన శైలిలో డాన్స్ ఆదరగొట్టింది. మా చిత్రానికి పనిచేసిన సాంకేతిక నిపుణులు అందరూ ఎంతో దీక్షతో పనిచేసారు. సంగీత దర్శకుడు రాజ్ కిరణ్ అద్భుతమైన 5 పాటలు అందించారు. మధుప్రియ తదితర ముఖ్య గాయనీ గాయకులు తమ స్వరాన్ని అందించారు. ఆర్ ఆర్ ఈ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది. ఈ చిత్రంలో 5ఫైట్స్ ఉన్నాయి. రోహిత్ శర్మను విలన్ క్యారెక్టర్‌తో ఇంట్రడ్యూస్ చేస్తున్నాము. దీక్ష చిత్రం మా బ్యానర్‌కు సూపర్ హిట్ అందించే చిత్రం అవుతుంది. త్వరలోనే ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో మే నెలలో రిలీజ్ చెయ్యడానికి ప్లాన్ చేస్తున్నాము అన్నారు. నటి ఆక్స ఖాన్ మాట్లాడుతూ, దీక్ష సినిమా నా కెరీర్‌ను మలువు తిప్పే చిత్రం అవుతుంది. అంత బాగావచ్చింది మూవీ. నా తోటి నటీనటులందరూ బాగా నటించారు. ఆర్కే ఫిలిమ్స్ బ్యానర్‌లో నటించడం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. మా చిత్రాన్ని ప్రేక్షకులందరు చూసి విజయవంతం చెయ్యాలని కోరుతున్నాను అన్నారు. నటి తులసి మాట్లా డుతూ, దీక్ష సినిమాలో మంచి క్యారెక్టర్ చేశాను. అవకాశం ఇచ్చిన దర్శకులు ఆర్కే గౌడ్‌కి కృతజ్ఞతలు అన్నారు.



## 'నిలవే' టీజర్ విడుదల


సినీ ఇండస్ట్రీలో ఎవరి పరిచయం లేదు.. వారెవరో ఎవరికీ తెలియదు. అయితే సినిమా అంటే చెప్పలేనంత ప్రేమ, అభిరుచి, ఉత్సాహం అదే వారిని ముందడుగు వేసేలా చేసింది. తెలుగు సినిమాలో అతి పెద్ద మ్యూజికల్ డ్రామా రూపొందించేలా చేసింది. ఆ చిత్రమే నిలవే. సౌమిత్ రావు, శ్రేయాసి సేన్ జంటగా నటించిన ఈ చిత్రానికి సౌమిత్ రావు మరియు సాయి వెన్నం దర్శకత్వం వహించారు. శివీజు ఆర్ట్స్ వ్యూ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తాహెర్ సినీ టెక్‌తో సౌజన్యంతో సాయి వెన్నం, గిరిధర్ రావు పోలాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా



టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇందులో అర్జున్ (సౌమిత్ రావు) అనే వ్యక్తి, తన ఒంటరి జీవితాన్ని కష్టంగా గడుపుతూ ప్రేమ కోసం తాపత్రయ పడుతూ ఉంటాడు. అలాంటి అతని జీవితంలోకి.. శ్రేయాసి సేన్.. ప్రవేశించి అతని జీవితంలో కొత్త కాంతిని తీసుకొస్తుంది. ఇక టీజర్ మొత్తం.. ఆ అమ్మాయి కోసం అతను ఎంత దూరమైనా వెళ్తారు అనేదాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. నిలవే టీజర్ నిడివి కేవలం 155 సెకండ్లు మాత్రమే.. అయినప్పటికీ.. ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకుంది అనడంలో సందేహం లేదు. అద్భుతమైన విజువల్స్.. మనసును తాకే సంగీతంతో, ప్రతి ఫ్రేమ్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా.. ఈ చిత్రంపై అంచనాలను కూడా పెంచేసింది. సౌమిత్ రావు, శ్రేయాసి సేన్ కెమిస్ట్రీ ఈ సినిమాకి హైలైట్‌గా నిలబడింది అని టీషర్ట్ చూస్తేనే అర్థమవుతుంది. వీరితో పాటు హర్ష చెముడు, సుప్రియా ఐసోలా, రూపేష్ మారాపు, జీవన్ కుమార్, గురురాజ్, సిద్ధార్థ్ గోల్లపూడి, అనాల సుశ్మిత మరియు ఇతరులు సహాయక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకి కళ్లాన్ నాయక్ అందించిన సంగీతం మరింత హైలైట్‌గా నిలవనుంది. వెంకట్ కొణకండ్ల, సంజనా కృష్ణ ఈ చిత్రానికి సహ నిర్మాతలు. నటీనటులు: సౌమిత్ రావు, శ్రేయాసి సేన్, హర్ష చేముడు, సుప్రియా ఐసోలా, రూపేష్ మారాపు, జీవన్ కుమార్, గురురాజ్, సిద్ధార్థ్ గోల్లపూడి, అనాల సుశ్మిత మరియు ఇతరులు.

## 'రౌడీ వేర్'లో స్టార్ హీరో సూర్య

హీరో విజయ్ దేవరకొండ ఫ్యాషన్ బ్రాండ్ రౌడీ వేర్ సామాన్యుల నుంచి స్టార్ హీరోల దాకా అందరికీ ఫేవరేట్ క్లాత్ బ్రాండ్‌గా మారుతోంది. స్టార్ హీరో సూర్య రౌడీవేర్ పోలో టీ షర్ట్స్‌లు ధరించి స్టైలిష్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్నారు. రౌడీ వేర్ టీ షర్ట్స్‌తో సూర్య తన కొత్త సినిమా రెట్రో ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు. ఈ ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సూర్య, విజయ్ దేవరకొండ మధ్య మంచి అనుబంధం ఉంది. ఇటీవల రెట్రో ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా విజయ్ దేవరకొండ పాల్గొని మూవీ సూపర్ హిట్ కావాలని విష్ చేశారు. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహించిన రెట్రో మూవీ మే 1న థియేటర్స్‌లోకి రాబోతోంది. సితార డిస్ట్రిబ్యూషన్ ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తోంది.



## నేటితో ముగియనున్న టెట్ దరఖాస్తు గడువు

### ఇప్పటి వరకు 1,34,011 దరఖాస్తులు

**జూన్ 15నుంచి 30 వరకు పరీక్షలు, జులై 22న ఫలితాలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) దరఖాస్తుల గడువు నేటి(బుధవారం- ఏప్రిల్30)తో ముగియనుంది. ఈ నెల 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం వరకు 1,34,011 దరఖాస్తులు వచ్చినట్టు టెట్-2025 ఛైర్‌పర్సన్, పాఠశాల విద్య డైరెక్టర్ ఈవి నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 1,35,745 మంది ఫీజు చెల్లించగా వారిలో 1,34,011 మంది తమ దరఖాస్తులను అప్‌లోడ్ చేశారు. పేపర్-1కి 38,577 మంది ఫీజు చెల్లించగా వారిలో 38,068 మంది దరఖాస్తు చేశారు. పేపర్-2కి 83,459 మంది ఫీజు పే చేయగా అందులో 82,433 మంది దరఖాస్తు చేశారు. ఇక రెండు పేపర్లకీ 13,709 మంది ఫీజు చెల్లిస్తే వారిలో 13,510 మంది దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. టెట్ నోటిఫికేషన్‌ను ఈ నెల 11న ప్రభుత్వం జారీ చేయగా 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించడం ప్రారంభించారు. నేటితో గడువు ముగియనుంది. పేపర్-1, పేపర్-2కి రూ.750గా పరీక్ష ఫీజును నిర్ణయించారు. రెండు పేపర్లు రాయాలనుకునే వారు రూ. 1000 చెల్లించాల్సి ఉంటుంది. జూన్ 15నుంచి 30 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సిబిటి) విధానంలో పరీక్షలను నిర్వహించనున్నారు. ఎడిట్ ఆప్షన్ ఉన్నందున ఇప్పటి వరకు పేపర్-1లో 1256మంది, పేపర్-2లో 2305 మంది, రెండు పేపర్లకి 477 మంది కలిపి మొత్తంగా 4038 మంది తమ దరఖాస్తుల్లో తప్పులను సరి చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. జులై 22న ఫలితాలను విడుదల చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో వెల్లడించారు.

## నేటితో ముగియనున్న ఎల్ఆర్ఎస్ గడువు

### సాంకేతిక సమస్యలతో ఆందోళన చెందుతున్న దరఖాస్తు దారులు

**గడువు పెంచేది లేదని స్పష్టం చేసిన రెవెన్యూ మంత్రి**

**హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ముఖ్య విజ్ఞప్తి. బుధవారంతో ముగియనుంది.ఇప్పటికే ఇందుకు సంబంధించిన గడువును కూడా పెంచబోమని ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. దీంతో ఈ ఒక్క రోజే గడువు తేదీ ఉండటంతో ఆసక్తి ఉన్న అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా దరఖాస్తులు మాత్రం పరిష్కారం కావడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం రాయితీతో అవకాశం ఇవ్వగా స్థల యజమానులు మాత్రం అప్లై చేసినప్పుడు చుక్కలు కనిపిస్తున్నాయి. లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారులకు రూ.25వేల నుంచి రూ.లక్షల్లో ఫీజు అవడం వస్తుంది. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు యజమాని ముందుకు వస్తుండగా ఆ అర్జీలకు రకరకాల కొర్రీలు చూపుతుండటంతో నానా అవస్థలు పడుతున్నారు. వాస్తవానికి ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులు అన్ని పత్రాలతో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత ఎల్1 అధికారికి వెళ్తాయి. ఇక్కడ పరిశీలన, పత్రాలు అప్‌లోడ్ చేసిన తర్వాత ఎల్2కు వెళ్తాయి. ఎల్2 లో మదింపు జరగాల్సి ఉండగా వీరు లాగిన్ లో మళ్లీ ఎల్1 పెండింగ్ అని చూపిస్తున్నాయి. అయితే అన్ని సవ్యంగా ఉన్న దరఖాస్తులు ఫీజు చెల్లించిన వారిలో కొందరికి ఐబీఆర్ఎస్ పెండింగ్ సూచిస్తోంది.ఫీజు చెల్లించిన అనంతరం ఐరిగేషన్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అన్ని పత్రాలు తీసుకు వచ్చి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అవన్నీ పూర్తయితే మళ్లీ ఎల్1 పెండింగ్ వస్తోంది. ఫీజు కట్టిన దరఖాస్తులు వెబ్‌సైట్ లో అసలు కనిపించడం లేదు. అవి ఎక్కడ ఉన్నాయనే విషయం కూడా దరఖాస్తు దారునికి తెలియక పోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు.



## రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన శ్రీచైతన్య స్కూల్

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** శ్రీచైతన్య స్కూల్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌ని మంగళవారం శ్రీచైతన్య స్కూల్, గోసాల, విజయవాడలో పెనమలూరు నియోజకవర్గ ఎంఎల్ఏ బోడే ప్రసాద్ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీచైతన్య స్కూల్ విజయవాడ జోన్ ఈజీఎం మురళీ కృష్ణ, నెల్లూరు జోన్ ఏజీఎం శ్రీకాంత్, రాజమండ్రి ఏజీఎం పార్థసారథి, కాలేజీ ఏజీఎంలు సురేశ్, చిన్మయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జోన్స్ నుండి 1392 మంది శ్రీచైతన్య విద్యార్థులు ఈ స్పోర్ట్స్ మీట్ లో పాల్గొనడానికి వచ్చారు. వాలీబాల్, త్రో బాల్, షటిల్ బాడ్మింటన్, 100మీటర్ల పరుగు, షాట్‌ఫుట్ వంటి అంశాలలో పోటీలు 29, 30 తేదీలలో జరుగుతాయని తెలిపారు. దానికిముందు బ్రాంచిల స్థాయిలో జరిగిన ప్రాథమిక స్థాయి క్రీడా పోటీలలో 298 బ్రాంచిలనుండి 221403 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరినుండి బ్రాంచికి 110 మంది విద్యార్థుల చొప్పున 32780 మందిని ఎంపిక చేసి వారికి జోనల్ స్థాయి పోటీలను నిర్వహించగా వారిలో 1392 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శ్రీచైతన్య స్కూల్ నాణ్యమైన, మెరుగైన విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ తమ విద్యార్థులను వారికి ఇష్టమైన క్రీడాంశాలలో శిక్షణనిస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ, విద్యార్థుల, తల్లిదండ్రుల మన్ననలను పొందుతోంది. శ్రీచైతన్య స్కూల్ రీజినల్ ఇన్ ఛార్జీలు, పిఇటి రిసోర్స్ పర్సన్ రాజశేఖర్, జోనల్ అకడెమిక్ కోఆర్డినేటర్లు, జోనల్ పిఇటిలు, ప్రిన్సిపాల్స్, డీన్స్, వైస్ ప్రిన్సిపాల్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీచైతన్య స్కూల్స్ డైరెక్టర్ సీమ ఈ పోటీలలో పాల్గొంటున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

## జలవిజ్ఞాన నిధి విద్యాసాగర్ రావు: కేటీఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్29:** సాగునీటిరంగ నిపుణులు ఆర్ విద్యాసాగర్ రావు వర్ధంతి సందర్భంగా వారికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘన నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో నదీ జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న వివక్షను, జల దోపిడీని ప్రజలకు అర్థమయ్యే భాషలో సులువుగా వివరించిన మేథావి మన విద్యాసాగర్ రావు అని కొనియాడారు. తెలంగాణ జనహృదయాల్లో ఒక జలవిజ్ఞాన నిధిగా, నీళ్ళ సారుగా నిలిచిపోయిన వారు సాగునీటి రంగంలో చేసిన కృషి అనితరసాధ్యం. కృష్ణా,గోదావరి జలాల్లో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటా కోసం వారి చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం అని కేటీఆర్ పేర్కొన్నారు. విద్యాసాగర్ రావు మరణం తర్వాత కేసీఆర్ ప్రభుత్వం, ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా డిండి ఎత్తిపోతల పథకానికి ఆయన పేరు పెట్టింది. విద్యాసాగర్ రావు జన్మస్థలం జాజిరెడ్డిగూడెంలో ఆయన పేరు మీద ఒక సబ్‌మార్కెట్ యార్డును నిర్మించింది అని కేటీఆర్ గుర్తు చేశారు.

## ఎన్‌డిసిఏ నివేదికలో అవినీతి జాడే లేదు

### ఉత్తమ్ మాట్లాడినవన్నీ అబద్దాలే: హరీశ్‌రావు కౌంటర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్29:** కాళేశ్వరంపై ఎన్‌డిసిఏ ఇచ్చిన నివేదిక మీద నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడినవన్నీ అబద్దాలేనని బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదని పేర్కొన్నారు. రాష్ట్రమంతటా బిఆర్ఎస్ రజతోత్సవ సభ,కెసిఆర్



ప్రసంగంపై చర్చ జరుగుతోందనే అక్కసుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తు న్నారని దుయ్యబట్టారు. ఎన్డీఎస్ఏ ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగా మారిం దని వ్యాఖ్యానించారు. కాళేశ్వరంపై ఎన్‌డిసిఏ నివేదికపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌పై హరీశ్‌రావు స్పందిస్తూ పలువురు నేతలతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కౌంటర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నోట్స్ విడుదల చేశారు. ఉత్తమ్ ప్రసంగంలో సంగతి లేదు, సబ్జెక్ట్ లేదు, సారం లేదు. తీరా చూస్తే ఈ సారి కూడా ప్రిపేర్ అయినట్లు లేరు అని పేర్కొన్నారు.

# త్వరలోనే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు

### అంబర్ పేటలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసుకుంటామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి శ్రీ రమణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని ఎఐసిసి సెక్రటరీ విశ్వనాథ్, ఎఐసిసి సెక్రటరీ, ఎమ్మెల్యే విష్ణునాథ్ తో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడానికి వి.హనుమంతరావు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దళితులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించి అమలు చేస్తున్నమని వివరించారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రాజకీయ, ఉపాధి ,విద్య అవకాశం కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణకు జాతీయస్థాయిలో రాహుల్ గాంధీ చేస్తున్న ప్రయత్నంలో భాగస్వాములుకావాలన్నారు. హనుమంతరావు కోరిన విధంగా త్వరలోనే అంబర్ పేట్ లో గౌతు లచ్చన్న ఆడిటోరియ నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు మాట్లాడుతూ.. పంజాగుట్ట చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం జరిగిందని, గత ఐదు సంవత్సరాల పోరాట ఫలితంగా అంబర్ పేట్ లో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు . కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బతుకమ్మ కుంటను భూ కబ్జాదారుల నుంచి కాపాడుకోవడంతో పాటు అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నమని



**మంగళవారం రాత్రి శ్రీ రమణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో విహెచ్ తదితరులున్నారు**

తెలిపారు. ఏఐసిసి సెక్రెటరీ విశ్వనాథన్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ , సిపిఐ నాయకుడు చాడ వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ ఎమ్మెల్యే కమలాకర్, ఇందిరా శోభన్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్,టిపిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ రామ్మోహన్, గడ్డం శ్రీధర్, కోటం అనిల్, మహేష్, లక్ష్మణ్ తదితరులు

# వానాకాలంలో 1.31 కోట్ల ఎకరాల్లో పంటలు

### వానాకాలం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** తెలంగాణలోవానాకాలం సీజన్లో రాష్ట్ర వ్యాప్తంగా 1.31 కోట్ల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు వానాకాలం సీజన్ లో పంటల సాగుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ ఖరారు చేసింది. ఇందులో 66.80లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. అదే విధంగా రెండో ప్రధాన పంటగా 50లక్షల ఎకరాల్లో పత్తి సాగును చేపట్టాలని నిర్ణయించింది. ఇక మొక్కజొన్నలు 6 లక్షల ఎకరాల్లో, కంది పంట 5.10 లక్షల ఎకరాల్లో సాగవుతాయని లెక్కకట్టింది. వీటితో పాటు, మిర్చి 1.90 లక్షల ఎకరాలు, సోయా చిక్కుడు 9 లక్షల ఎకరాలు, పెసర్లు 65 వేల ఎకరాలు, మినుములు 28వేల ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించింది. అలాగే వేరుశనగ 26 వేల ఎకరాలు, నువ్వులు 650 ఎకరాలు, పొద్దు తిరుగుడు 150 ఎకరాలు, కుసుమలు 3,600 ఎకరాల్లో సాగు కావచ్చని వ్యవసాయశాఖ గణాంకాలు వేస్తోంది. చిరు ధాన్యాల పంటలు కూడా తక్కువగా సాగు చేసే అవకాశం ఉందని భావిస్తోంది. జొన్నలు 39 వేల ఎకరాలు, సజ్జలు 1200 ఎకరాల్లోనే సాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. గడిచిన యాసంగి సీజన్లో మొత్తం 78 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, వరి 59 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 9లక్షలు, వేరుశనగ 2.2 లక్షలు, శనగ 1.7 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. వరిలో సన్న రకాల సాగు పెరిగే అవకాశం ఉన్నందున విత్తనాలను అధిక మొత్తంలో ఉంతోంది. ఈ సాగుకు తగినట్లుగా 16.70 లక్షల క్వింటాళ్ళ వరి విత్తనాలు, 48 వేల క్వింటాళ్ల మొక్కజొన్న, 95 లక్షల పత్తి ప్యాకెట్లు, 1.35 లక్షల క్వింటాళ్ల సోయాచిక్కుడు విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసింది. అంతేకాకుండా పత్తికి సంబంధించి కూడా డిమాండ్ ఉన్న రకాలను అవసరం కంటే అధిక మొత్తంలో తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకోనుంది. ఇందులో భాగంగా 1.4 కోట్ల ప్రత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంచనుంది. ఈ పంటలతో పాటు, పశువులకు మేతకు ఉపయోగపడే రకాలను 1.94 లక్షల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు ప్రతిపాదనలు చేసింది. ఈ విధంగా అన్ని పంటల విత్తనాలను ముందస్తుగానే రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోనుంది. కాగా ఈ సీజన్ నుంచి ఫసల్ బీమా అమలుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. బీమా మొత్తం ప్రీమియంలో రైతు వాటా 2 శాతం, యాసంగి పంటకాలంలో 1.5 శాతం, వాణిజ్య ఉద్యానపంటలకు 5 శాతం ప్రీమియం ఉంటుందని, మిగిలిన ప్రీమియంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రప్రభుత్వం 50:50 భరించే విధంగా విధివిధానాలు ఖరారు చేస్తున్నారు.దిగుబడి ఆధారిత భీమా పథకం కింద వరి, మొక్కజొన్న, కంది, మినుము, సోయాబీన్, వేరుశనగ, శనగ, నువ్వులు మొదలైన పంటలు ఉంటాయి. వాతావరణ ఆధారిత బీమా పథకం కింద పత్తి, మిరప, మామిడి, ఆయిల్‌పామ్, టమాట,బత్తాయి పంటలకు బీమా వర్తింపచేసే విధంగా ప్లాన్‌చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.

## సిటీ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు పట్టుబడ్డ అంతరాష్ట్ర డ్రగ్స్ స్మగ్లర్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరో అంతరాష్ట్ర డ్రగ్స్ ముఠా పట్టుబడింది. ఇందులో ఇద్దరు అంతరాష్ట్ర స్మగ్లర్లు కాగా మరో ఇద్దరు లోకల్ నేరగాళ్లు. వీరి వద్ద నుంచి కోటి 40 లక్షల రూపాయల విలువచేసే 1380 గ్రాముల హైడ్రోఫోనిక్ గంజాయి, 44 ఎల్ఎస్‌డి బ్లాట్స్, 250 గ్రాముల మాజిక్ మష్రూమ్స్‌ను కొంత నగదును జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) విశ్వ ప్రసాద్ మంగళ వారం మీడియాకు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌కు చెందిన హర్షవర్ధన్ శ్రీవాస్తవ అలియాస్ హర్ష్ (30) ఓ అంతరాష్ట్ర డ్రగ్ స్మగ్లర్. ఆన్‌లైన్‌లో డ్రెడ్ మార్కెట్ సహా పలు రకాల వెబ్‌సైట్లలో హైడ్రోపోనిక్ గంజాయి (మట్టి అవసరం లేకుండా కేవలం కొబ్బరిపీచు, నీరు, రసాయనాల సహాయంతో పూల కుండీల లో సాగు చేస్తారు) సహా పలు రకాల డ్రగ్స్‌ను తక్కువ ధరకు కొని దానిని ఎక్కువ ధరకు దేశ వ్యాప్తంగా తనకు నమ్మకంగా వుండే వారికి అమ్ముతుంటాడు. ఇత ని సన్నిహితుడు చెన్నైకి చెందిన శ్రీనివాస రాహుల్ (30) కూడా అంతరాష్ట్ర డ్రగ్ స్మగ్లర్. ఇతను కూడా వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్ లో డ్రగ్స్ కొంటూ తనకు పరి చయం వుండే



**వివరాలను వెల్లడిస్తున్న నగర అదనపు పోలీసు కమిషనర్ విశ్వ ప్రసాద్. చిత్రంలో టాస్క్‌ఫోర్స్ డిసిపి సుధీంద్ర ఉన్నారు**

వారికి ఎక్కువ ధరకు అమ్ముతుంటాడు. ఇతనిపై చెన్నైలో ఇదివరకు ఒక కేసు వుంది. కాగా వీరి వద్ద నుంచి డ్రగ్స్ కొనేవారిలో సికింద్రాబాద్‌కు చెందిన అభిషేక్ (26), ధవల్ (29)లు వున్నారు. వీరంతా డ్రగ్స్ దందా కోసం నల్లకుంటకు వస్తున్నారనే సమాచారంతో నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ పక్కా సమాచారం సేకరించి మం గళవారం ఉదయం నిఘా వుంచింది. నలుగురు నల్లకుంట వద్దకు రాగానే నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అధికారులు ఒక్కసారిగా దాడిచేసి పట్టుకున్నారు. వీరి వద్ద 1.380 కిలోల హైడ్రో ఫోనిక్ గంజాయి, 44 ఎల్ఎస్‌డి బ్లాట్స్, 250 గ్రాముల మాజిక్ మష్రూమ్స్, పది వేల 640 రూపాయల నగదును జప్తు చేశారు. పట్టుబడ్డ నలుగురిని తదుపరి విచారణ నిమిత్తం నల్లకుంట పోలీసులకు అప్పగించారు. కాగా నగరంలో డ్రగ్స్ గురించి ఎవరి వద్ద ఎలాంటి సమాచారం వున్నా వెంటనే పోలీసులకు చెప్పాలని నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) విశ్వ ప్రసాద్ కోరారు. డ్రగ్స్ విష యంలో కఠినంగా వుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డిసిపి సుధీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## భూదాన్ భూముల వ్యవహారంపై ఇడి సంచలన ప్రకటన

## భూదాన్ భూముల్లో అక్రమాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన భూదాన్ భూముల వ్యవ హారంలో సోమవారం నాడు నగరంలోని పలుచోట్ల నిర్వహిం చిన సోదాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) మంగళవారం నాడు ప్రకటన విడుదల చేసింది. భూదాన్ భూముల్లో అక్రమాలు జరిగాయని, ఇందుకోసం కొందరు నకిలీ పత్రాలు సృష్టించారని, రెవెన్యూ రికార్డులను మార్చారని ఈడీ పేర్కొంది. నిషేధిత జాబితా నుంచి పేర్కొన్న భూమిని డి.. నోటిఫై చేయడంతో పాటు కొన్ని ప్రైవేటు పార్టీలకు ఈ భూములను విక్రయించారని ఈడీ వెల్లడించింది. భూదాన్ భూముల గోల్‌మాల్ వ్యవహారంలో పోలీసులు నమో దు చేసిన కేసుల ఆధారంగా తాము విచారణ చేశామని, ఇదే సమయంలో మనీలాండరింగ్ కింద ఐదు చోట్ల సోదా లు నిర్వహించామని ఈడీ తెలిపింది. కొంద రు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేయడం జరిగిందని, దీనిపై విచారణ చేస్తున్నామని ఈడీ పేర్కొంది. నకిలీ పత్రాలు సృష్టించి, ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డులను తారుమారు చేసి, ఇష్టానుసారం విక్రయాలు జరిపారని ఈడీ వెల్లడించింది. ఇక్కడ భూములను కొన్న వా రిలో ఐఎఎస్‌లతో పాటు ఐపిఎస్ అధికారులు, ఇంకొందరు ప్రముఖులు వున్నారని, వీటన్నింటిపై నిజాలు వెలికి తీసేందుకు విచారణ చేస్తున్నట్లు ఈడీ తెలిపిం ది. మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో గల భూ దాన్ భూములు అన్యాక్రాంతం అయినట్లు గుర్తించామని ఈడీ తెలిపింది. ఖాదర్ వున్నీసా అనే మహిళ పూర్వికుల ఆస్తిగా చెప్పి రెవెన్యూ రికార్డులను ఇష్టానుసారంగా, మోసపూరితంగా మార్చే శారని ఈడీ తెలిపింది. దీంతో పాటు కొందరు దళారులతో కలిసి ఇక్కడి భూమిని వివిధ సంస్థల కు విక్రయించారని, దళారులు, మధ్యవర్తులుగా వున్న వారి నుంచి ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు కూడా భూమిని కొన్నారని ఈడీ పేర్కొంది. ఇక్కడి భూమిపై నిషేధం వున్నా దీనిపై నోటిఫై చేసి, మరీ విక్రయాలు జరిపారని ఈడీ తెలిపింది. ఖాదరున్నీసా, మహమ్మద్ మురవర్ ఖాన్, మహ మ్మద్, లతీఫ్ షర్ఫాన్, మహమ్మద్ అక్తర్ షర్ఫాన్, మహమ్మద్ షకూర్‌లు ప్రభుత్వ భూమిని మోపపూరితంగా అమ్మకాలు చేయడంతో పాటు కొందరి నుంచి కొ నుగోలు చేశారని, దీనికి సంబం ధించిన అన్ని పత్రాలను జప్తు చేశామని ఈడీ పేర్కొంది. దాడుల సందర్భంగా 23 లక్షల రూపాయల నగదు, 12 వేల దిర్హామ్స్(యుఏఈ)తో పాటు మహమ్మద్ ఫాం హౌజ్‌లో వున్న 45 కార్లను జప్తు చేశామని ఈడీ తెలిపింది. ఈ కేసుకు సంబంధించిన విచారణ ఇంకా కొనసాగుతోందని ఈడీ వెల్లడించింది.

## మిట్టపల్లిలో విషాదం

**తల్లాడ, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాత మిట్టపల్లి గ్రామంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించిన సంఘటనలో ఇద్దరు మృతి చెందగా మరో నలుగురు కొన ఊపిరితో



చికిత్స పొందుతున్న సంఘట నతో మిట్టపల్లిలో విషాదం నెలకొంది. రాత్రి 7.30లకు సంఘటన జరి గిన గ్రామంలో మంగళవారం ఉదయం వరకు తెలియకపోవడం చర్చనీ యాంశంగా మారింది. సాధారణంగా 108 వస్తేనే గుమ్మిగూడే పరిస్థితి ఉండగా నలుగురు పిల్లలు, ముగ్గురు పెద్దలకు తీవ్ర గాయాలైతే వారి ఆర్తనా దాలు గ్రామంలోని చుట్టుపక్కల ఇళ్ళకు కూడా తెలియకపోవడంతో పలు అను మానాలు వ్యక్తమవు తున్నాయి. సంఘటన జరిగినప్పుడు వినోద్‌కుమార్ భార్య కిరాణ కొట్టుకు వెళ్ళడంతో ఆమె ప్రాణాలతో బయ ట పడినట్లైంది. ఒక్కసారి గ్యాస్ లీక్ సంఘటనతో మిట్టపల్లి సంఘటన పలువురిని కలిచివేసింది. **కన్నీరు పెట్టుకున్న ప్రధానోపాధ్యాయుడు:** వినోద్‌కుమార్‌కు ఇద్దరు కవల పిల్లలుకాగా. ఇద్దరు మిట్టపల్లి ప్రాథమిక పాఠశాలలోనే 1వ తరగతి చదువు తున్నారు. వినోద్‌కుమార్ పేదరికంలో ఉండగా పిల్లలు అప్పుడప్పుడు పాఠశాలలకు డుమ్మా కొడుతుండగా హెచ్‌ఎం రాయల నరసింహారావు తన వాహనంలో పిల్లలను ఎక్కించుకుని పాఠశాలకు తీసుకువెళ్ళే పరిస్థితి ఉండగా సోమవారం రాత్రి జరిగిన సంఘటనతో పిల్లలు ఆసుపత్రిలో విగతజీవులుగా పడి ఉండగా జిల్లా పిఆర్‌టియూ అధ్యక్షుడు యనమద్దివెంకటేశ్వర్లుతో కలిసి వెళ్ళి కన్నీటి పర్యంతమయ్యారు.

## నేడు కంచి కామకోటి పీఠం 71వ ఆచార్యులుగా గణేష శర్మ అభిషేక వేడుక

### శుభాభినందనలు తెలిపిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఎప్రిల్29:** కంచి కామకోటి పీఠం 71వ ఆచార్యులుగా దుడ్డు సత్య వెంకట సూర్య సుబ్రహ్మణ్య గణేష శర్మ అభిషేక వేడుక శుభ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వారికి శుభాభినందనలు తెలియజేశారు.గణేష శర్మ ఋగ్వేద పండితులుగా బాసరలోని జ్ఞాన సరస్వతి దేవికి,తెలంగాణ ప్రాంతానికి ఎనలేని ధార్మిక సేవ చేశారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.ఋగ్వేదం లోనే కాకుండా యజుర్వేదం, సామవేదం, షడాంగాలు, దశోపనిషత్తుల్లో జగద్గురు పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి వారి కృపతో అపారమైన జ్ఞానార్జన చేశారని గుర్తు చేశారు. సనాతన ధర్మ గురుపరంపరకు, భక్తి తత్వానికి, జ్ఞాన మార్గానికి బాటలు వేసే ఈ వేడుక తెలంగాణ ప్రజలందరికీ మధుర జ్ఞాపకం కాబోతోందని అన్నారు. మంగళకరమైన అక్షయ తృతీయ రోజున (30 ఏప్రిల్) జరగనున్న ఈ అభిషేక వేడుక సందర్భంగా శ్రీ కంచి కామకోటి పీఠానికి తెలంగాణ ప్రజల తరఫున ముఖ్యమంత్రి ప్రణామాలు తెలియజేశారు. ఈ గురుపరంపర ధర్మాన్ని, జ్ఞానాన్ని, శాంతిని మానవాళికి ఎల్లప్పుడూ అందించాలని ఒక సందేశంలో ఆకాంక్షించారు.

### సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

## ఆసుపత్రి నుంచి శ్రీతేజ్ డిశ్చార్జ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 29 ప్రభాత వార్త:** గత ఏడాది డిసెంబరులో హైదరాబాద్ లోని సంధ్య థియేటర్‌లో పుష్ప2 సినిమా ప్రీమియర్ షో సం దర్భంగా జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన బాలుడు శ్రీతేజ్, దాదాపు ఐదు నెలల సుదీర్ఘ చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి మంగళ వారం డిశ్చార్జ్ అయ్యాడు. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి కొంత నిలకడగా ఉండటంతో, వైద్యులు అతడిని డిశ్చార్జ్ చేసి,



**శ్రీతేజతో తల్లిదండ్రులు(ఫైల్)**

తదుపరి సంరక్షణ కోసం రిహాబిలిటేషన్ కేంద్రానికి తరలించాలని సూచించారు. పుష్ప2 చిత్రం ప్రచార కార్యక్రమంలో జరిగిన ఈ దురదృష్టకర సంఘటనలో శ్రీతేజ్ తల్లి రేవతి మరణించిన విషయం తెలిసిందే.శ్రీతేజ్ మొత్తంగా 4 నెలల 25 రోజుల పాటు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు.

## రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదు

### బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**చిగురుమామిడి, ప్రభాత వార్త:** భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా అమలు చేస్తామని, రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదని, గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను అలోపేతం చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని మహాలక్ష్మి ్మ ఫంక్షన్ హాల్ లో మంగళవారం రోజున నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ భూమి ఒక గౌరవంగా భావించే రైతుకు ధరణి వచ్చిన తర్వాత మనశ్శాంతి లేకుండా పోయిందని అన్నారు. ధరణి తెచ్చిన భూవివాదాల కారణంగా రైతుల ఆవేదన, ఆక్రోశం తహసిల్దార్‌ల పై దాడి చేసే వరకు వెళ్లిందని అన్నారు. ధరణి వ్యవస్థ వల్ల రైతు తన భూమిని తాను అమ్ముకునే పరిస్థితి లేదని అన్నారు. అధికారులను గత ప్రభుత్వం దొంగలుగా చిత్రీకరించి రాత్రికి రాత్రి వందల ఎకరాల భూములను వారి పేరు పైకి బదిలాయించుకున్నారని తెలిపారు. 30 సంవత్సరాల కింద ఉన్న భూములు విక్రయించి వెళ్లిపోయిన వారి పేర్లు ధరణిలో వచ్చాయని, దీనివల్ల అసలైన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, సహకార సంఘం చైర్మన్ జంగా వెంకటరమణ రెడ్డి, డీసీఓ రామానుజాచార్య, డీఏవో భాగ్యలక్ష్మి ్మ, తహసిల్దార్లు రమేష్, ఎంపీడీఓ మధుసూదన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిబిఐ వలలో రైల్వే డిఓఎం

### సోలాపూర్,హైదరాబాద్,గుంతకల్లులలో సోదాలు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 29,ప్రభాతవార్త:** అవినీతి ఆరోపణలపై దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లో డిఓఎంగా పనిచేస్తున్న ఓ అధికారిని మంగళవారం సిబిఐ అరెస్టు చేసింది. వివరాల్లోకి వెళితే : దక్షిణ మధ్య రైల్వే జోనల్ ప్రధాన కేంద్రంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, చీఫ్ కంట్రోలర్‌ల నియామకాలకు సంబంధించి భారీఎత్తున లంచం డిమాండ్ చేసినట్లు సిబిఐకి ఫిర్యాదులు వెళ్లడంతో సదరు అధికారిపై నిఘా ఉంచినా సిబిఐ బృందం మంగళవారం సదరు అధికారి నుండి రూ.40వేలు నగదు, యుపిఐ రూపంలో మరో 1.25లక్ష లరూపాయలు కలిపి మొత్తం రూ.1.65లక్షలను సదరు అధికారి నలుగురు అభ్యర్థుల నుండి తన కుమారుడి బ్యాంకు ఖాతాలో బదలాయించినట్లు సిబిఐ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇదిలా ఉండగా సదరు అధికారి కుమారుని బ్యాంకు ఖాతాలో రూ.31,62,500లు నగదు ట్రాన్‌సెక్షన్ జరిగినట్లు సిబిఐ గుర్తించింది. ఇందులో భాగంగా సోలాపూర్,హైదరాబాద్, గుంతకల్లులలో సోదాలు నిర్వహిస్తుంది. ఇందుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సిబిఐ వివరించింది.

## అత్యాధునిక నైపుణ్య శిక్షణ కోసం రాష్ట్రంలో ఆస్ట్రేలియా యూనివర్సిటీ

### సచివాలయంలో ఆస్ట్రేలియా ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఎప్రిల్29:** రాష్ట్రంలో ప్రపంచ స్థాయి నైపుణ్య శిక్షణ అందించే యూనివర్సిటీ ఏర్పాటుకు ఆస్ట్రేలియా వాణిజ్య ప్రతినిధులు ముందుకు రావడం పట్ల ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేసారు. తాము నెలకొల్పుతున్న యంగ్ ఇండియా స్కిల్స్ విశ్వవిద్యాలయానికి తోడు మరో ఉన్నత స్థాయి టెక్నాలజి క్యాంపస్ అందుబాటులోకి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పడతాయని ఆయన అన్నారు.మంగళవారం సచివాలయంలో తనను కలిసిన ఆస్ట్రేలియా ప్రతినిధులతో శ్రీధర్ బాబు బేటీ అయ్యారు. కృత్రిమ మేథ (ఏఐ)వేగంగా విస్తరిస్తున్నందున గ్లోబల్ సామర్థ్య కేంద్రాల్లో పనిచేస్తున్న 3 లక్షలకు పైగా సాఫ్ట్ వేర్ ఇంజనీర్లతో పాటు, చదువులు పూర్తి చేసుకునే విద్యార్థులకు నూతన నైపుణ్యాల శిక్షణ అవసరం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. విద్య పరిశ్రమ అవసరాలకు మధ్య నైపుణ్య లేమికి సంబంధించిన అగాధం ఉంది. దీన్ని పూడ్చగలిగే అత్యాధునిక శిక్షణ కేంద్రాలు పెద్ద ఎత్తున్న రావాల్సిన అవసరం ఉంది. తమ యూనివర్సిటీ ద్వారా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు సృష్టిస్తామని ఆస్ట్రేలియా ప్రతినిధులు చెబుతున్నారు. పూర్తి వివరాలతో, స్పష్టమైన ప్రతిపాదనతో వస్తే ప్రభుత్వపరంగా ఏం చేయగలుగుతామో ఒక అభిప్రాయానికి రాగలుతాం. యూనివర్సిటీకి అనుబంధంగా ఇన్‌క్యుబేషన్ కేంద్రాలు, పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన వాతావరణం సృష్టించడం రాష్ట్ర ప్రగతికి తోడ్పడుతుంది. శాటిలైట్ల నిర్మాణం, డ్రోన్ టెక్నాలజి 3డి డిజైనింగ్, బయో సైన్సెస్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ తదితర రంగాల్లో శిక్షణ అందించడానికి కరికులమ్ సిద్ధం చేసామని అంటున్నారు. మేం ఇప్పటికే టివర్క్స్‌లో 3డి ప్రోటో టైపింగ్ సేవలు అందిస్తున్నాం. అంకుర సంస్థల ఏర్పాటుకు అనుకూల వాతావరణాన్ని సృష్టించాం.వాటిని సందర్శించి అదనంగా ఏం చేయగలుగుతారో వెల్లడించాలని శ్రీధర్ బాబు సూచించారు. మంత్రిని కలిసిన ఆస్ట్రేలియా ప్రతినిధి బృందంలో సిడ్నీ బోర్గ్, నీలిమా చౌదరి, హైడన్ షటిల్ వర్త్, సురేన్ పథర్, యాండ్రే స్కోమన్, కొల్లా నాగ లోకేశ్ తదితరులు ఉన్నారు.


## రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల ప్రాధికార సంస్థ చైర్మన్‌గా జస్టిస్ శివ శంకర్‌రావు

### సిఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన జయేశ్‌రంజన్, నరసింహారెడ్డి, జస్టిస్ షమీమ్ అక్తర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్. ఏపిల్29:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల ప్రాధికార సంస్థ (కంప్లైంట్స్ అథారిటీ) చైర్మన్‌గా జస్టిస్ శివ శంకర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల సంఘం చైర్మన్‌గా కొత్తగా బాధ్య తలు స్వీకరించిన సందర్భంగా జస్టిస్ షమీమ్ అక్తర్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా, సిఎంఓలో ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ,సీఈవో(స్పీడ్ కార్యక్రమం)గా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్, సిఎంఓలో అదనపు సీఓగా నిమితులైన ఐవి నరసింహారెడ్డి సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వ కంగా కలిశారు. సిఎంకు ధన్యవాదాలు తెలిపారు.

# వన్డేలో ఒక్క సెంచరీ చేయని హీరోలు



మిస్బా ఉల్ హక్



మైఖేల్ వాఘన్



దినేష్ కార్తీక్



ఇయాన్ బోథమ్

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోని ఏ క్రికెటర్ అయినా వన్డే ఇంటర్నేషనల్ కెరీర్‌లో సెంచరీ సాధించాలని కోరుకుంటారు. వరల్డ్ క్రికెట్‌లో సెంచరీలు సాధించడం కూడా ఒక అరుదైన విజయం. ముఖ్యంగా వన్డే ఫార్మాట్‌లో సెంచరీ చేయాలని ప్రతీ క్రికెటర్ కోరుకుంటుంటాడు. క్రికెట్‌లోని మూడు ఫార్మాట్‌లలోనూ తన సెంచరీతోపాటు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాలనేది ప్రతి బ్యాట్స్‌మన్ కల. ముఖ్యంగా వన్డే ఫార్మాట్ చాలా మంది క్రికెటర్లకు ఇష్టమైనదిగా మారుతుంది. కానీ, కొందరు దిగ్గజ క్రికెటర్లు వారి వన్డే కెరీర్‌లో ఒక్క సెంచరీ కూడా చేయకుండానే రిటైర్మెంట్ చేశారు. ఈ లిస్ట్‌లో ఓ టీమిండియా ప్లేయర్ కూడా ఉన్నాడు. ఇలా క్రికెట్ చరిత్రలో తమ మొత్తం వన్డే కెరీర్‌లో ఒక్క సెంచరీ కూడా చేయని నలుగురు దిగ్గజ క్రికెటర్లు ఉన్నారు. ఈ జాబితాలో ఉన్న క్రికెటర్ల దిగ్గజాలు కావడం విశేషం. పాకిస్తాన్ మాజీ కెప్టెన్ మిస్బాఉల్‌హక్ తన మొత్తం వన్డే కెరీర్‌లో ఒక్క సెంచరీ కూడా సాధించలేదు. పాకిస్తాన్ తరపున 162 వన్డేలు ఆడిన మిస్బాఉల్‌హక్ 43.40 సగటుతో 5122 పరుగులు చేశాడు. మిస్బా ఉల్ హక్ వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లో 42 అర్ధ సెంచరీలు సాధించాడు. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో సెంచరీ చేయకుండానే అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు.

## కెరీర్‌లో కలగా 100 పరుగులు

## ఈ జాబితాలో దిగ్గజ ప్లేయర్లు

అలాగే ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాఘన్ 86 వన్డేలు ఆడాడు. అందులో అతను 27.15 సగటుతో 1982 పరుగులు చేశాడు. వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లో మైఖేల్ వాఘన్ అత్యుత్తమ స్కోరు 90 పరుగులు. మైఖేల్ వాఘన్ తన మొత్తం వన్డే కెరీర్‌లో ఒక్క సెంచరీ కూడా లేకుండానే రిటైర్మెంట్ చేశాడు.

ఇక భారత మాజీ వికెట్ కీపర్‌బ్యాట్స్‌మన్ దినేష్ కార్తీక్ 94 వన్డే మ్యాచ్‌లు ఆడి 30.21 సగటుతో 1752 పరుగులు చేశాడు. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో దినేష్ కార్తీక్ అత్యుత్తమ స్కోరు 79 పరుగులు. దినేష్ కార్తీక్ తన మొత్తం వన్డే కెరీర్‌లో ఒక్క సెంచరీ కూడా చేయలేదని తెలిస్తే అభిమానులు ఆశ్చర్యపోతారు. కాగా ఇంగ్లీష్ క్రికెటర్ ఇయాన్ బోథమ్ పేరు ప్రపంచంలోని గొప్ప ఆల్ రౌండర్లలో ఒకటిగా పేరుగాంచింది. ఇయాన్ బోథమ్ 116 వన్డే మ్యాచ్‌లు ఆడి 23.22 సగటుతో 2113 పరుగులు చేశాడు. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో ఇయాన్ బోథమ్ అత్యుత్తమ స్కోరు 79 పరుగులు. ఇయాన్ బోథమ్ తన మొత్తం వన్డే కెరీర్‌లో ఒక్క సెంచరీ కూడా చేయలేదు.



### దక్షిణాసియా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో..

# పసిడితో మెరిసిన భారత్

## ఖాతాలో 13 స్వర్ణాలు, 3 రజతాలు

**న్యూఢిల్లీ:** దక్షిణాసియా యూత్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం అద్భుతమైన పతకాల సేకరణలో 13 స్వర్ణాలు మరియు మూడు రజతాలను గెలుచుకుంది. ఈ సంవత్సరం యూత్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లకు అర్హత పోటీలో వివిధ విభాగాలలో భారత బృందం పోటీలో ఆధిపత్యం చెలాయించింది. ఖాట్మాండ్‌లో జరిగిన పోటీల్లో భారత జట్లు అండర్19 బాలికలు, అండర్15 బాలురు మరియు అండర్15 బాలికల విభాగాలలో మూడు స్వర్ణ పతకాలను సాధించాయి. అలాగే అండర్ 19, అండర్ 15 డబుల్స్‌లో మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లతో సహా మొత్తం ఆరు స్వర్ణాలను క్లీన్ స్వీప్ చేశాయి. అదనంగా, అండర్ 19 బాలురు, బాలికల సింగిల్స్ ఈవెంట్‌లలో భారత్ నాలుగు స్వర్ణ ఎ సాధించింది. అయితే, ఆతిథ్య నేపాల్ అండర్19 బాలుర విభాగంలో నాల్గవ స్వర్ణాన్ని గెలుచుకుంది. ఐదు జట్లు పాల్గొన్న లీగ్ దశలో పాకిస్తాన్ చేతిలో ఒకే ఒక్క ఓటమి పాలైనప్పటికీ, నేపాల్ ఏడు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది, మూడు విజయాలు సాధించి, శ్రీలంక మరియు బంగ్లాదేశ్‌లను వెనక్కి నెట్టి వరుసగా రెండవ మరియు మూడవ స్థానాల్లో నిలిచింది. గత సంవత్సరం యూత్ ఏషియన్ యూత్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించిన భారతదేశం, పోటీలో తన జట్టును నిలబెట్టాల్సిన అవసరం లేదు. ఇక టీమ్ ఈవెంట్లలో, ప్రీత వర్తికర్, అనన్య చందే, హార్ది పటేల్ మరియు దియాబ్రహ్మాచారి నేపాల్‌ను 31 తేడాతోఓడించి అండర్-19 బాలికల స్వర్ణాన్ని గెలుచు కున్నారు. అండర్15 బాలికల విభాగంలో ప్రతీ పాల్, ఆరుషి నంది, అద్వికా అరవాల్, తన్మయి సాహా శ్రీలంకను 30 తేడాతో ఓడించి విజయం సాధించారు. అండర్19 బాలుర సింగిల్స్ ఫైనల్‌లో, కుశాల్ చోప్డా తన సహచర భారత ఆటగాడు ఆర్ బాలమురుగన్‌ను 31 తేడాతో ఓడించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు, భారతీయులు మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. అండర్19 బాలికల సింగిల్స్‌లో అనన్యచందే 31 తేడాతో ప్రీత వర్తికర్‌ను ఓడించి స్వర్ణం సాధించింది, ప్రీత రజతాన్ని మిగిల్చింది.

# థాయిలాండ్‌పై విజయం

## ఆసియా కప్‌కు భారత్ మహిళల బేస్‌బాల్ జట్టు అర్హత



**న్యూఢిల్లీ:** ఆసియా కప్‌కు భారత్ మహిళల బేస్‌బాల్ టీమ్ అర్హత సాధించింది. బ్యాంకాక్‌లో జరిగిన క్వాలిఫయర్స్ సూపర్ రౌండ్ దశలో థాయిలాండ్‌ను 65 తేడాతో ఓడించి భారత మహిళల బేస్ బాల్ జట్టు ఆసియా కప్ 2025కి అర్హత సాధించినట్లు నిర్ధారించింది. ఆసియా నిర్వహించిన మహిళల ఆసియా బేస్ బాల్ కప్ అనేది ఆసియా బేస్ బాల్ ఛాంపియన్‌షిప్ కంటే తక్కువ స్థాయిలో జరిగే రెండవ స్థాయి పోటీగా గుర్తింపు పొందింది. ఇది రెండు జట్లు ఆసియా బేస్ బాల్ ఛాంపియన్‌షిప్‌లోకి నేరుగా ప్రవేశించగల క్వాలిఫైయర్‌గా కూడా పనిచేస్తుండటంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. ఆసియా బేస్ బాల్ కప్ 2025 క్వాలిఫయర్స్‌లో వెస్ట్రన్ డివిజన్‌లో భాగంగా, భారతదేశం ప్రారంభ రౌండ్‌లోని గ్రూప్ తిలో పాకిస్తాన్, శ్రీలంక మరియు ఇరాన్‌లతో జతకట్టింది. భారత మహిళల బేస్ బాల్ జట్టు పాకిస్తాన్‌పై 21 తేడాతో విజయం సాధించడంతో సహా తన మూడు పూల్ మ్యాచ్‌లను గెలుచుకుని సూపర్ రౌండ్‌కు చేరుకుంది. ప్రారంభ రౌండ్‌లోని రెండు పూల్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు సూపర్ రౌండ్‌కు చేరుకున్నాయి. ఇండోనేషియా మొదటి స్థానంలో నిలిచింది మరియు ఆసియా కప్‌లో భారతదేశంతో చేరనుంది. ఈరోజు బంగారు పతకం కోసం జరిగే మ్యాచ్‌లో భారతదేశం ఇండోనేషియాతో తలపడనుంది, కాంస్య పతకం కోసం థాయిలాండ్ పాకిస్తాన్‌తో తలపడనుంది. ఆసియా బేస్ బాల్ కప్‌లో భారత్ వరుసగా నాలుగోసారి పాల్గొంటుంది, 2017 ఎడిషన్ టోర్నమెంట్‌లో ఐదవ స్థానంలో నిలిచి వారి అత్యుత్తమ ప్రదర్శన ఇది.

### మహిళల ముక్కోణపు వన్డేలో..

# టీమిండియా విక్టరీ

## 15 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా ఓటమి



**న్యూఢిల్లీ:** శ్రీలంక వేదికగా జరుగుతున్న మహిళల ముక్కోణపు వన్డే సిరీస్-2025లో భారత్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఈ ట్రై సిరీస్‌లో భాగంగా మంగళవారం భారత్ దక్షిణాఫ్రికాతో తలపడింది. ఈ పోరులో 15 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 277 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా అమ్మాయిలు 49.2 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌట్ అయ్యారు. ఓదశలో సునాయాసంగా గెలిచే కన్పించిన దక్షిణాఫ్రికాను భారత్ స్పిన్నర్ స్నేహ రాణా దెబ్బతీసింది. 48వ ఓవర్‌లో 3 కీలక వికెట్లు పడగొట్టి మ్యాచ్ స్వరూపాన్నే స్నేహ మార్చేసింది. ఓవరాల్‌గా తన 10 ఓవర్ల కోటాలో 43 పరుగులిచ్చి 5 వికెట్లు సాధించింది. దక్షిణాఫ్రికా 11 పరుగుల వ్యవధిలో 5 వికెట్లు కోల్పోయింది. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో టాజ్మిన్ బ్రిట్స్ 109 పరుగులతో వీరోచిత శతకం చేసి చెలరేగింది. ఆమెతో లారా వోల్వార్డ్ 43 పరుగులు, అన్నేరి డెర్క్సెన్ 30 పరుగులతో రాణించినప్పటికీ వరుస క్రమంలో వికెట్లు కోల్పోవడంతో ప్రొటీన్ ఓటమి చవిచూడాల్సి వచ్చింది. ఇక ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా భారీ స్కోర్ నమోదు చేసింది. భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 276 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రతిక రావల్ 78 పరుగులు చేసి అర్ధ సెంచరీతో రాణించింది. ఇక కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 41 పరుగులు, జెమీమా రోడ్రిగెజ్క్ 41 పరుగులు, స్మృతి మంధన 36 పరుగులు, హర్లీన్ డియోల్ 29 పరుగులు, రిచా ఘోష్ 24 పరుగులతో ఓ మోస్తరు స్కోర్లు చేసి రాణించడంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 276 పరుగులు చేసింది. భారత్ ఇన్నింగ్స్‌లో దీప్తి శర్మ 9 పరుగులకే సింగిల్ డిజిట్ స్కోర్‌కు ఔట్ కాగా, కశ్వీ గౌతమ్ 5 పరుగులతో అజేయంగా నిలిచింది.

### ఏషియన్ బాక్సింగ్ టోర్నీలో.. భారత్ ఖాతాలో

# దేవాంశ్ పసిడి పతకం

**న్యూఢిల్లీ:** జోర్డాన్ వేదికగా జరుగుతున్న ఏషియన్ జూనియర్ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్ల జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. భారతదేశం ఇప్పటివరకు 43 పతకాలు సాధించింది, అండర్ 15 మరియు అండర్ 17 విభాగాలలో 21 మంది బాక్సర్లు స్వర్ణం కోసం పోరాడనున్నారు. అండర్ 17లో ఆరుగురు మహిళలు, ఏడుగురు పురుషులు ఫైనల్స్‌కు దూసుకెళ్లి కనీసం రజత పతకం ఖాయం చేశారు. దీంతో అండర్ 15, 17 కేటగిరీల్లో భారత్‌కు ఇప్పటి వరకు 21 పతకాలు ఖరారయ్యాయి. మహిళల అండర్17 సెమీస్‌లో ఖుషి చాంద్, అహానశర్మ, జన్నత్, సిమ్రన్‌జీత్‌కౌర్, హర్సిక, అన్సిక ప్రత్యర్థులపై విజయాలతో తుదిపోరులో నిలిచారు. మరోవైపు పురుషుల విభాగంలో దేవాంశ్ వియత్నాం బాక్సర్‌పై గెలిచి పసిడి పోరుకు అర్హత సాధించాడు. జూనియర్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత్ తన బలమైన ప్రదర్శనను కొనసాగించింది, ఆరుగురు మహిళలు సహా మరో ఏడుగురు బాక్సర్లు ఇక్కడ జరిగే అండర్ 17 ఫైనల్స్‌కు తమ స్థానాన్ని పదిలపరచుకున్నారు. కాగా జోర్డాన్‌లో జరిగిన తొలి రౌండ్‌లో కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన అక్మరల్ అమంతైవాపై నాకౌట్ విజయంతో ఫైనల్‌లోకి దూసుకెళ్లిన అహానా శర్మ (50 కిలోలు) నేతృత్వంలోని అండర్17 మహిళా బాక్సర్లు మొత్తం మీద ఆధిపత్య ప్రదర్శన ఇచ్చారు. ఖుషీ చంద్ (44-46 కిలోలు) ఉక్రెయిన్‌కు చెందిన ఒలెక్సాండ్రా చెరెవాటాను 32 తేడాతో ఓడించగా, జన్నత్ (54 కిలోలు) సిమ్రంజీత్ కౌర్ (60 కిలోలు), హర్సిక (63 కిలోలు), అన్షిక (80+ కిలోలు) కూడా కమాండింగ్ విజయాలు నమోదు చేసి ఫైనల్ బౌట్‌లకు చేరారు.

# పసిడి నిల్వల్లో యుఎస్ టాప్!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:** ముఖ్యంగా అమెరికా, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, చైనా వంటి దేశాలు భారీగా బంగారం నిల్వలను సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. మన దేశంలోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) కూడా ఇదే ఉద్దేశంతో ముందుకు సాగుతోంది. వీలైనంత ఎక్కువ బంగారం కొనుగోలు చేసేందుకు పావులు కదుపుతోంది. ఈ నేపథ్యంలో మన దేశంలో అసలు బంగారం నిల్వలు ఎన్ని ఉన్నాయి? ఇంకా ఎంత బంగారాన్ని కొనుగోలు చేయాలనుకుంటోంది? అందుకు గల ప్రధాన కారణాలు ఏమిటి? తెలుసుకుందాం.. ప్రపంచ దేశాలన్నీ వీలైనంత ఎక్కువ బంగారం నిల్వలు ఉండేలా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. ప్రస్తుతం మన దేశంలో 879 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి. ఈ జాబితాలో అమెరికా నంబర్ వన్ స్థానంలో ఉంది. దాని వద్ద 8,133.46 టన్నులు ఉంది. ఆ తర్వాత స్థానంలో జర్మనీ 3,351.53 టన్నులు, ఇటలీ వద్ద 2,452.84 టన్నులు, ఫ్రాన్స్ 2,436.94 టన్నులు, చైనా 2,264.32 టన్నులు, స్విట్జర్లాండ్ 1,039.94 టన్నులు ఉన్నాయి. ఈ జాబితాలో భారత్ స్థానం ఏడు కాగా.. ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జపాన్ 845.97 టన్నులతో ఎనిమిదో స్థానంలో ఉంది. మన ఆర్బీఐ వద్ద ఉన్న బంగారం కిలోలలో చూస్తే 8,79,000గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్ ధరల ప్రకారం దీని విలువ వేల కోట్ల డాలర్లు ఉంటుంది. మన కరెన్సీలో చూస్తే గ్రాముకు రూ.10వేల చొప్పున లెక్కిస్తే సుమారు రూ. 8.79 లక్షల కోట్లు అవుతుంది. మన దేశ విదేశీ మారక నిల్వలో బంగారం వాటా 11.7శాతంగా ఉంది. ప్రపంచ మార్కెట్‌పై ద్రవ్యోల్బణ భయాలు, వాణిజ్య యుద్ధాల ఆందోళనలు, ఆర్థిక మాంద్యం ముప్పు వంటి ప్రభావం అధికంగా కనిపిస్తోంది. అంతేకాక అత్యంత విశ్వసనీయ రిజర్వ్ కరెన్సీగా ఉన్న అమెరికన్ డాలర్ తన ప్రాధాన్యతను కోల్పోతోంది. ఈ క్రమంలో బంగారం అనేది ఒక సురక్షితమైన పెట్టుబడి సాధనంగా పరిగణిస్తున్నారు. ఆర్థిక సంక్షోభం సమయంలో ఇది విలువను కాపాడుతుంది. అందుకే అన్ని దేశాల కేంద్ర బ్యాంకులు బంగారం కొనుగోళ్లపై దృష్టి పెట్టాయి. ఆర్బీఐ కూడా ఈ విషయంలో చురుకుగానే వ్యవహరిస్తోంది. 2024లో 72.6 టన్నులు, 2025 జనవరి, ఫిబ్రవరి నెలల్లో మరో 2.8 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది.



# ఆటో విడిభాగాలకు టారిఫ్‌ల సెగ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:** టారిఫ్‌ల వల్ల ఎగుమతులు మందగించే అవకాశం ఉన్ననేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం ఆటోవిడిభాగాల తయారీ సంస్థల ఆదాయాలు సుమారు రూ.4,500 కోట్ల మేర క్షీణించవచ్చని ఇక్రా వెల్లడించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.3 లక్షల కోట్లుగా పరిశ్రమ ఆదాయం నమోదైందని, ఒకవేళ టారిఫ్‌ల వివాదం వల్ల అమెరికాకు ఎగుమతులు మధ్యస్త-గరిష్ట సింగిల్ డిజిట్ స్థాయిలో క్షీణించిన పక్షంలో 2025-25లో ఆదాయ వృద్ధి 6-8శాతానికి పరిమితం కావచ్చని పేర్కొంది. గతంలో ఇది 8-10 శాతంగా ఉండొచ్చని ఇక్రా అంచనా వేసింది. భారీ టారిఫ్‌ల వల్ల సరఫరా వ్యవస్థపై అదనంగా రూ.9వేల కోట్ల భారం పడుతుందని, దీన్ని అమెరికా వినియోగదారులు, అక్కడి దిగుమతిదారులు, భారతీయ ఎగుమతిదారులు భరించాల్సి వస్తుందని వివరించింది. సరఫరాదారు ప్రాధాన్యత, పోటీ, సాంకేతిక ప్రాధాన్యత అంశాలను బట్టి వారు ఎంత మేర భారాన్ని బదలాయించగలరనేది ఆధారపడి ఉంటుందని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షంషేర్ దివాన్ తెలిపారు. ఒకవేళ అదనపు టారిఫ్ వ్యయాల్లో 30-50 శాతానికి భారతీయ ఆటో విడిభాగాల ఎగుమతిదారులు భరించే పక్షంలో సుమారు రూ.2,700-4,500 కోట్ల భారం మోయాల్సి వస్తుందని వివరించారు. ఇది పరిశ్రమ నిర్వహణ లాభాల్లో 3-5శాతమని, ఆటో విడిభాగాల ఎగుమతిదార్ల నిర్వహణ లాభాల్లో 10-15 శాతం అని పేర్కొన్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ మొత్తం ఆదాయాల్లో అమెరికా వాటా సుమారు 8శాతంగా నమోదైంది. 2020-24 మధ్య ఆలంలో అమెరికాకు ఆటో విడిభాగాల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 15శాతం స్థాయిలో పెరిగాయి. ఇంజిన్లు, ఎలక్ట్రికల్ కాంపొనెంట్లు లాంటి కీలకమైన ఆటోమొబైల్ విడిభాగాలపై మే 3 నుంచి అమల్లోకి వచ్చేలా అమెరికా 25శాతం టారిఫ్‌లు ప్రకటించిన విషయం విదితమే. భారత్ ఎగుమతి చేసే విడిభాగాల్లో దాదాపు 65శాతం కాంపొనెంట్లు 25శాతం టారిఫ్‌ల కేటగిరిలోకి వస్తాయి.




# స్వల్ప లాభాలకే సూచీలు పరిమితం

**ముంబై, ఏప్రిల్ 29:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. రోజంతా స్వల్ప శ్రేణిలోనే కదలాడాయి. ఎంపిక చేసిన షేర్లలో మినహా పెద్దగా మార్కెట్‌లో కొనుగోళ్ల కళ కనిపించలేదు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సన్‌ఫార్మా, కోటక్ మహీంద్రా బ్యాంకు షేర్లలో అమ్మకాలు నమోదు కాగా.. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమంగానే కదలాడాయి. సెన్సెక్స్ ఉదయం 80,396.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,218.37) ఓ మోస్తరు లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,122.02 80,661.31 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి 70.01 పాయింట్ల లాభంతో 80,288.38 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 7.45 పాయింట్లు లాభపడి 24,335.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.25గా ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ (2.20) షేరు వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిసింది. దీంతో పాటు టెక్ మహీంద్రా, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అల్ట్రాటెక్ సిమెంట్, సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64 డాలర్ల స్థాయి వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు ధర 3,322 డాలర్ల వద్ద ట్రేడయింది.



# ఇన్ఫోసిస్‌లో ట్రైనీల తొలగింపు!

**ముంబై, ఏప్రిల్ 29:** ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌లో ట్రైనీలతొలగింపుల పర్వం కొనసాగుతోంది. తుది ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్‌లో విఫలమైన కారణంగా మరో 195 మందిని ఆ సంస్థ పక్కన పెట్టింది. ఈ ఏడాది ట్రైనీలను తొలగింపు చేపట్టడం వరుసగా ఇది నాలుగోసారి. పరీక్షలో ఫెయిల్ అయిన ట్రైనీలకు ఇమెయిల్ ద్వారా ఇన్ఫోసిస్ సమాచారం ఇచ్చినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. తొలగించిన ట్రైనీలకు ఇన్ఫోసిస్ ఉచితంగా శిక్షణఅందిస్తోంది. ఎన్ఐఐటీ, అప్‌గ్రాడ్ ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు 800 మందిని ట్రైనీలను ఇన్ఫోసిస్ తొలగిం చింది. అందులో 250 మంది ఈ సదుపా యాన్ని వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. మరో 150 మంది ఇన్ఫోసిస్ అందిస్తున్న ఔట్ ప్లేస్‌మెంట్ సేవల కోసం రిజిస్టర్ చేసుకున్నట్లు తెలిసింది. ఇన్ఫోసిస్ తొలుత ఫిబ్రవరి నెలలో 300 మంది ట్రైనీలను తొలగించింది. మార్చిలో 30 35 మందిని, ఏప్రిల్‌లో 240 మందిని తొలగించింది. తాజాగా ఇది నాలుగోసారి. తొలగించిన ట్రైనీలకు ఒక నెల ఎక్స్‌గ్రేషియాతో పాటు రిలీవింగ్ లెటర్‌ను కూడా ఇస్తోంది. ప్రస్తుతం తొలగించిన ట్రైనీలు 2022లో ఇన్ఫోసిస్ నియమించుకుంది. వీరిని 2024 అక్టోబర్‌లో ఆన్‌బోర్డ్ చేసుకున్నట్లు పేర్కొంది.




# వాణిజ్యం


# రికార్డు స్థాయిలో పెరిగిన జాబ్ అప్లికేషన్లు

**ముంబై, ఏప్రిల్ 29:** ఈ యేడాది తొలి త్రైమాసికంలో రికార్డు స్థాయిలో జాబ్ అప్లికేషన్లు వచ్చాయని ప్రముఖ ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ తన నివేదికలో తెలిపింది. వాటిలో అత్యధికం మహిళల నుంచి రావడం విశేషం. అంతేకాకుండా అనువైన పని, అవకాశాల ఆధారంగా టైర్2, టైర్3 నగరాల నుంచి ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు ఇండియా ఎట్‌వర్క్-క్యూ1 2025 పేరుతో విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. దీని ప్రకారం ఈ యేడాది జనవరి-మార్చి రికార్డు స్థాయిలో 1.81 కోట్ల జాబ్ అప్లికేషన్లు వచ్చాయి. ఇది గతేడాది కంటే 30శాతం అధికం. దేశంలో పెరుగుతున్న ఆర్థిక వృద్ధి, వివిధ రంగాల్లో డిజిటల్ హైరింగ్ బూమ్‌ను ఈ గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయి. మొత్తం దరఖాస్తుల్లో అత్యధికంగా 62 లక్షలు మహిళలమే. గతేడాది కంటే 23 శాతం ఎక్కువ మంది మహిళలు ఉద్యోగాల కోసం దరఖాసునత చేసుకున్నారు. జమ్షెడ్‌పూర్, ఇండోర్ లాంటి టైర్2, టైర్3 పట్టణాల నుంచి ఎక్కువ అప్లికేషన్లు వచ్చాయి. బిపిఒ, ఫైనాన్స్, హెచ్‌ఆర్ వంటి రంగాల్లో ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కనిపిస్తున్నాయి. మహిళల తర్వాత అత్యధికంగా 66 లక్షల అప్లికేషన్లు ఫ్రెషర్ల నుంచి వచ్చాయని, గతేడాది కంటే 46శాతం పెరిగాయని నివేదిక వివరించింది. ఎల్ఐసి, పేటిఎం, ఢిలివరి, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రధాన కంపెనీలు లక్షకుపైగా ఓపెనింగ్స్ ప్రకటించడం, మెట్రోలను దాటి చిన్న పట్టణాల్లోనూ రిక్రూట్‌మెంట్‌లు నిర్వహించడం వంటి అంశాలు నియామకాలు పెరిగేందుకు దోహదపడ్డాయని కూడా తెలిపింది.




# బజాజ్ చేతక్ నుంచి మరో ఎలక్ట్రిక్ స్కూటర్

**ముంబై, ఏప్రిల్ 29:** ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో తన చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ల శ్రేణిని మరింత విస్తరించింది. 35 సిరీస్‌లో 3503 పేరిట కొత్త చేతక్‌ను తాజాగా లాంచ్ చేసింది. దీని ధరను రూ.1.10 లక్షలు (ఎక్స్ షోరూమ్)గా నిర్ణయించింది. చేతక్ 35 సిరీస్‌లో అందుబాటు ధరలో తీసుకొచ్చిన మోడల్ ఇదే కావడం గమనార్హం. బజాజ్ సంస్థ చేతక్ 35 సిరీస్‌లో కొన్ని నెలల క్రితం 3501 (టాప్ మోడల్) ధరను రూ.1.30 లక్షలుగా నిర్ణయించింది. చేతక్ 3502 మోడల్ ధరను రూ.1.22 లక్షలుగా పేర్కొంది. అప్పట్లో 3501ను కూడా తీసుకొస్తామని ప్రకటించింది. తాజాగా అందుబాటు ధరలో దీన్ని తీసుకొచ్చింది. ఇది టీవీఎస్ ఐక్యూబ్ 3.4, ఓలా ఎస్1ఎక్స్, ఏథర్ రిజ్టా ఎస్ వంటి మోడళ్లకు పోటీగా నిలనుంది. ఫోన్2 ప్రో వచ్చేసింది.. ఈసారి బాక్స్‌లో ఏదీ మిస్ చేయలేదు! 35 సిరీస్‌లో ఉన్న ఇతర మోడళ్లలానే చేతక్ 3503లోనూ అదే డిజైన్‌ను కొనసాగించారు. ఇందులో 3.5కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ ఉంది. సింగిల్ ఛార్జ్‌తో 151 కిలో మీటర్లు ప్రయాణించొచ్చు. 35 లీటర్ సీట్ స్టోరేజీ కెపాసిటీఇచ్చారు. దీని టాప్‌స్పీడ్ గంటకు 63 కిలోమీటర్లు. హిల్‌హోల్డ్ అసిస్ట్, కలర్ ఎల్‌సీడీ క్లస్టర్, బ్లూటూత్ కనెక్టివిటీ, మ్యూజిక్ కంట్రోల్, కాల్ మేనేజ్‌మెంట్, రైడ్ మోడ్స్ (ఎకో, స్పోర్ట్స్), ఎల్‌ఈడీ హెడ్‌లైట్స్ వంటివి ఉన్నాయి. మెటల్ బాడీతో వస్తోంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.